


fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 8 | విజయవాడ, సోమవారం 8 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



నేడు సెట్ల షెడ్యూల్ విడుదల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ వృతి విద్య, సాంకేతిక కోర్సుల్లో నిర్వహించే ఉమ్మడి ప్రవేశాల పరీక్షల(సెట్స్) తేదీలను విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేయనున్నారు. ఈ నెల 4న ఉన్నత విద్యామండలి సెట్లపై ప్రాథమిక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పరీక్ష ఫీజులు, కన్వీనర్ల నియామకం వంటి అంశాల్ని కూడా మంత్రి గంటా ప్రకటించనున్నారు. ఎంసెట్,లాసెట్, ఐసెట్, పిజిసెట్ తదితర సెట్ల తేదీల నిర్వహణ, పరీక్షలు నిర్వహించే వర్సిటీలను వెల్లడిస్తారు.

బోఫోర్స్ కేసులో
ఇద్దరికి జైలుశిక్ష

న్యూఢిల్లీ: బోఫోర్స్ తుపాకుల కొనుగోళ్ల కేసులో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన ఇద్దరు అధికారులకు ఇక్కడి సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. దాదాపు మూడున్నర దశాబ్దాల నాటి ఈ కేసులో జయంత్ ఆయిల్ మిల్స్ అనే సంస్థకు చెందిన డైరెక్టర్ అభయ్ వి ఉదేషి, ఆ కంపెనీ ఉద్యోగి అయిన హరీష్ పాండ్యా అనే ఇద్దరు వ్యక్తులకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లక్ష్మీకాంత్ బిద్వాయ్ తీర్పు వెలువరించారు. వీరిపై నేరపూరిత కుట్ర, మోసానికి పాల్పడటం వంటి అభియోగాలు నమోదు చేసి కేసు విచారణ జరిపారు. ఈ కేసులో మోసానికి పాల్పడటం అంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నించటమేనని న్యాయమూర్తి బిద్వాయ్ తన తీర్పులో వ్యాఖ్యానించారు. ఇది కేవలం మోసం చేసే ప్రయత్నం మాత్రమే కాదు, పూర్తి స్థాయి మోసమేనని ఆయన స్పష్టం చేశారు. మొత్తం రు.1,437 కోట్ల అంచనా వ్యయంతో 155 ఎంఎం హోవిట్జర్ తరహా 400 తుపాకులను కొనుగోలు చేసేందుకు స్వీడన్‌కు చెందిన బోఫోర్స్ కంపెనీతో భారత ప్రభుత్వం 1986లో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మిగతా 9లో



తూర్పుగోదావరి జిల్లా తుని మండలం తేటగుంటలో యనమల ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి గుర్రపు పందేల పోటీలకు భారీగా హాజరైన జనం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం 48 గుర్రాలు పోటీలో పాల్గొనగా అకానపల్లి చెందిన గుర్రానికి మొదటి బహుమతి లభించింది (వార్త 2వ పేజీలో)



గ్రామస్థాయిలో నీటి ఆడిట్



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

- రాయలసీమను సస్యశ్యామలం చేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాయలసీమ రాళ్లసీమగా మారుతుందనే ఆందోళన నుంచి సీమ ప్రాంతాన్నంతటికీ నీరివ్వాలని ఎన్‌టిఆర్ కలలు కన్నారని, ఆ కలలు నేడు సాకారమవుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆదివారం 5వ విడత జన్మభూమిలో భాగంగా కర్నూలు జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రారంభం అనంతరం 6వ రోజు జన్మభూమి అజెండాలో భాగంగా సహజ వనరులు అనే కార్యక్రమంపై నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సిద్ధాపురం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ఆత్మకూరు మండలంలోని 13 గ్రామాల్లో 21,300 ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు తాగునీరు అందుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, అప్పటి ఇంజనీర్ శ్రీరామ కృష్ణయ్య ముందుచూపుతో చేసిన ఆలోచనలే తెలుగుగంగ, గాలేరునగరి సుజల స్రవంతి, హంద్రీనీవా సుజల స్రవంత ప్రాజెక్టులని పేర్కొన్నారు. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదులతోపాటు 40 నదులు, 40,817 చెరువులు ఉన్నాయని తెలిపారు. అలాగే 15,35,000 పంపుసెట్లు, 1196 ఎత్తిపోతల పథకాలు, 59,176 చెక్‌డ్యాంలు, 6.32 లక్షల పంట కుంటలు ఉన్నాయని చెప్పారు. గోదావరి ప్రతేడాది 3 నుంచి 4 వేల టిఎంసిల దాకా నీరు దిగువకు పోతుందన్నారు. గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు మళ్లించడంతో కృష్ణానీరు శ్రీశైలంలో ఉంచుకొని రాయలసీమకు నీటిని మళ్లిస్తున్నామని మిగతా 9లో

కిమ్‌తో చర్చలకు సిద్ధం :
ట్రంప్

వాషింగ్టన్ : ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలకు తాను సిద్ధంగా వున్నానని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఉభయ కొరియాల మధ్య మంగళవారం నుండి ప్రారంభం కానున్న చర్చలు ఈ దిశగా మార్గం సుగమం చేయగలవని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. థార్మంట్‌లోని కాంప్‌డేవిడ్ కార్యాలయంలో ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను చర్చల ప్రక్రియనే ఎప్పుడు విశ్వసిస్తుంటానన్నారు. కిమ్ జోంగ్ ఉన్‌తో తాను ప్రత్యక్ష చర్చలలో పాల్గొనే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఎవరితోనైనా, ఎప్పుడైనా చర్చలకు తాను మిగతా 9లో




నూరు కోట్లు పైగా ఎగవేసిన ఖాతాలు 1463

కొన్ని ఖాతాల్లో అంతకు మించే
కేంద్రప్రభుత్వ నివేదిక


ముంబయి : జాతీయ ప్రభుత్వ బ్యాంకుల్లోని దాదాపు 1463 ఖాతాలు ఒక్కొక్కటి రూ.వంద కోట్లు లేదా అంతకు మించిన మొత్తాన్ని బ్యాంకులకు ఎగవేశాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదికను విడుదల చేసింది. ఒక్క స్టేట్ బ్యాంకులోనే ఇలాంటి ఖాతాలు 265 ఉన్నాయి . మిగిలిన జాతీయ బ్యాంకులను చూస్తే పంజాబ్ నేషనల్ బ్యాంకులో 143 నిరర్థక ఆస్తుల ఖాతాల(ఎన్‌పిఎ)తో అగ్రభాగన నిలిచింది. వీటి మొత్తం మొత్తం రూ.45,973 కోట్లుగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కెనరా బ్యాంకు నిలిచింది. యూనియన్ బ్యాంకు 72 ఖాతాలు, ఒరియంటల్ బ్యాంకు 68, యుసిఒ బ్యాంకు 62 ఇలాంటి శతాధిక కోట్ల రుణ ఎగవేత ఖాతాలున్నట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ నివేదిక పేర్కొంది. మొత్తం నిరర్థక ఆస్తుల విలువ 7.4 లక్షల కోట్లు గా తెలింది.

ఎఫ్ఆర్‌డిఐని ప్రతిఘటిస్తాం
బ్యాంకు ఉద్యోగుల ప్రకటన
జాతీయస్థాయిలో ప్రచారానికి ప్రణాళిక
2









ఆ లేఖ వాస్తవం కాదు

ఐఎఎస్ అధికారుల సంఘం ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్లు బహిరంగ లేఖ రాసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ ఐఎఎస్ అధికారుల సంఘం స్పందించింది. ఆ లేఖ తాము రాసిందికాదని, అందులో ఏ మాత్రం వాస్తవం కాదని తెలిపింది. ఈ మేరకు ఐఎఎస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదని వెల్లడించారు. తాను చేస్తున్న అభివృద్ధి పనులకు కలెక్టర్లు సహకరించడం లేదని, అవస రమైతే వారికి వ్యతిరేకంగా దీక్ష చేస్తానని చంద్రబాబు ఇటీవల ఒక సభలో వ్యాఖ్యానించారు. సిఎం చంద్రబాబు చేస్తున్న అవినీతిలో తాము భాగస్వా మ్యం కాలేమని, కనీసం పనులు కూడా చేయకుండా టిడిపి కార్యకర్తలు దౌర్జన్యంగా బిల్లులు తీసుకుంటున్నారని కలెక్టర్లు రాసినట్లుగా ఒక నకిలీ బహిరంగ లేఖ సోషల్ మీడియాలో మూడు రోజులుగా హల్‌చల్ చేస్తోంది. ఇది సిఎం కార్యా లయం వరకు చేరడంతో దీనిపై ఐఎఎస్ అధికారుల సంఘం వివరణిచ్చింది.

ప్రారంభం



తూర్పుగోదావరి జిల్లా ముప్పాడలో భువనశ్రీ జాంథానీ షోరూంను నందమూరి హరికృష్ణ, పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎన్ వర్మ ప్రారంభించారు. అనంతరం జాంథానీ చీరలను పరిశీలించారు.

నలుగురి ప్రాణాలు తీసిన ఈత సరదా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్నేహితులతో కలిసి సరదాగా స్నానానికి వెళ్లిన నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం భోగాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కామవరపుకోట మండలం కొత్తూరుకు చెందిన కలిదిండి హరికృష్ణంరాజు(22), చింతల పూడికి చెందిన గుమ్మి విజయశంకర్ (22), కృష్ణాజిల్లా కలిదిండి మండలం కొండంగికి చెందిన సాయికిరణ్ పరశురామ్(22) రామ చంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. వీరితోపాటు చింతలపూడికి చెందిన కోట సాయి(21) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం వారు తమ ఇళ్ల నుంచి కళాశాల బస్సులో బయలుదేరారు. కళాశాలకు వెళ్లకుండా భోగాపురం సమీపంలోని జామతోటలోకి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు గడిపి పక్కనే ఉన్న చెరువులో ముగ్గురు స్నానానికి దిగారు. హరికృష్ణ కొంచెం ముందుకు వెళ్లడంతో గొయ్యిలో చిక్కుకుపోయి ఊపిరాడక మృతిచెందాడు. మిగిలిన ఇద్దరూ అతన్ని కాపాడేందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. ఒడ్డున ఉన్న సాయి ఇది గమనించి వారందరినీ కాపాడేందుకు ప్రయత్నించి అతనూ మృత్యువాత పడ్డాడు. ఆదివారం జామతోటలోకి వచ్చిన కూలీలు అక్కడ ఉన్న బ్యాగులు, దుస్తులు, అతను ఐడెంటిటీ కార్డులు, మద్యం బాటిళ్లు గుర్తించి చెరువు వద్దకు వెళ్లి చూశారు. హరికష్ణ మృతదేహం చెరువు ఒడ్డున కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలూ చెరువులో లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. స్త్రీ, పురుషులకు సమానంగా వేతనాలు చెల్లిస్తున్న తొలి దేశం?
2. భారత్, ఇండోనేషియా సంయుక్త కమీషన్ 5వ సమావేశం ఎక్కడ జరిగింది?
3. ఆర్‌బిఐ ఇటీవల కొత్త రంగు, డిజైన్‌తో విడుదల చేసిన నోటు?
4. ఇటీవల వికాస్ సమీక్ష యాత్రలో భాగంగా సుమారు 200 ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేసిన ముఖ్యమంత్రి?
5. టాటా ఓపెన్ 2018లో పురుషల సింగిల్స్ విజేత?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

దక్షిణ అండమాన్‌కు ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా 4.5 కిలోమీటరు ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇది రాష్ట్రంపై ఎలాంటి ప్రభావమూ చూపించే అవకాశం లేదని చెబుతోంది. నాలుగు రోజులపాటు కోస్తా, సీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని తెలిపింది. ఉత్తర, ఈశాన్య దిశ నుంచి, సముద్ర ఉపరితలం నుంచి చలి గాలులు రాష్ట్రంపైకి వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు పవర్‌లిఫ్టర్లు మృతి

న్యూఢిల్లీ : దట్టమైన పొగమంచు ఐదుగురు జాతీయస్థాయి పవర్‌లిఫ్టర్లతో సహా మొత్తం ఆరుగురును కబళించింది. ఈ ప్రమాదంలో ప్రపంచ చాంపియన్ సాక్షమ్ సింగ్ కూడా మరణించాడు. ఆదివారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఢిల్లీ-పానిపట్ జాతీయ రహదారి 1పై ఢిల్లీకి సమీపంలోని అలిపూర్ గ్రామంలో ఆరుగురు పవర్ లిఫ్టర్లు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురయింది. దట్టమైన పొగ మంచులో కరెంటు స్థంభానికి ఢీ కొంది. దీంతో కారులోని ఆరుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. అథ్లెట్లను సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, నలుగురు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ సాక్షమ్ సింగ్, రోహిత్ ముందుగా మాక్స్ ఆసుపత్రికి తరలించారు. సాక్షమ్ సింగ్ పరిస్థితి తీవ్రంగా వుండటంతో అక్కడి నుంచి ఎయిమ్స్‌కు తరలించారు. సాక్షమ్ సింగ్ ఆసుపత్రిలో మృతిచెందారు. మృతి చెందిన వారిని తికమ్‌చాంద్, సౌరభ్, యోగేష్, హరీష్ రాయ్‌గా గుర్తించారు. తీవ్ర గాయాలైన సాక్షమ్ సింగ్ 2017లో మాస్కో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధిం చాడు. అంతకు ముందు ఏడాదిలో జూనియర్ కేటగిరిలోనూ స్వర్ణం సాధించాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం నాల్గు గంటలకు చోటుచేసుకోగా, పోలీసులు సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి డ్రైవర్‌పై సెక్షన్ 304ఏ ప్రకారం కేసు నమోదు చేశారు. ప్రమాదానికి పొగ మంచుతో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం కూడా కారణమని పోలీసులు చెబుతున్నారు. రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా వీరందరూ పార్టీ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో మద్యం సీసాలను కూడా పోలీసులు గుర్తించారు.

మూతబడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తా..!

సంకల్పయాత్రలో జగన్



దామలచెరువులోని విజయా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరిగిన సభలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-పాకాల

తాము అధికారంలో రాగానే జిల్లాలో మూతబడిన పాల డెయిరీ, సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలంలో ప్రజాసంకల్ప యాత్ర పుదిబట్లబైలునుంచి ఆదివారం ప్రారంభమయ్యింది. గుండ్లగుట్టపల్లి, తురకపల్లి, పాలగుట్టపల్లిల్లో ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్‌కు స్వాగతం పలికారు. అనంతరం దామలచెరువులోని విజయా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సభ జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మట్టి, ఇసుక, మరుగుదొడ్ల నిర్మాణంలోనూ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. చంద్రబాబు సిఎంగా తొమ్మిదేళ్లు, ప్రతిపక్షనేతగా తొమ్మిదేళ్లు, ప్రస్తుతం సిఎంగా నాలుగేళ్లు పాలన చేసినా పుట్టిన చంద్రగిరి నియోజకవర్గానికి, జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో138 పంచాయతీలు ఉన్నా ఒక్క పంచాయతీలో కూడా మూడు పడకల ఆస్పత్రికి నోచుకోలేదన్నారు. జిల్లాలో మూతబడిన చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను, చిత్తూరు పాల డెయిరీని తెరిపిస్తానన్నారు.

జనంతో ముఖాముఖి

చిత్తూరు డెయిరీ కోసం 11ఏళ్ల నుంచి చొక్కా, చెప్పులు వేసుకోకుండా ఉన్న వెంకటాచలపతి అనే రైతు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎంతో పేరు పొందిన చిత్తూరు డెయిరినీ చంద్రబాబు పథకం ప్రకారం నాశనం చేసి, మూతబడేలా చేశారని తెలిపారు. జగన్ స్పందిస్తూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే మూతబడిన పరిశ్రమలను పునఃప్రారంభిస్తానని చెప్పారు. పాలపై లీటర్‌కు నాలుగు రూపాయల సబ్సిడీ ఇస్తానని వెల్లడించారు. తమకు పావలా వడ్డీరుణాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇవ్వలేదని సుమతి వాపోయారు. రేషన్‌కార్డులను పార్టీలవారీగా వేరుచేస్తూ అంతులేని అవినీతికి పాల్పడుతున్నారని గణేష్ తెలిపారు.

హోరాహోరీగా గుర్రపు పందేలు

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - కోటనందూరు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా తుని మండలం తేటగుంటలో యనమల ఫౌండేషన్ రాష్ట్రస్థాయి గుర్రపు పందేల పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. పోటీల్లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన 48 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో రెండున్నర కిలోమీటర్ల రెండు రౌండ్లలో విశాఖజిల్లా అనకాపల్లికి చెందిన గుర్రం మూడు నిమిషాల 13 సెకన్లలో గమ్యస్థానానికి చేరుకుని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విశాఖజిల్లా గవరవరం ప్రాంతానికి చెందిన గుర్రం 3 నిమిషాల 14 సెకన్లలో గమ్య స్థానానికి చేరుకుని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా తాటిపర్తికి చెందిన గుర్రం మూడు నిమిషాల 27 సెకన్లలో గమ్యస్థానానికి చేరుకుని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. గుర్రాల అందాల పోటీల్లో మగ గుర్రాలకు సంబంధించి తుని, విశాఖ, విశాఖ జిల్లా మాచవరానికి చెందిన గుర్రాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆడ గుర్రాల్లో కాకినాడకు చెందిన అశ్వాలు ప్రథమ, ద్వితీయ స్థానాలనూ, రాజమహేంద్రవరానికి చెందిన గుర్రం తృతీయ స్థానాన్ని సాధించింది. గుర్రాల యజమానులకు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు, కాకినాడ ఎంపీ తోట నరసింహం, జెడ్‌పి చైర్మన్ జ్యోతుల నవీన్, తుని మార్కెట్‌యార్డ్ చైర్మన్ యనమల కృష్ణుడు, తుని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పోల్నాటి శేషగిరి, తుని మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సుర్ల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకు డిపాజిట్లకు ప్రమాదం

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి



ఫైనాన్సియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డిఐ) బిల్లుతో బ్యాంకుల్లో ప్రజల డిపాజిట్లకు ప్రమాదం వాటిల్లే ప్రమాదముందని పిడిఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ హెచ్చరించారు. భారతదేశంలో ప్రభుత్వ బ్యాంకులు ఇంకా దివాలా తీయనందున ఈ బిల్లుతో తక్షణం డిపాజిట్లకు ఇబ్బందులు రాకపోవచ్చు కానీ భవిష్యత్తులో సమస్యలు తప్పకపోవచ్చని చెప్పారు. ప్రయివేటు బ్యాంకులపై మాత్రం తక్షణ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో ఇన్స్యూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యాన 'ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు-దాని పర్యవసానాలు' అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా బ్యాంకు దివాలా తీస్తే దాన్ని ప్రభుత్వ సొమ్ముతో గట్టెక్కిస్తారని, దీన్నే బెయిల్ అవుట్ అంటారని అన్నారు. 1969 నుంచి ఇప్పటి వరకు భారతదేశంలో ఇదే జరుగుతోందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన జి20 దేశాల సమావేశం నిర్ణయం మేరకు దివాలా తీసిన బ్యాంకులను డిపాజిట్ సొమ్ముతో గట్టెక్కించాలని కేంద్ర ప్రభుత్వం బిల్లు తయారు చేసిందన్నారు. దీన్ని బెయిల్ ఇన్ అంటారని చెప్పారు. జి20 దేశాల్లోని 15 దేశాల్లో బెయిల్ ఇన్ అమలు చేయడం లేదని, కేంద్ర ప్రభుత్వం మాత్రం దీన్ని అమలు చేసేందుకు సిద్ధపడిందని తెలిపారు.

ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లులోని 52 క్లాజ్‌ను తొలగించాలి

ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు లోని క్లాజు 52ను తొలగించాలని ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏదైనా ఒక బ్యాంకు మూతపడితే, మూతపడే పరిస్థితులు ఉంటే ఆ బ్యాంకును క్లాజు 52 ప్రకారం రివల్యూషన్ కార్పొరేషన్‌కు అప్పగిస్తారని చెప్పారు. అటువంటప్పుడు ఆ బ్యాంకుకు చెందిన డిపాజిట్లను, పొదుపు సొమ్మును రద్దు చేయడం, షేర్లలో పొదుపు చేయడం, లేదా డిపాజిట్ కాల పరిమితిని పెంచడం తదితర ఏ చర్యనైనా గైకొనే అధికారం రివల్యూషన్ కార్పొరేషన్‌కు కట్టబెడుతూ క్లాజు 52ను బిల్లులో ప్రతిపాదించారని తెలిపారు.

వైద్య విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు : కోడెల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : వైద్య విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోనే అత్యాధునిక సదుపాయాల్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. ఆదివారం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో రూ. 6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తాత్కాలిక పరిపాలనా భవనం, తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1981లో సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రారంభమయ్యిందని, దీనిలో 250 పిజి మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జన్మభూమి-మాఊరు స్ఫూర్తితో రూ.10లక్షలతో జిమ్‌ను సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేయడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఎఫ్‌ఆర్‌డిఐని ప్రతిఘటిస్తాం

బ్యాంకు ఉద్యోగుల ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాధారణ ప్రజల డిపాజిట్ల భద్రతకు పెనుముప్పుగా మారే ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును ప్రతిఘటిస్తామని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) ప్రకటించింది. ఈ బిల్లు అమలులోకి వస్తే చోటుచేసుకునే పరిణామాలను వివరిస్తూ జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తామని తెలిపింది. ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా రూపొందించిన ఈ బిల్లును తక్షణం కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి లోక్‌సభ స్పీకర్‌కు అందచేస్తామని, బ్యాంకింగ్ రంగ పరిరక్షణకు సంబంధించిన మరో 22 డిమాండ్లు కూడా ఆ వినతిపత్రంలో చేరుస్తామని తెలిపింది. విజయవాడలోని కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంకు ప్రాంగణంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ ఈ వివరాలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డిఐ) బిల్లును బ్యాంకు ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రస్తుతం బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో రూ.110 లక్షల కోట్లు ప్రజాధనం ఉందని, దానికి భద్రత అవసరమన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల్లో భాగంగా పలు ప్రజా వ్యతిరేక విధానాల్ని తీసుకొస్తోందన్నారు. అందులో భాగంగానే ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు తీసుకొచ్చి, బ్యాంకు డిపాజిట్లపై ఉన్న రక్షణను తొలగించే ప్రయత్నం చేస్తోందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం బ్యాంకింగ్ సేవలు విస్తరించాలంటే మరిన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల విస్తరణ జరగాలన్నారు. కానీ, ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. బ్యాంకుల్ని విలీనం చేయడం ద్వారా ఉన్న కొద్దిపాటి శాఖలు కూడా మూతపడి, ప్రజలకు సేవలు తగ్గిపోతాయన్నారు. ఎఐబిఇఎ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు మాట్లాడుతూ బ్యాంకులకు మొండి బకాయిలు ప్రధాన సమస్యగా తయారయ్యంద న్నారు. బ్యాంకులకు రూ.15 లక్షల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయన్నారు. వాటిలో ఎక్కువశాతం కార్పొరేట్ సంస్థలవేనన్నారు. 35 కార్పొరేట్ కంపెనీలు దాదాపు రూ 7 లక్షల కోట్లు బకాయిపడితే, మరో 23 కంపెనీలు రూ 4.5 లక్షల కోట్ల వరకు బ్యాంకులకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

అందులో ట్రాన్స్‌ట్రాయ్, ల్యాంకో వంటి కంపెనీలున్నా ప్రభుత్వాలు మాత్రం వాటికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఇచ్చి వివిధ ప్రాజెక్టుల కాంట్రాక్ట్ అప్పగిస్తూ మద్దతు తెలుపుతోందన్నారు. నోట్ల రద్దుతో సామాన్యులు కనీసం రూ 5 వేలు ఆ నెలలో తీసుకోలేని పరిస్థితి ఉంటే, కొన్ని కార్పొరేట్ సంస్థలకు మాత్రం కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయనిచెప్పారు. మొండిబకాయిదారులపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారి వ్యక్తిగత ఆస్తుల్ని జప్తు చేసి బకాయిలు రికవరీ అయ్యేలా చూడాలన్నారు. బకాయిదారుల పేర్లను బయటపెట్టాలన్నారు. అవేమీ చేయకుండా సామాన్య ప్రజలపై కనీస బ్యాలెన్స్ ఉండాలనే నిబంధనతో ఎస్‌బిఐ వంటి బ్యాంకులు నష్టాన్ని భర్తీ చేసే చర్యల్ని చేపడుతున్నాయన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుతో ఎస్‌బిఐ దాదాపు రూ.1800 కోట్ల మేర లాభాన్ని గడించిందన్నారు. ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం వస్తే బ్యాంకు ఉద్యోగులు మూకుమ్మడిగా సమ్మెకు దిగుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సంక్షిప్తం

జిఎడికి దుర్గ గుడి ఈవో సరెండర్ : ఉత్తర్వులు జారీ

అమరావతి బ్యూరో : దుర్గగుడి ఈవో సూర్యకుమారిని సాధారణ పరిపాలనా శాఖ(జిఎడి)కు సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధను నియమించింది. ఆలయంలోకి బయట వ్యక్తులు వెళ్లకుండా చూడడంలో ఈవో విఫలం కావడంపై ముఖ్యమంత్రి సీరియస్ అయిన విషయం తెలిసిందే.

పిఎస్ఎన్ నూతన కమిటీ ఏర్పాటు

అమరావతి బ్యూరో : ప్రొఫెషనల్ స్టూడెంట్ నెట్‌వర్క్(పిఎస్ఎన్) నూతన రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పడింది. పిఎస్ఎన్ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్‌డ లాల్ సలాం, కో కన్వీనర్లుగా దాసరి వినయ్, ఎల్ సాగర్, అఖిల్, అక్బర్ లీ, అజయ్‌లతో పాటు 15 మందితో కమిటీ ఏర్పడింది.

పాలేకర్ వ్యాఖ్యలు అర్ధరహితం

అమరావతి బ్యూరో : ప్రకృతి సేద్యం పితామహుడిగా చెప్పుకుంటున్న సుభాష్ పాలేకర్ వ్యాఖ్యల్ని రాష్ట్రవ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని సంఘం అధ్యక్షులు సిహెచ్ఎన్‌వి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ నిధులతో రైతులకు ప్రకృతివ్యవసాయంపై శిక్షణ ఇస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖపై విమర్శలు చేయడం తగదన్నారు.

సమర్థులైన అధికారులకు అవార్డులు : సిఎం

అమరావతి బ్యూరో : జన్మభూమి నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరించిన అధికారులకు శాఖాపరంగా అవార్డులు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బాగా పనిచేసిన ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు 11, 12 తేదీల్లో సత్కరించాలని సూచించారు. జన్మభూమి కార్యక్రమంపై తన నివాసం నుంచి ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డులు, పింఛన్లు, ఇళ్ళ కోసం కుటుంబాలు వేరుపడటం మంచిదికాదన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో కొనసాగుతున్న వారికి ప్రభుత్వ పథకాలతో లబ్ధికలిగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కుటుంబ వ్యవస్థ ఎంతో విశిష్టమైందని, ఇది విచ్ఛిన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

జన్మభూమి ఆధారంగా జిల్లాలకు గ్రేడ్‌లు

పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమిలో పనితీరు ఆధారంగా జిల్లాలకు గ్రేడ్‌లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం అన్ని జిల్లాలూ సి గ్రేడ్‌లోనే ఉన్నాయన్నారు. 2, 3వ రోజుల్లో కృష్ణా జిల్లా మాత్రమే బి గ్రేడ్ సాధించిందన్నారు. విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని ప్రజల సంతృప్తే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వినతులు, ప్రజల హాజరు వంటి అంశాల్ని ఆన్‌లైన్‌లో నమోదుకు 40 శాతం, ప్రజల అభిప్రాయాలకు 40 శాతం, మీడియాలో వార్తలు, కథనాలు, సామాజిక మాధ్యమం, ఇతర అంశాలకు 20 శాతం మార్కుల్ని కేటాయించి గ్రేడ్‌లు ఇస్తున్నామన్నారు. 50 శాతం మార్కులు సాధిస్తే 'సి' గ్రేడ్, 50 నుంచి 70 శాతం మధ్య బి గ్రేడ్ , 70 శాతం దాటితే ఎ గ్రేడ్‌ను జిల్లాలకు కేటాయిస్తున్నామన్నారు. అర్హులకు ఫించన్లు అందుతున్నాయని 68 శాతం మంది, అర్జీలు పరిష్కారించే తీరు బాగుందని 49 శాతం మంది, గ్రామాల అభివృద్ధి మెరుగ్గా ఉందని 51 శాతం మంది సర్వేలో చెప్పారన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఇప్పటివరకు 1,47,068 వినతులు అందాయని, 7,29,327 మంది ప్రజలు హాజరయ్యారని చెప్పారు. 21,810 కుటుంబాలకు రేషన్ కార్డులు, 12,139 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామన్నారు. 4,000 మందికి టూల్ కిట్స్, 1,899 వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఆదివారం సాయంత్రం వరకూ అందిన సమాచారం మేరకు మొత్తం 41,105 వినతులు అందగా, 2,14,131 మంది ప్రజలు పాల్గొన్నారు. 6,809 కుటుంబాలకు రేషన్ కార్డులు, 3,700 మందికి పింఛన్లు, 699 వైద్య శిబిరాలు, 827 మందికి టూల్ కిట్‌లు పంపిణీ చేశామన్నారు.



ఆంధ్రా ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సూరంపల్లి ఘటనపై విచారణ చేపడతాం

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

సూరంపల్లి పారి శ్రామిక వాడ ప్రమాద ఘటనపై పూర్తి విచారణ చేపట్టి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ క్షతగాత్రులు త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి 5 లక్షలు, గాయాలైన వారికి రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాల్ని ప్రభుత్వం అన్ని విధాలా అదుకొంటుందన్నారు. ఘటనలో శివశంకర్ కుమార్, ముజాహిద్ అహ్మద్, సత్యనారా యణ, అబ్దుల్ ముబారక్ అలీ మృతిచెందారన్నారు. గాయపడిన వారికి ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. సిఎంతో పాటు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులున్నారు.

గవర్నర్ వ్యవస్థను కేంద్రం నాశనం చేస్తోంది : నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గవర్నర్ వ్యవస్థను కేంద్రం సర్వనాశనం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. తమ స్వప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను ఉపయోగించుకోవడం శోచనీయమన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఐ, ఎన్నికల సంఘం, గవర్నర్ వ్యవస్థను మోడీ ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తోందన్నారు. బిజెపికి, మోడీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా దేశద్రోహం కేసులో అరెస్టు చేయించటం, అవసరమైతే సిబిఐతో దాడులు చేయించేలా కేంద్రం దిగజారిందన్నారు. హెచ్1బి వీసాలపై కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల భారతదేశానికి చెందిన సుమారు 15 లక్షల మంది హెచ్1బి వీసాదారులు ఇబ్బందిపడతారన్నారు. విజయవాడలో మూడు రోజులపాటు సోమవారం నుంచి జరుగనున్న సిపిఐ జాతీయ సమితి సమావేశాలలో భవిష్యత్ రాజకీయ విధానంపై ముసాయిదాను రూపొందిస్తామన్నారు. కేంద్రంలోని బిజెపి-ఎన్‌డిఎ పాలన పూర్తిగా వివాదాస్పదంగా మారిందన్నారు. మతోన్మాదంతో దేశాన్ని విభజించేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని, అందుకే వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక వేదికను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ వేదిక ఏర్పాటును విజయవాడ నుంచే ప్రారంభించాలని పార్టీ భావిస్తోందని, దీనిపై కూడా జాతీయ సమావేశాల్లో చర్చించనున్నామని నారాయణ తెలిపారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న బాలీవుడ్ నటుడు మిలింద్ సోమన్

అవగాహనతో క్యాన్సర్‌ను జయించొచ్చు

పింక్ రన్‌లో బాలీవుడ్ నటుడు మిలింద్ సోమన్

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్, విశాఖ

అవగాహనతో క్యాన్సర్‌ను జయించవచ్చని బాలీవుడ్ నటుడు మిలింద్ సోమన్ అన్నారు. విశాఖ బీచ్‌రోడ్డులో పింక్‌రన్ పేరుతో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. యునైటెడ్ సిస్టర్స్ ఫౌండేషన్, ఎరీనా ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిలింద్ సోమన్ మాట్లాడుతూ.. దేశంలో రొమ్ము క్యాన్సర్‌తో బాధపడే వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. ఏ వయసు వారికైనా ఏ సమయంలోనైనా క్యాన్సర్ వచ్చే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నటుడు సోమన్ తల్లి ఉషా సోమన్, డాక్టర్ మురళీకృష్ణ, రన్ నిర్వాహకులు శిరీష, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పులికాట్ సరస్సు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పులికాట్ సరస్సు రెండు ముఖద్వారాల అభివృద్ధికి రూ.49కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. తొలుత వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్‌ను గాలిలోకి వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సురభి గాయత్రి నాట్యబృందంతో నిర్వహించిన ఫెస్టివల్ స్వాగత నృత్యం అతిథులను అలరించింది.



జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కిడ్నీ రాకెట్‌పై విజిలెన్స్ ఆరా

6 రోజుల్లో కిడ్నీ ఆపరేషన్‌కు అనుమతిపై అనుమానాలు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నరసరావుపేట కిడ్నీ రాకెట్ వ్యవహారం గుంటూరు నగరం చుట్టూ తిరుగుతోంది. దీనిపై విజిలెన్స్ రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి (జిజిహెచ్) పాత్ర ఎంత ఉందనే దానిపై ఆరా తీస్తున్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ రాజునాయుడును కలిసిన అధికారులు 2014 నవంబరు నుంచి ఎంతమంది కిడ్నీ బాధితులకు ఆపరేషన్ చేసుకునేందుకు అనుమతిచ్చారు? ఎన్ని ఆసుపత్రుల్లో కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్నారు? దరఖాస్తు చేసుకున్న ఎన్ని రోజుల్లో అనుమతిస్తున్నారు? తదితర వివరాలను ఇవ్వాలని కోరారు. పూర్తి వివరాలను సోమవారం ఇస్తామన్న సూపరింటెండెంట్ నెలకు ఆరు కేసులు అనుమతుల కోసం వస్తాయని చెప్పారు. మరోవైపు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిగురుపాటి శివనాగేశ్వరరావుకు కేవలం ఆరు రోజుల్లోనే అనుమతి ఏ విధంగా ఇచ్చారు? ఈ వ్యవహారంలో ఎవరి ఒత్తిడి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు? ఇదే మొదటిసారా? లేదా గతంలోనూ అనుమతులిచ్చారా? అనే కోణంలో విజిలెన్స్ పూర్తి వివరాలను సేకరిస్తోంది. శివనాగేశ్వరరావుకు చికిత్స మాత్రమే చేశామని, విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారని గుంటూరులోని వేదాంత ఆస్పత్రి ఎమ్‌డి చింతా రామకృష్ణ చెబుతున్న నేపథ్యంలో తప్పుడు ధ్రువపత్రాలపైనా విజిలెన్స్ దృష్టి సారించింది. రావూరి రవి పేరుతో ఒకరు, దేవరగట్ట గోపి పేరుతో మరొకరు కిడ్నీ దాతలుగా ముందుకొచ్చి తప్పుడు అడ్రస్‌లు, ఫోన్ నంబర్లను ఇచ్చిన సంగతి పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అసలీ కిడ్నీ రాకెట్ వెనుక ఎవరు ఉన్నారనే కోణంలోనూ విజిలెన్స్ లోతుగా పరిశీలిస్తోంది.

పారిశ్రామికవాడలపై నీలినీడలు



దొనకొండ, కనిగిరి రైతులను సాకుగా చూపి దాటేసిన సిఎం

2013 భూసేకరణచట్టం అమలు చేయాలంటున్న రైతులు

మౌలిక సదుపాయాలు, పరిశ్రమల ఏర్పాటులో కనిపించని చిత్తశుద్ధి

ప్రజాశక్తి - ఒంగోలు ప్రతినిధి

ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం వెనుకాముందు ఆలోచించకుండా ఇచ్చిన హామీలు ఆచరణలో గంగరగోళానికి దారితీస్తున్నాయి. ప్రకాశం జిల్లాలో దొనకొండ, కనిగిరి ప్రాంతాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక వాడల విషయంలో ఇపుడు ఇదే జరిగింది. భూసేకరణలో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని రైతులు కోరుతుంటే.. రైతులు సహకరించకపోవడం వల్లే పనులు సాగడం లేదని సిఎం చంద్రబాబు చెప్పడం ఆయన నైజానికి నిదర్శనంగా చెప్పొచ్చు.

ఎన్నికల ప్రచారంలో ఈ రెండు పారిశ్రామికవాడలను ఏర్పాటు చేస్తామని అప్పడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చాక రాజధాని ప్రకటన సమయంలోనూ జిల్లాలో చేపట్టే భారీ ప్రాజెక్టుల్లో వీటిని చేర్చారు. మూడున్నరేళ్ల గడిచినా వీటిపై ఇప్పటికీ స్పష్టత లేదు. తాజాగా దర్శిలో జన్మభూమి సభలో సిఎం చంద్రబాబు దొనకొండ పారిశ్రామికవాడ విషయంలో రైతుల నుంచి ఇబ్బందులు ఉన్నాయని, రైతులు సహకరిస్తే పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు పోతామని చెప్పారు. సిఎం మాటలతో ఇక్కడ పరిశ్రమలు కష్టమేనన్న ప్రచారం కూడా మొదలైంది. అంటే దొనకొండ పారిశ్రామికవాడ ఇప్పట్లో సాధ్యం కాదని తేలిపోయింది. మంత్రి శిద్దా రాఘవరావు ఇక్కడ పరిశ్రమల కేంద్రం ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు వృథా అయ్యాయి. పలు కంపెనీలను ఇక్కడకు రప్పించడం.. భూములను చూపించడం.. కంపెనీలు పెడితే అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇవ్వడం లాంటి పరిణామాలన్నీ వృథా అనే చర్చ జరుగుతోంది.

కనిగిరి నిమ్జ్ పై దృష్టి పెట్టని ప్రభుత్వం

కనిగిరి నియోజకవర్గంలోనూ గత యుపిఎ ప్రభుత్వం పారిశ్రామిక వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. కనిగిరిలో నిమ్జ్ పేరుతో సెజ్‌ను ప్రకటించింది. పామూరు, పీసీపల్లి మండలాల్లో 14,235 ఎకరాలను గుర్తించారు. ఇందులో మూడు రకాల భూములున్నాయి. పట్టా భూమి, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములున్నాయి. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. ఇక్కడ కూడా ప్రారంభంలో భూసేకరణ పేరుతో గ్రామాల్లో హడావుడి చేశారు. రైతులకు చెప్పకుండానే సర్వేలు చేశారు. అన్నీ కాగితాలపైనే సాగాయి. ఇక్కడైతే సర్వేలతోనే ఆగిపోయాయి. ఎక్కడా భూములను సేకరించలేదు. రైతులు ఇక్కడ పరిశ్రమలకు భూములు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. పరిహారం తేల్చాలని చెప్పారు. అధికారులు ఏ విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదు. ఇక్కడ రూ.38 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 75 వేల మందికి ప్రత్యక్షంగానూ, లక్ష మందికి పరోక్షంగానూ ఉపాధి దొరుకుతుందని భ్రమలు కల్పించారు. ఏటా రూ.4,200 కోట్లు ఆదాయం వస్తుందని అంచనాలు వేశారు. ఇప్పటికీ అక్కడ పరిశ్రమలు పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోలేదు. ఈ రెండు పారిశ్రామిక వాడలను రామాయపట్నం పోర్టుతో అనుసంధానం చేయా లని కూడా ప్రతిపాదించారు. అసలు రామాయ పట్నం పోర్టు వ్యవహారమే ప్రశ్నార్థకంగా మారిం ది. ఇలా జిల్లాలో ప్రకటించిన భారీ పారిశ్రామిక వాడలను ప్రభుత్వమే మరుగన పడేస్తోంది.

దొనకొండపై భారీ ఆశలు కల్పించిన ప్రభుత్వం

దొనకొండ ప్రాంతంలో చుట్టుపక్కల మండలాల్లో సుమారు 25 వేల ఎకరాలను గుర్తించారు. ఇందులో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. మొదట్లో 60 వేల ఎకరాలను ప్రతిపాదించారు. తర్వాత కుదించారు. 25 వేల ఎకరాల్లో సర్వే చేశారు. వీటిని సేకరించేందుకు సన్నాహాలు చేశారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిలో 2,450 ఎకరాలు ఎపిఐఐసికి అప్పగించారు. ఈ భూములలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికీ పనులు జరగలేదు. భూములన్నీ యథతథంగానే ఉన్నాయి. కారణం ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి మాటలు చెబుతున్నారే తప్ప స్పష్టమైన ప్రణాళికతో ఎవరూ ముందుకు రాలేదు. మంత్రి శిద్దా రాఘవరావు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో దొనకొండ ఉంది. భూముల పరిశీలనకు చైనా బృందం వచ్చింది. తర్వాత స్పెయిన్ నుంచి మరో బృందం వచ్చింది. ఇక్కడ హెలికాప్టర్ విడిభాగాల కేంద్రాన్ని పెడతామని చెప్పారు. చైనా నుంచి ఇక్కడకు భారీగా పెట్టుబడులు వస్తాయని, ఒప్పందమూ జరిగిందని చెప్పారు. అవేవీ ఆచరణలో కనిపించలేదు. ఇక్కడ విండ్ పవర్, సోలార్ పవర్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఇక్రిశాట్ పరిశోదన కేంద్రం, ఇండస్ట్రియల్ పార్కు ఇలా అనేక పరిశ్రమలకు ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములను సేకరించి అందులో పరిశ్రమలు వచ్చేలా మౌలిక సదుపాయాలు కల్పించడంలోనే ప్రభుత్వం విఫలమైంది.

లేఖరుల ఉపాధికి ఎసరు

- ఆన్‌లైన్ విధానంలో డాక్యుమెంటేషన్
- ఆందోళనలో పదివేల మందికి పైగా లేఖరులు, స్టాంపు వెండర్లు



కడప రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

ప్రజల ఆస్తులను, హక్కులను పదిలం చేసే పనిలో తమ చేతికి పని చెప్పే దస్తావేజు లేఖరుల, స్టాంపు అమ్మకందార్ల ఉపాధి ఊడుతోంది. ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ల పద్ధతికి తెరలేపి ఏళ్ల తరబడిగా సేవలందిస్తున్న వారి చేతులకు ప్రభుత్వం సంకెళ్లు వేసింది. దీంతో అనేక కుటుం బాలు రోడ్డున పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ప్రజల ఆస్తుల నిర్ధారణ, పరిరక్షణ, నిర్వహణ బాధ్యతలను చేపట్టే రిజిస్ట్రేషన్ శాఖలో అనుబంధం గా దస్తావేజు లేఖరులు పని చేస్తున్నారు. ఆస్తి అనుబంధ దస్తా వేజులు, పట్టాదారు పాసుపుస్త కాలు, 10-1, అడంగ ల్స్‌ను ప్రజలు తెచ్చిస్తే వాటిని పరిశీలిస్తారు. ఆస్తి హక్కులను కనుగొని దస్తావేజులను రూపొందించి కక్షిదారులకు అంది స్తుంటారు. కక్షిదారులు వాటిని తీసుకెళ్ళి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిం చుకుంటుం టారు. దీని కోసం నామమాత్రపు ఫీజులను కక్షిదారుల నుంచి పొందుతుంటారు. ఈ విధానం "స్టాంపుల చట్టం-1902" అమలుకు పూర్వం నుంచే కొనసాగుతూ వస్తోంది. ఈ విధానానికి స్వస్తి పలుకుతూ దస్తావేజుల తయారీలో జిఒ నెంబరు 606, 607లను జారీ చేస్తూ ఆన్‌లైన్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ఆన్‌లైన్‌లోనూ సమస్యలే

ఆన్‌లైన్ విధానంలోనూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లోని అత్యధిక రైతులు నిరక్ష్య రాస్యులు కావడం వల్ల ఈ విధానం సమస్యగా మారిం ది. ఆన్‌లైన్ ఫార్మాట్ ఆంగ్లంలో ఉండటంతో రైతులు డేటాను తప్పుగా నమోదు చేస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించిన దస్తావేజులను అధికారులు సకాలంలో అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. తద్వారా అవసరమైన ఇసిలను సకాలంలో పొందలేకున్నారు.

ఉపాధికి దూరం

వృత్తిని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న దస్తావేజు లేఖరులకు ఈ విధానంతో ఉపాధికి ఎసరు పెట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కడప జిల్లాలోని 18 సబ్ రిజిస్ట్రార్‌ల పరిధిలో దస్తావేజు లేఖరులు, స్టాంపు అమ్మకందార్లు, డిటిపి ఆపరేటర్లు, సహాయకులు, ఫొటో గ్రాఫర్లు మొత్తం కలిపి దాదాపు 600 మంది పని చేస్తున్నారు. రాష్ట్రంలోని 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దాదాపు 10 వేల మందికి పైగా పని చేస్తున్నారు. ప్రస్తుతం పాత పద్ధతికి స్వస్తి పలుకుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో వీరంతా రోడ్డున పడాల్సి వస్తోంది. జిఒను రద్దు చేయాలని పలుమార్లు ఆందోళనలను చేపడుతున్నా వారి ఉపాధి భద్రతపై ప్రభుత్వం ఎలాంటి భరోసానూ ఇవ్వకపోవడం గమనార్హం.

ప్రయివేటుకు అప్పగించేందుకేనా?

దస్తావేజులు రూపొందించడంలో ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేరుకు దస్తావేజుల రాత విధానంలో లోటుపాట్లున్నాయని చెబుతున్నప్పటికీ దీని వెనుక మరోకుట్ర దాగి వుందన్న అనుమానాన్ని లేఖరులు, స్టాంపుల అమ్మకందారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలన్నదే ప్రధాన ఉద్దేశంగా బావిస్తున్నారు.

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ సంబరాలు

- విద్యార్థుల విహారయాత్ర, క్విజ్‌పోటీలు
- మూఢనమ్మకాలు, విశ్వాసాలపై అవగాహన



కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని రాతి వనాలను తిలకిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) నిప్పుల గుండంపై నడుస్తున్న యువతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు రెండో రోజు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. ఆసియాలోనే అతి పెద్ద సోలార్ పార్కును విద్యార్థులు సందర్శించారు. సోలార్ విద్యుత్ ఉత్పాదకతపై విద్యార్థులకు అక్కడి నిర్వాహకులు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ ఉపయోగాలపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహజ సిద్ధమైన రాతి వనాలు ఉన్న రాక్‌గార్డెన్స్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సైన్స్ అభివృద్ధిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భూమిపై కూడా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ సైన్స్‌కు సంబంధించిన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో కఠిన ప్రశ్నలకు కూడా చురుకైన సమాధానాలు ఇచ్చారు. అనంతరం సాయంత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిప్పుల గుండంలోకి జెవివి నాయకులు వెళ్లి చూపించారు.

ఆకట్టుకుంటున్న సైన్స్ ఎగ్జిబిషన్

జెవివి సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించే విధంగా ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులపై ఈ ఎగ్జిబిషన్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జెవివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవికుమార్, కె.శ్రీనివాసులు, ప్రొఫెసర్ రామచంద్రయ్య, జెవివి సీనియర్ నాయకులు డాక్టర్ బడెసాహెబ్, సుధీర్‌రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజాహుస్సేన్, సత్యనారాయణరెడ్డి, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలున్నంత వరకూ పోరాటాలే

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు స్పష్టీకరణ



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు


ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుబల్లి మధు స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరు జిల్లా విడవలూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అందడంలేదన్నారు. జన్మభూమి పథకం ద్వారా గతంలో అధికారులైన కలెక్టర్ లేదా తహశీల్దార్లు పేదవారిని గుర్తించేవారని తెలిపారు. ఇప్పుడు జన్మభూమి కమిటీలను ఏర్పాటుచేసి అధికారులను పక్కనబెట్టి తెలుగుదేశం రాక్షస కమిటీల ద్వారా నిజమైన అర్హులైన పేదవారిని నిర్ణయించడంలో అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పెన్షన్లు, గట్టి ఇళ్లు, ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వడంలో అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా విజయనగరం జిల్లాలో దళితులపై దాడులు జరపడం అన్యాయమని విమర్శించారు. గిరిజనులు దళితులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో విడవలూరు మండలంలో గిరిజనులు, దళితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. వారిపై పెత్తందారులు, భూస్వాములు నిర్భందం సాగిస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఇటువంటివారిపై అట్రాసిటీ కేసులు అమలు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడచూసినా నీరు-చెట్టుపేరుతో ఎన్నో ఏళ్ల నుంచి చెరువు లోతట్టు సాగు చేసుకుంటున్నా చిన్న, సన్నకారు రైతులపై దౌర్జన్యాలు చేస్తూ కేసులు బనాయిస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో తోటపల్లి గూడూరు నుంచి సూళ్లూరుపేట వరకు పరిశ్రమల్లో బడా పారిశ్రామిక వేత్తలు కార్మికుల శ్రమని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఇతర రాష్ట్రాలైన ఒరిస్సా, బీహార్ నుంచి తక్కువ జీతాలకు వచ్చేవారికి ఉద్యోగాలిస్తున్నారన్నారు. జిల్లాలోని పలు కార్మిక, రైతు, అసంఘటితరంగ కార్మికుల టీం వర్కర్లు, మధ్యతరగతిపై, ఉద్యోగ వర్గాల సమస్యలు, మహిళలు, యువజనులు, విద్యార్థుల సమస్యలపై ప్రజల పక్షాన నిలబడి ప్రత్యామ్నాయశక్తిగా పోరాడతామన్నారు. ప్రభుత్వ సొమ్మును రిలయన్స్, హెరిటేజ్ సంస్థలకు దోచిపెట్టే చంద్రన్న మాల్స్‌ను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వైసిపి ప్రజా సమస్యలవేదికైన అసెంబ్లీకి పోకుండా పాదయాత్రలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష పాత్రలో జగన్ విఫలమయ్యారని తెలిపారు.

ప్రత్యేకం

వడపోతే లక్ష్యంగా దరఖాస్తుల పరిశీలన

- సాధికార సర్వే డేటా అనుసంధానంతో ఇక్కట్లు
- ఉన్న కార్డులో పేరు గల్లంతు
- నూతన కార్డులు మంజూరు కాని వైనం



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

నూతన రేషన్ కార్డు దరఖాస్తులకు ప్రజా సాధికార సర్వే డేటాను అనుసంధానించడం కష్టాలను తీసుకువచ్చింది. లబ్ధిదారులకు సంబంధించి పాత రేషన్ కార్డుల్లో పేరు తొలగించినప్పటికీ నూతన కార్డు మంజూరు కాలేదు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో కృష్ణా జిల్లాలో పంపిణీ చేస్తున్న కార్డుల కంటే ఉన్న రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించబడిన వారే అధికంగా ఉన్నారు. ఈ క్రమంలో దరఖాస్తుల వడపోతే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు, రామకృష్ణలకు వేర్వేరు యువతులతో ఏడాదిన్నర కిందట వివాహమైంది. తమతోపాటు తమ భార్య పేర్లను జత చేసి 2017 మార్చి, ఏప్రిల్‌లో నూతన రేషన్ కార్డుల కోసం మీ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఆన్‌లైన్ అయిన వెంటనే తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన కార్డులో నుంచి వీరి పేర్లు తొలగించబడ్డాయి. ఆ పేర్లకు సంబంధించి (యూనిట్లు) రేషన్ నిలిచిపోయింది. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులను సంప్రదిస్తే జన్మభూమి కార్యక్రమంలో నూతన కార్డులు మంజూరవుతాయని చెప్పారు. ఇటీవల జన్మభూమి కార్యక్రమానికి వెళ్లి కార్డు కోసం ఆశగా ఎదురు చూశారు. నూతనంగా మంజూరయిన కార్డుదారుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో కంగుతిన్నారు. అధికారులను ఆరా తీస్తే 'ఆల్‌రెడీ ఇన్ స్కీం' (పథకంలోనే ఉన్నారు) అని ఉండటంతో రేషన్ కార్డు మంజూరు కాలేదని వివరణ ఇచ్చారు. ఇదే తరహాలో కృష్ణా జిల్లాలో మొత్తం 58 వేల మంది నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేశారు. 21 వేల రేషన్ కార్డులు మాత్రమే మంజూరు చేశారు. దరఖాస్తుదారుల్లో 30,700 మంది ఆల్‌రెడీ ఇన్ స్కీంలో చేర్చారు. వీరందరికీ కార్డు మంజూరు కాకపోవడంతో పాటు, పాత కార్డుల్లో పేర్లు తొలగించడంతో గతంలో ఇచ్చే రేషన్ వీరికి ఆగిపోయింది. 6,300 దరఖాస్తు దారులను అనర్హులుగా గుర్తించారు.

పుట్టి ముంచిన ప్రజా సాధికార సర్వే డేటా

నూతన రేషన్ కార్డుల మంజూరు కోరుతూ వచ్చిన దరఖాస్తులను గతంలో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి మంజూరు చేసేవారు. ఈ పర్యాయం ప్రజాసాధికార సర్వే డేటాను దరఖాస్తులకు అనుసంధానించారు. ప్రజాసాధికార సర్వే జరిగే సమయంలో గతంలో కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరికీ పథకం వర్తిస్తున్నట్లుగా పేర్కొన్నారు. సాధికార సర్వే దరఖాస్తుకు తగిన విధంగా అప్‌డేట్ కాకపోవడంతో ఎక్కువ మంది పేర్లను రేషన్ కార్డుల్లో నుంచి తొలగించినా నూతన కార్డులు మంజూరు కాలేదని తెలుస్తోంది.

సంక్షిప్తం

ఈ ఏడాదిలో మొదటి టన్నెల్ పూర్తి : దేవినేని

పెద్దదోర్నాల: 2018 చివరి నాటికి మొదటి టన్నెల్ పూర్తి చేసి, శ్రీపూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నీటిని సప్లయ్ చేసి, ప్రారంభిస్తామని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం అమరావతి నుండి కర్నూలు జిల్లా సిద్ధాపురం గ్రామానికి వెళుతున్న ఆయన మార్గమధ్యలోని దోర్నాల సమీపంలో శ్రీపూలసుబ్బయ్య వెలుగొండ విశ్రాంతి భవనానికి వచ్చారు. శాసనసభ్యులు డాక్టర్ పాలపర్తి డేవిడ్‌రాజు, మార్కాపురం మాజీ శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆయనను కలిశారు. శ్రీపూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చిత్రపట నమూనాను మంత్రికి చూపించి, వివరించారు. అనంతరం మంత్రి దేవినేని మాట్లాడుతూ పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించి ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

కడప : జిల్లాలోని చాపాడు మండలం చియ్యపాడు గ్రామానికి చెందిన ఇల్లూరి చెన్నయ్య(19) విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం ప్రొద్దుటూరులోని వెంకటేశ్వర కాలేజీలో చదువుతున్నాడు. ఆరు నెలలుగా మానసికంగా దెబ్బతిన్నట్లు తెలిసింది. శనివారం ఇంటి నుంచి వెల్లిన చెన్నయ్య ఇంటికి రాకపోవడంతో తన తండ్రి మాదవ్ అతని కోసం తిరుగుతుండగా చాపాడు కస్తూరిబా పాఠశాల ఆవరణలో వంక వద్ద శవంమై కనబడ్డాడు. తన కుమారుని మృతదేహం వద్ద రోగర్ పురుగుల మందు డబ్బా ఉన్నట్లు తండ్రి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆవులమందను ఢీకొట్టిన గూడ్స్ రైలు

కడప : జిల్లాలోని కొండాపురం మండలం నెదరపేట వద్ద ఆవుల మందను గూడ్స్‌రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడు ఆవులు మృత్యువాత పడ్డాయి. మరోవైపు గూడ్స్‌రైలూ పట్టాలు తప్పింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్యగోష్ నుంచి హైదరాబాదుకు టిక్కెట్టు తీసుకుంటున్న అశోక్ గజపతి రాజు

ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రారంభం

డొమెస్టిక్ సరీసుల్లో మూడో స్థానం మనదే

కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ ప్రతినిధి

దేశీయ సర్వీసుల విస్తరణలో ప్రపంచంలోనే మూడవ స్థానంలో భారత విమానయానరంగం ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖా మాత్యులు అశోక్ గజపతి రాజు అన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమాశ్రయం చేరుకొని ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించారు. బోర్డింగ్ కౌంటర్ వద్ద నిల్చుని మొదటి ప్రయాణికుడిగా ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్యగోష్ నుంచి హైదరాబాదుకు టిక్కెట్టు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ విమానయాన రంగంలో భారత్ అభివద్ధి పథంలో దూసుకెళుతోందని తెలిపారు. 70 సంవత్సరాల కాలంలో దేశంలో 75 ప్రాంతాల కనెక్టివిటీ వుంటే, ఎన్‌డిఎ ప్రభుత్వంలో 3 సంవత్సరాల్లో మరో 80 ప్రదేశాలకు విమానాశ్రయాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు సభ్యులు వరప్రసాద్, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు, తుడా చైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ - 2.
prajasavvadi@gmail.com

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti



రచనల పూలతోటలో
ఛందస్సు మొక్కలు నాటను
భావనలో సామాన్యుని
జీవిత వలయాలు దాటను. - కుందుర్తి

నీల, అలాంటి మరికొందరు...
ఒక సాగర శ్వాస

పుస్తకం


No one is free, even the birds are chained to the sky.
- Bob Dylan

బలీయమైన ప్రేమ, స్వేచ్ఛకి సంకెలగా పరిణమించిన సంఘర్షణాత్మక సందర్భాల్లో క్లేశాన్ని అధిగమిస్తూ చిక్కుముడులు విప్పుకుంటూ ఆ రెంటిమధ్య సమన్వయం సాధించడానికి ప్రయత్నించిన స్త్రీ జీవిత శకలం 'నీల' నవల. మనిషి తనకు తానే బందీ. ప్రేమ, ద్వేషం, అసూయ, కార్పణ్యం కట్టి పడేస్తాయి. సత్యాన్వేషణకి ఆటంకమౌతాయి. గ్రహించేలోపు జీవితం చేజారిపోతుంది. ఈ సంక్లిష్టత నుంచి విముక్తం కావడానికి చేసే లోపలి, బయటి ఘర్షణల నుంచి పుట్టిందే నీల.

నీలని అర్థం చేసుకోడానికి పరికరాలు బయటనుంచి తెచ్చుకోనక్కర్లేదు. నీల జీవితం నుంచే – రచయిత నిర్మించిన పాత్ర్యం నుంచే ఆమె హృదయాన్ని ఆవిష్కరించుకోవచ్చు. స్వేచ్ఛ లేనప్పుడు పెళ్లి, ప్రేమ, సహజీవనం, వొంటరి జీవితం మనిషికి అన్నీ బరువే. ఆ స్వేచ్ఛకి కూడా సమాజం నిర్మించినవో స్వయంగా రూపొందించుకున్నవో నియమాలు హద్దులూ వుంటాయి. సముద్రం చెలియలి కట్ట దాటకుండా దాని అలలే దాన్ని నియంత్రిస్తాయి. ఎప్పుడు యే అల తీరాన్ని తాకుతుందో తాకకుండా వెనక్కి మళ్ళుతుందో చెప్పలేం. వ్యక్తికీ వ్యక్తికీ స్వేచ్ఛ నిర్వచనాలు సైతం మారతాయి. ఒకరికి స్వేచ్ఛ అనిపించింది మరొకరికి విశృంఖలత్వం కావొచ్చు. ఒకరికి కట్టడి అనిపించింది మరొకరికి బంధం కావొచ్చు. నిర్ధారణలు దేశ కాలాలను బట్టీ, వ్యక్తుల మనస్తత్వాలు సంస్కారాలను బట్టీ వుంటాయి. ఆ పరిమితుల్లోంచే నీలని తెలుసుకోవాల్సి ఉంటుంది.

వ్యక్తిగా నీల యెదగడాన్ని మాత్రమే చిత్రిస్తే నవల అసమగ్రమే అయ్యేది. రచయిత నవలని స్త్రీ పురుషుల సాంగత్యమే కేంద్రంగా చేసుకొని రాసిందని చెప్పడం కూడా తప్పే. 'నీల'ని వొక 'పీరియడ్ నవల' (కాలిక రచన) గా తీర్చిదిద్దాలని రచయిత అభిలషించింది. అందుకే నీల అనే వ్యక్తి జీవిత చిత్రణలోకి అనివార్యంగా సామాజిక చరిత్రని చొప్పించింది. ప్రత్యేక స్థలకాలాల్ని నిర్దేశించింది. వ్యక్తిజీవితాన్ని ప్రభావితం చేసే రాజకీయ సామాజిక సంఘటనల్ని ప్రస్తావించింది. నీలకి 'సొంత జీవితమూ, సామాజిక జీవితమూ వేర్వేరుగా లేవు' అన్న స్పృహతోనే నవలని నడిపింది. నీలపై ప్రభావం చూపిన సామాజిక చలనాల నీడల్లో స్త్రీ పురుష సంబంధాల్ని, సాహచర్యాల్ని వ్యాఖ్యానించింది. భిన్న వుద్యమాల్లో తనను తాను విలీనం చేసుకోడానికి నీల పడే తపనని సమగ్ర సామాజిక చిత్రంలో భాగంగా చూపకపోతే వొక స్త్రీగా నీల చేసిన ప్రయాణం పూర్తిగా వ్యక్తిగతమే అయ్యేది. అందుకు రచయిత నిర్మించిన, యేర్పరచిన స్థల కాల నేపథ్యాలు (1986– 2011, చోళదిబ్బ, ఏలూరు, రాజమండ్రి, హైదరాబాదు, విశాఖ పరిసరాల్లో) కూడా గమనించదగ్గవే. ఒక నిర్దిష్ట కాలంలో, గ్రామీణ, పట్టణ, నగర నేపథ్యాలు స్త్రీల స్వేచ్ఛపై, లైంగికతపై చూపే ప్రభావాల్ని, వాటిలోని భిన్న పార్శ్వాల్ని సైతం ఆమె చర్చకు పెట్టదల్చుకొంది.

మహిళల ఆర్థిక సాధికారతకి పొదుపు సంఘాలు, స్వశక్తి డ్వాక్రా గ్రూపులు యే మేరకి దోహదం చేశాయో పేర్కొంటూనే స్త్రీలకు కొత్తగా



కల్గిన ఆర్థిక వెసులుబాటు (దాన్ని పూర్తిగా స్వేచ్ఛ అనలేం) కారణంగా దాంపత్య సంబంధాల్లో వచ్చిన సంక్లిష్టతల్ని గుర్తించింది. అవి సంప్రదాయ కుటుంబ వ్యవస్థని బద్దలు కొట్టలేదు గానీ స్త్రీ పురుషుల లైంగికతపై బలమైన ప్రభావాన్ని చూపాయని సూచనప్రాయంగా తెలియజేసింది. వ్యక్తిని సమూహంలో భాగం చేయడానికి జీవిత శకలాన్ని సామాజిక నేపథ్యం నుంచి వ్యాఖ్యానించడానికి చేసిన యీ పూనికలో రచయిత పాటించిన జాగరూకత ప్రతి సందర్భంలోనూ గోచరిస్తుంది. సమకాలీన స్థానిక రాజకీయాలతో పాటు పలాస అడవుల్లో 'నీలధార' సాక్షిగా నడిచిన గిరిజన వుద్యమాల ఊసులు, స్టాలిన్ సూర్యం పాల్గొన్న వుత్తర తెలంగాణా రైతాంగ వుద్యమాలపై అమలైన అణచివేత జాడలు నవల్లో సందర్భానుసారంగా అలవోకగా ప్రస్తావనకి వస్తాయి. సామాజిక పరివర్తనలో ఎన్జీవోల భాగస్వామ్యంపై లోతైన చర్చ నడిచింది. విప్లవోద్యమాల పరిధి పరిమితులపై వ్యాఖ్యానాలు చోటు చేసుకున్నాయి. అయితే గంభీరమైన విషయాల్ని విశాల పాఠకలోకానికి చేర్చడానికి నవల్లో పఠతనీయత లోపించకుండా వుండడానికి మల్లీశ్వరి వెనకటి తరం రచయిత్రుల పాపులర్ కాల్పనిక రచనా శైలిని కొన్నిచోట్ల ఆశ్రయించింది. యీ టెక్నిక్ వల్ల సమకాలీన నవలల్లో నీల విలక్షణంగా భాసిస్తుంది.

అదే సందర్భంలో నవలని సామాజిక చరిత్రగా తీర్చిదిద్దడంలో రచయిత చూపిన శ్రద్ధ ముచ్చట గొలుపుతుంది. అందుకు వొక సామాజిక కార్యకర్తగా ఆమె చేసిన క్షేత్ర పర్యటనానుభవాలు యెంతగానో దోహదం చేసి వుంటాయి. మత్స్యకార గ్రామీణ జీవితాన్ని దగ్గరగా చూడకపోతే పైడమ్మ లాంటి బలమైన పాత్రని సృజించటం సాధ్యం కాదు. తన బాల్యాన్ని వెలిగించిన చర్చి – క్రైస్తవ కుటుంబాల నుంచి, పుట్టి పెరిగిన కోస్తా గ్రామాల బహుజన జీవితాల నుంచి స్వీకరించిన భిన్న సంస్కృతుల్నీ భాషనీ జీవన శైలినీ మల్లీశ్వరి నవల్లో సందర్భానుసారంగా వాడుకుంది. శుభాంజలి, నీతూబాయి, సంపూర్ణల మాట తీరులో, దేహ భాష – వస్త్రధారణల విషయంలో చూపిన వైవిధ్యం సైతం ఆయా స్త్రీల సామాజిక స్థితిగతుల్నీ, వ్యక్తిగత మనోభావాల్నీ, అభిరుచుల్నీ ప్రతిబింబించడానికి వుపయోగపడిందని గమనించాలి.

•••

వాక్యాన్ని రసాత్మకం చేసే కళని మల్లీశ్వరి అలవోకగా సాధించింది అనడానికి నవలనిండా యెన్నో వుదాహరణలు. కేవల వచనంగా ఆమె యెక్కడా జారిపోలేదు. అవసరానుగుణంగా వాక్యానికి కవిత్వ పరిమళాలు అద్దింది. నేరేషన్ మీద కూడా ఆమె గొప్ప అధికారం ప్రదర్శించింది. అంతరంగంలో జరిగే ఘర్షణ కావచ్చు, బయటికి వ్యక్తమయ్యే అనుభావాలు కావొచ్చు. శబ్దంతో, నిశ్శబ్దంతో దృశ్యాల్ని సాక్షాత్కరింపజేయడంలో, సన్నివేశాన్ని నాటకీకరించడంలో మల్లీశ్వరి ప్రతిభ అద్భుతం. మల్లీశ్వరి అంతకుముందు రాసిన ఐదు నవలల కన్నా నీల అన్ని విధాలా భిన్నమైంది. స్త్రీల శారీరక మానసిక ఆర్థిక సామాజిక రాజకీయ సాధికారతకి చెందిన సమస్త కోణాల్నీ యీ నవల్లో చర్చకి తెచ్చింది. ఆ క్రమంలో, కన్యాశుల్కం రాస్తూ గురజాడ మధురవాణి ప్రేమలో పడ్డట్టు రచయిత్రి 'నీల' ప్రేమలో తలమునకలైపోయింది. మనం కూడా నవల చదువుతూ నీల మోహంలో పడిపోతాం. అలా పడిపోయేలా చేయడమే మల్లీశ్వరి విజయం.

•••

మత పీఠాధిపతులూ సన్నాసులూ పాలకులై తండ్రి భర్త పుత్రుల మాటున చాటునే స్త్రీలు భద్రంగా జీవించగలరు అని సీతలు, గీత దాటకుండా కట్టడి చేస్తూ మనుధర్మాన్ని రాజ్యాంగబద్ధం చేయాలని ప్రయత్నిస్తున్న సంక్షుభిత కాలంలో– దేశసంపదని ప్రకృతి వనరుల్ని మల్టీ నేషనల్స్‌కి అప్పజెప్పడానికి సముద్రం, మైదానం, అడవి తేడా లేకుండా మానవ విధ్వంసానికీ ప్రకృతి వినాశనానికీ తెగబడ్డ బీభత్స సందర్భంలో మల్లీశ్వరి నీల గురించి, నీలలాంటి మరికొందరి గురించి, నీల చేయబోయే నూతన ప్రస్థానం గురించి మనందరికీ మాట్లాడటం అనివార్యమైంది. సముద్రం వెనక్కి వెళ్ళడానికి కారణం సమాజం విధించిన నియమాలా – స్వయంగా నిర్మించుకొన్న నైతిక సూత్రాలా – జీవితానుభవం ద్వారా యేర్పడ్డ మనోగత సంస్కారాలా అన్న సందేహాలకి సమాధానం తెలుసుకొన్నా తెలుసుకోలేకపోయినా– 'సముద్రం కార్పొరేట్ల పెరట్లో నీటితొట్టి' అవడానికి కారణాలు తెలుసుకొంటే చాలు అనే దిశగా యిప్పుడు నీల ప్రస్థానం మొదలైంది. ఇది కొత్త ప్రయాణం. ఇది వొంటరి ప్రయాణం కాదు. నీలతో, నీలలాంటి మరెందరితోనో కలిసి మనం కూడా నడుద్దాం. అడవుల వేడి నిట్టూర్పుల్నీ, సాగరాల గంభీర శ్వాసనీ విందాం.

– ఎకె ప్రభాకర్

(డిసెంబర్ 25న విడుదలైన 'నీల' నవలకి రాసిన ముందుమాట నుంచి కొన్ని భాగాలు)

యుద్ధం సోకని నేలకోసం...





ఇక్కడ....
పసిమొగ్గలు రాలిపోతుంటాయి ఆకలిగాలికి !
కన్నీళ్లు తాగి బతికే తల్లులిక్కడ అందించలేరు
నీరింకిన బావుల్లాంటి గుండెల్ని !
హామీపత్రాన్ని రాసివ్వలేరు
ఆకాశంపెడక నుంచి రాలిపడ్డ చివరి చినుకులా
ఆకలి కడుపున రేపటి పాలచుక్క కోసం !
ఇది అమ్మతనాన్ని అనుభవించలేని
అభాగ్య తల్లుల శోకభూమి !

భూమిని ముద్దాడకముందే.....
కోరలు చాపుక్కూర్చుంటుంది ఒక తోడేళ్ల మంద
కడుపుగూట్లో వాలకముందే
నల్లకాకినిజేసి వెళ్లగొడుతుంది వెలివాడల్లోకి !
మనిషి కన్నా ముందు మతమేదని ప్రశ్నిస్తుంది !
గుడిసెలో దూరి కులమేదని ఆరాదీస్తుంది !
వంటింట్లోకి చొరబడి కూరదాకల్ని వాసన చూస్తుంది !
ఇది దుఃఖాశ్రువులు చిందే నేల !
జాత్యహంకారపు జాగిలాలు తిరుగాడే నేల !

ఇక్కడ మనుషులకన్నా మ గాలే నయం
ఆకలేస్తేనే వేటాడతాయి!
పుటక మీద నిర్బంధం
ఊపిరిమీదా... ఊహలమీదా నిషేధం
నిత్యం చుట్టూ నిఘానేత్రాలు!
దయ్యాలై భయపడతాయి నీడలు
కాళ్లను బంధిస్తాయి కనిపించని సంకెళ్లు
ఇది రక్తం అలికిన రాకాసి నేల
రాబందులు రెక్కలల్లార్చే నేల !

నేలకొమ్మకు మెతుకు పూయదుకానీ
నిత్యం జరుగుతాయి అణ్వస్త్రాలకు పూజలు
అంతర్యుద్ధాల జడివానలో బతుకు ఓడలు మునిగి
సముద్ర తీరాలకు కొట్టుకువస్తాయి
నిర్వాసిత పసిదేహాలు!
కరువు కాటేసి ఊపిరి అస్థిత్వాన్ని కోల్పోయిన
ఎముకుల గూళ్ల వెనుక వాలుతుంది
రాబందులగుంపొకటి !
ఇది దుఃఖపు సాలెగూడు !

యుద్ధశిథిలాల కింద దేహాల్ని ఒడిలో పెట్టుకొని
గర్భశోకంతో కుమిలిపోతున్న తల్లులొకవేపు!
తెగిన పసుపు దారాలు చేతపట్టి
అస్తమిస్తున్న పొద్దులా కరిగిపోతూ....
నుదుట సింధూరాన్ని నిలుపుకోలేక
ఆక్రోశిస్తున్న పడతులింకొకవేపు!
ఇది శిశిరం మోసిన శాపగ్రస్థ భూమి !
ఈ నేలమీద నిలబడ్డ రాజప్రసాదాలన్నీ
రాలిన ఆశ్రితుల కన్నీళ్లే !

ఇది గబ్బిలాలు మసలాడే నేల !
ఒక నిర్వాసిత బానిసత్వం
వారసత్వంగా వచ్చే నేల!
ఇది కత్తుల కోలాటాల
నులివెచ్చని నెత్తుటిప్రవాహాల నేల!

కన్నీళ్లు కళ్లాపి చల్లి –
తూరుపు భరిణెలోంచి
కాసింత వెలుగుపిండితో ముగ్గేసి –
పూలదీపాలు వెలిగించి
యుద్ధం సోకని నేలకోసం –
నెత్తురూ కన్నీళ్లూ చిందని నేలకోసం –
కళ్లను కాగడాలను జేసి
కాలం ఎదురు చూస్తోంది !!

- సిరికి స్వామినాయుడు
94940 10330

నడక తెలిసి రాస్తే జట్టు కట్టి పాడతారు!

బాలసాహిత్యం


పిల్లలకు అందమైన బాల్యాన్నిస్తే వారి భవిష్యత్తు అందంగా ఉంటుంది. మంచి బాలసాహిత్యం భావితరాలకు బంగారు బాట వేస్తుంది. వారికి విజ్ఞానం, వినోదం నిండిన సాహిత్యం అందాలంటే ముఖ్యంగా కథలూ, గేయాలూ ఉపయోగపడతాయి. కథల్ని చదివి లేదా విని ఆనందం పొందుతారు. గేయాలు పాడుకుని తన్మయత్వం చెందుతారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు లయతో కూడిన గేయాలు వింటే మురిసిపోతారు. వినోదం, విజ్ఞానం, వికాసాల కలయికే బాల సాహిత్యం.

బాలల కోసం రచనలు చేసేవారి కలం నుంచి పాడుకొనేందుకు వీలున్న గేయాలు ఇప్పుడు వెలువడుతున్నాయా? అని ప్రశ్నించుకుంటే తక్కువేనని చెప్పుకోవచ్చు. నిజంగా నడక తెలిసి గేయం రాస్తున్న వారిని ప్రస్తుతం వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. పిల్లలు వారి వారి లోకాల్లో విహరిస్తుంటారు. వారి దృష్టిని మరల్చాలంటే లయతో కూడిన గేయాన్ని ఆలపిస్తే చాలు ఠక్కున మనవైపు తిరుగుతారు. ఉదాహరణకు చిట్టి చిలకమ్మా / అమ్మ కొట్టిందా / తోటకెళ్ళావా?/ పండు తెచ్చావా / గూట్లో పెట్టావా / గుటుక్కున మింగావా? / గేయం విన్న పాపాయి మొహంలో నవ్వులు పూస్తాయి. మళ్ళీ మళ్ళీ పాడమంటుంది. చివరికి అనుకరించి తన ముద్దు మాటలతో పాడేందుకు ప్రయత్నించి నేర్చుకుంటుంది. ఇలా పిల్లలకు లాలిపాటలు, జోలపాటలూ, జానపద వాఙ్మయంలో ఎన్నో ఉన్నాయి. 'బాల గీతాల్లో ఎంతో లాలిత్యం, హృదయ నైర్మల్యం, భావపరిమళాలు నిండి ఉన్నాయి. హృదయంలోంచి వచ్చే ప్రేమకి, అందానికీ ఏ రంగులూ పూయక– స్వచ్ఛంగా సూటిగా పాడిన పాటలకన్నా వేరే కవిత్వం ఎక్కడుంది?' అంటాడు చలం.

మహాకవి శ్రీశ్రీ పిల్లల గురించి 'శైశవగీతి'లో ఇలా అంటాడు : పాపం పుణ్యం ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదారేడుల పాపల్లారా/ మెరుపు మెరిస్తే /వాన కురిస్తే/ ఆకసమున హరివిల్లు విరిస్తే / అవి మీకే అని ఆనందించే కూనల్లారా...

'ఏడవకు అబ్బాయి ఏడవకు తండ్రీ...' అంటే ఆ మాటల్లో ఏమీ లేదు. కానీ బిడ్డ చెవులకి మాత్రం తల్లి ఆవేదన, ప్రేమ 'నేనున్నాను' అనే భరోసా, అభయం అన్నీ వినబడతాయి. పదేళ్ళలోపు వారు, దానికి పైబడిన వారిగా పిల్లల స్థాయిని రెండుగా విడగొట్టుకుంటే ప్రాథమిక స్థాయి పిల్లలకు తక్కువ మాటలతో చిట్టి గేయాలు అందించవచ్చు. పరిసరాల్లో కనిపించే పక్షులు, జంతువులు, ప్రకృతికి సంబంధించిన గేయాలు పిల్లలను అలరిస్తాయి. మ్యావ్ మ్యావ్ పిల్లి / పాలకొరకు వెళ్ళి / మూత తీసి తాగ/ మూతికాలె బాగా / అనే గేయాన్ని వినిపిస్తే వెంటనే పిల్లలు అభినయిస్తూ పాడేందుకు ఉత్సాహాన్ని చూపుతారు. చూడు చూడు చెల్లి / గోడమీద బల్లి / పట్టుకొనగ పురుగు పట్టు విడక తిరుగు... ఇలాంటి ఆది అంత్య ప్రాసలున్న గేయాలు పిల్లలను మరింత ఆకట్టుకుంటాయి. రుచులను గురించి బాలబంధు అలపర్తి వెంకట సుబ్బారావు గారు రాసిన గేయం 'పంచదార తీపి / పట్టు చేయి చాపి / చింతకాయ పులుపు/ చెట్టు ఎక్కి దులుపు / వేపకాయ చేదు– వేడ్క నమలరాదు / వక్క పలుకు వగరు– పాపలు తినదగరు / మిరపకాయ కారం/ కొరుకు తెలియు సారం / ఉప్పుగల్లు ఉప్పన– చప్పరించి చప్పున / ఇలాంటి గేయాలు అలరిస్తాయి.

పాటలు పాడుతూ ఆడే ఆటలు పిల్లలను మరింత ఉత్సాహపరుస్తాయి. చెమ్మ చెక్క చారడేసి మొగ్గ / అట్లుపోయంగ/



ఆరగించంగ/; దాగుడు మూతా దండాకోర్ / పిల్లి వచ్చె ఎలుక భద్రం/ ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చిప్... గప్ చిప్.../

ఇటువంటి గేయాలను ఎందరో బాలసాహితీవేత్తలు రచించి బాలసాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు పిల్లలకోసం ఒక సరదా పాట రాశారు. ఏనుగెక్కి మనము ఏవూరెళదాము/ ఏనుగెక్కి మనము ఏలూరెళదాము/ గుర్రం ఎక్కి మనము ఏవూరెళదాం / గుర్రమెక్కి మనము / గుంటూరెళదాం... ఈ పాటను ఇద్దరు పిల్లలు ప్రశ్న– జవాబు రూపంలో పాడుకుని ఆనందిస్తారు. హైస్కూలు స్థాయి పిల్లలయితే వారి ఆలోచనలతో ఈ గేయాన్ని పొడిగిస్తారు. శబ్ద చమత్కారంగా ఉండే గేయాలు కూడా పిల్లలకు ఎంతో ఆసక్తిని కలిగిస్తాయి.

'పలకా చెక్క– బలపం ముక్క / దొరికాయక్కా ద్వారం పక్క
పలకా చెక్క పైనా లెక్క / వేస్తా చక్కా చూస్తావక్క
బొచ్చు కుక్కా బొమ్మొక పక్కా / గీస్తానక్కా చూస్తావక్క
కాకీ నక్కా కథ అటు పక్క / వ్రాస్తా చక్క చూస్తావక్క
చీకుచు మెక్క చివరికి ఒక్క / బెల్లం ముక్క పెడతావక్క'

విద్యా విషయక, ప్రకృతికి సంబంధించిన గేయాలతో పాటు హాస్య గీతాలు, గేయరూపంలో ఉన్న పొడుపు కథలూ పిల్లలను బాగా ఆకట్టుకుంటాయి. పచ్చదనం– పరిశుభ్రత, వాతావరణ కాలుష్యం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే గేయాలు పిల్లలకు అవసరం.

ప్రస్తుతం పిల్లల జీవితాలతో పెనవేసుకొని పోయే టెలివిజన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ వంటి పరికరాలకు సంబంధించిన సైన్స్ గేయాలు కూడా బాల సాహితీవేత్తలు అందించవలసి ఉంది. ఆదరణ లేకనో చాలా మంది రాయగలిగిన వారు కూడా గేయాలను రాయడం లేదు. రెడ్డి రాఘవయ్య గారు బాలసాహిత్యంలో నిలిచి పోయే వంద బాలగేయాలను సేకరించి ఒక సంకలనం ప్రచురించారు. ఇది మంచి ప్రయత్నం. డా॥ వెలగా వెంకటప్పయ్య గారు కూడా 'పిల్లల పాటలు' పేరుతో ఒక పుస్తకాన్ని తీసుకువచ్చారు. నాటి నుండి నేటివరకు బాలసాహితీవేత్తల వందలాది గేయాలు ఇందులో వున్నాయి. అలపర్తివారి గేయం 'తొలకరి' 1984లో రెండవ తరగతి తెలుగు వాచకంలో చేర్చబడింది.

"తొలకరి ఒక పరితొంగి చూడగా
మిలమిల తళతళ మెరుపు మెరిసెను
మిలమిల తళతళ మెరుపు మెరియగా
దబదబ టపటప వాన కురిసెను
దబదబ టపటప వాన కురియగా
గుమగుమ గమగమ పూవు విరిసెను
గుమగుమ గమగమ పూవు విరియగా
కిలకిల కలకల పాల మురిసెను'

ఇందులోని జంటపదాలు పిల్లలకు బాగా ఒంటపడతాయి.

నేడు పత్రికల్లో మంచి గేయాలు ప్రచురింపబడ్డా పిల్లలకు చేరక పోవడానికి కారణం కార్పొరేట్ పాఠశాలమ హవా పెరిగింది. చదువుల వత్తిడి పెరిగిపోయింది. తరగతి పుస్తకాలు, హోమ్‌వర్కులు పెరిగాయి. పిల్లల పత్రికలు తగినన్ని లేకపోయినా ఆ కొరతను దినపత్రికలే తీరుస్తున్నాయి. దినపత్రికల్లో పిల్లల శీర్షికలను బాగా తీసుకువస్తున్నారు. వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి.

బాలసాహిత్య రచయితలు సరళమైన పదాలతో ప్రాస పదాలతో పిల్లలు పాడుకునేందుకు వీలుగా బాల గేయాలను అందించాలి. పిల్లలు తమంత తాము పదేపదే చదువుకుని పాడుకునే గేయాలు రావాలి. నీతి సూత్రాలు, ఆరోగ్య సూత్రాలు, విజ్ఞాన విషయాలు, నాయకుల చరితలు గేయాలుగా మంచి అందించాలి. పాఠశాలలోని గ్రంథాలయాలను తెరచి పిల్లలతో చదివించాలి. ఉపాధ్యాయులు కూడా పిల్లలకు పాడి వినిపిస్తే ఆటాపాటలతో వారి బాల్య జీవితం వికసిస్తుంది. పిల్లలకోసం రాయడం గొప్పకళ. ఈ సాహిత్యం పిల్లల మెదళ్ళలో ధైర్యం, నిజాయితీ, పట్టుదల, సహభావం, సేవాకాంక్ష వంటి భావాలను నాటగలిగాలి.

– డాక్టర్ రావెళ్ల శ్రీనివాసరావు
99493 30596

అఖిల భారత కవి సమ్మేళనానికి ప్రసాదమూర్తి కవిత



ఆలిండియా రేడియో నిర్వహించే అఖిల భారత కవి సమ్మేళనానికి తెలుగు భాష తరపున ప్రముఖ కవి ప్రసాదమూర్తి కవిత 'పిచ్చి నాన్న' ఎంపికైంది. 22 భారతీయ భాషలకు చెందిన 22 మంది కవులను ఈ సమ్మేళనానికి ఎంపిక చేశారు. ఇందుకోసం అన్ని భాషల్లోనూ ఎన్నో దశల్లో వడపోతలు జరిగాయి. తెలుగు నుంచి చివరి జాబితాగా ఆరుగురు కవితల్ని హిందీ, ఇంగ్లీషు అనువాదాలతో కేంద్రస్థాయి న్యాయనిర్ణేతలకు పంపడం జరిగింది. అందులో ప్రసాదమూర్తి కవిత ప్రథమ స్థానాన్ని పొంది జనవరి 16న ఇండోర్‌లో జరిగే జాతీయ కవి సమ్మేళనానికి ఎంపికైంది. ప్రసాదమూర్తి కవితను ప్రముఖ అనువాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత శాంతసుందరి హిందీలోకి అనువదించారు. ఈ కవిసమ్మేళనంలో తమ భాషకు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రతి కవితా 22 భారతీయ భాషల్లోనూ అనువదింపబడుతుంది. ఆ కవితలను జనవరి 26న ఆలిండియా రేడియో అన్న ప్రాంతాల్లోనూ ప్రసారం చేస్తుంది.

సమాచారం

కవిసంధ్య కవితల పోటీ

అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిసంధ్య కవిత్వ పత్రిక కవిసంధ్య పానుగంటి కవితల పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీలో పాల్గొనేవారు ఎంట్రీ ఫీజుగా రూ.200లు చెల్లించాలి. ఆ వివరాలను కవితలతోపాటు జతపరచాలి. ఆధునికమైన భాష, అభివ్యక్తితోపాటు సామాజిక అంశాలపై రాసిన వచన కవితలకు ప్రాధాన్యం ఉంటుంది. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడవ బహుమతి రూ. వెయ్యి. అయిదు మంచి కవితలకు రూ.500లు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. ఒక ఎంట్రీకి ఒక కవిత మాత్రమే పంపాలి. కవితలను పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. బహుమతి పొందని కవులకు కవిసంధ్య పత్రిక ఒక ఏడాది పాటు పంపుతాం. కవితలు పంపాల్సిన చివరి తేదీ : 20 ఫిబ్రవరి 2018. పంపాల్సిన చిరునామా : దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం–533464. వివరాలకు : 9440105987.

– కవి సంధ్య, యానాం

10న ప్రపంచ గేయ కవితా సదస్సు

ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్టణం పౌర గ్రంథాలయంలో 'గేయ కవితా ప్రస్థానం' ఆధ్వర్యంలో ప్రపంచ గేయకవితా సదస్సు జరుగుతుంది. అభ్యుదయ కవి సీరపాణి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ఎల్‌ఆర్ స్వామి, జగద్ధాత్రి, రామతీర్థ ఉపన్యాసకులుగా పాల్గొంటారు. గేయకవితా సంకలనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గేయ కవితలను ఆహ్వానిస్తున్నాం. అచ్చులో ఒక పేజీకి మించకుండా ఐదు చరణాల పరిమితి గల గేయాన్ని రచయితలు పంపించాలి. రచనలు సామాజిక జీవితానికి సంబంధించినవై ఉండాలి. బాల గేయాలను కూడా పంపవచ్చు. ఈ రచన దేనికి ప్రచురణకు పంపలేదనే హామీ పత్రంతోపాటు రచయిత సంక్షిప్త వివరాలను, పాస్‌పోర్టు సైజు ఫొటోను జతచేయాలి. చివరి తేదీ : 2018 ఫిబ్రవరి 10. చిరునామా : సీరపాణి, మురళీమోహన్ నగర్, పాలకొండ–532440, శ్రీకాకుళం జిల్లా. ఈ మెయిల్ : seerapani49@gmail.com. వివరాలకు చరవాణి : 6281319940.

పెన్నా సాహిత్య పురస్కారం-2017కు ఆహ్వానం

పెన్నా రచయితల సంఘం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి పెన్నా సాహిత్య పురస్కారం–2017 కోసం 2016, 2017లలో ప్రచురితమైన కవితా సంపుటాలను ప్రతులను ఫిబ్రవరి 28లోపు మాకు చేరేలా పంపాల్సిందిగా కోరుతున్నాం. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి రూ.3 వేలు నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో కవిని ఘనంగా సంస్థ సత్కరిస్తాం. చిరునామా : గుండాల నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి, 25–1–89, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు–524004. వివరాలకు 9493235992, 8500130770 సంప్రదించగలరు.

– పెన్నా రచయితల సంఘం

దాడికి ఖండన

ఈనెల 3వ తేదీ బుధవారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెయిర్‌లో కొంతమంది వ్యక్తులు మఖామి పుస్తక ఆవిష్కరణ సభ జరక్కుండా అడ్డుకోవడంతోపాటు ప్రముఖ కవి, రచయిత స్కైబాబపై భౌతిక దాడికి ప్రయత్నించటాన్ని మేము ఖండిస్తున్నాం. బుక్‌ఫెయర్ నిర్వాహకులు సభకు అనుమతిచ్చినప్పటికీ కొంతమంది తీవ్రగందరగోళాన్ని సృష్టించడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని భావిస్తున్నాం. ఐదేళ్ల క్రితం స్కైబాబ రాసిన కవితను ముందుపెట్టి, ఇందులో అభ్యంతరకరమైన బూతులున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు సోదర సోదరీమణులు స్కైబాబాను, ఆయనకు తోడుగా ఉన్న రచయిత్రులను అంతకంటే ఘోరమైన పదజాలంతో దూషించటం సమంజసం కాదు.అక్షరానికి అక్షరంతోనే జవాబు చెప్పాలి లేదా ఆమోదయోగ్యమైన పద్ధతుల ద్వారా నిరసన ప్రకటించాలి కానీ కక్షతో మూకుమ్మడిగా రచయితలపై విరుచుకుపడకూడదు.ఎవరైనా సరే తమ ఆగ్రహావేశాలను వ్యక్తంచేసే క్రమంలో, పితృస్వామ్య భావజాలపు వికృత అవశేషమైన నిందాపూర్వకమైన భాష జోలికి వెళ్లకుండా, మరొకరి ఆత్మగౌరవాన్ని కాలరాచే విధంగా మాట్లాడకుండా సంయమనం పాటించాలని విజ్ఞప్తిచేస్తున్నాం.

– జి లక్ష్మీనరసయ్య, ప్రసాదమూర్తి, కోయి కోటేశ్వరరావు, సజయ, రమాసుందరి, కెయన్.మల్లీశ్వరి, చల్లపల్లి స్వరూపరాణి, ఎంఎం వినోదిని, పసుపులేటి గీత, అట్టాడ అప్పలనాయిడు, ఖాజా, నూకతోటి రవికుమార్, జిఎస్ చలం, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, కత్తి కల్యాణ్, కాకాని సుధాకర్, ఒమ్మి రమేశ్ బాబు, నామాడి శ్రీధర్, అనంత్, ఇండస్ మార్టిన్, పల్నాటి శ్రీరాములు, ఎన్.జె.విద్యాసాగర్, అక్బర్, యాకూబ్, సిద్ధార్థ, సీతారామ్, ఎస్.రఘు, గుర్రం సీతారాములు, వాహేద్, రమేశ్ హజారి, వనపట్ల సుబ్బయ్య, గుడిపల్లి నిరంజన్.

jeevanapageps@gmail.com

జీవన the family

ప్రజాశక్తి

5 విజయవాడ సోమవారం 8-1-2018

JEEVANA

ముంగిట వాలిన హరివిల్లులా రంగవల్లులు..
ఆ ముగ్గుల్లో గొబ్బిళ్లు.. ఆడపిల్లల పట్టు లంగా ఓణీల
ధగధగలు.. ఇవే కదా తెలుగింటికి వన్నె తెచ్చే సంక్రాంతి
సందళ్ళు. పండగవేళ సాంప్రదాయక దుస్తులు
కొత్త వెరైటీలతో అలరిస్తున్నాయి.
ఇంకెందుకు ఆలస్యం?
మీరూ ట్రై చేయండి!

ముగ్గుల్లో గొబ్బిళ్లు

పసిడి ఓణీలు





టీవీఎస్ డాజ్ స్కూటర్ వచ్చేస్తోంది!

టీవీఎస్ డాజ్ స్కూటర్‌ను కార్బోరేటర్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ రెండు రకాల వెర్షన్‌లో తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. సాంకేతికంగా ఇందులో ఉన్న 110సీసీ కెపాసిటి గల గాలితో చల్లబడే సింగిల్ సిలిండర్ 8.57బిహెచ్‌పి పవర్, 8.3ఎన్ఎమ్ గరిష్ట టార్క్ ఉత్పత్తి చేస్తుంది. డాజ్ స్కూటర్ డిజైన్ చూడటానికి కాస్త వింతగా ఉంటుందనే చెప్పాలి. ఎందుకంటే, ఇప్పటివరకు ఇలాంటి తరహా స్కూటర్లు మన విపణిలోకి పరిచయం కాలేదు. ట్రెండింగ్ బాడీ గ్రాఫిక్స్, పెద్ద పరిమాణంలో ఉన్న 14-అంగుళాల పరిమాణం గల అల్లాయ్ వీల్స్ దీని ప్రత్యేకత. ముందు వైపున టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్, వెనుకవైపున సింగల్ షాక్ అబ్జార్వర్, అదే విధంగా ఫ్రంట్ వీల్స్‌కు 200ఎమ్ఎమ్ డిస్క్ బ్రేక్, రియర్ వీల్‌కు 130ఎమ్ఎమ్ డిస్క్ బ్రేక్ రానుంది. టీవీఎస్ 110 స్కూటర్ల శ్రేణిలో ఉన్న స్కూటీ జెస్ట్, జూపిటర్ సరసన చేరనుంది. దీని ధర సుమారుగా 55 వేలు నుంచి 60 వేల రూపాయల మధ్య ఉండే అవకాశం ఉంది. తాజాగా టీవీఎస్ ప్రతినిధులు సరికొత్త డాజ్ స్కూటర్‌కు బెంగళూరు పరిసర ప్రాంతాల్లో రహదారి పరీక్షలు నిర్వహించారు. టీవీఎస్ గతంలో 2016 ఇండియన్ ఆటో ఎక్స్-పో వాహన ప్రదర్శన వేదిక మీద ఆవిష్కరించింది. అయితే, ఇప్పటివరకు విపణిలోకి లాంచ్ చేయలేదు. నిజానికి, టీవీఎస్ మోటార్స్ తొలుత ఈ డాజ్ స్కూటర్‌ను ఇండోనేషియా మార్కెట్ కోసం అభివృద్ధి చేసింది. ఈ స్కూటర్‌ను ఇప్పటికే పలు ఆగ్నేయాసియా దేశాలలో అందుబాటులో ఉంచింది. అయితే, దేశీయంగా స్కూటర్ల సంఖ్యను పెంచుకునేందుకు ఇప్పుడు భారత్ కోసం ఖరారు చేసింది. టీవీఎస్ ఈ 110సీసీ డాజ్ స్కూటర్‌తో పాటు హోండా గ్రాజియాను ఎదుర్కొనేందుకు 125సీసీ కెపాసిటీ గల కొత్త స్కూటర్‌ను సిద్ధం చేస్తోంది. అధునాతన ఫుల్లీ డిజిటల్ ఇంస్ట్రుమెంట్ క్లస్టర్ కన్సోల్, ఎన్నో కొత్త ఫీచర్లను ఈ 125సీసీ స్కూటర్లో పరిచయం చేయనుంది. ★

యువ



మీ కోసం



ఆహారంలో తరచూ పాలకూర తీసుకుంటే శరీరానికి కావలసిన ఐరన్ పుష్కలంగా లభిస్తుంది.

జీవన సౌరభం


ఒకరి గురించి మంచి చెప్పకపోయినా పర్లేదు.. చెడుగా మాత్రం చెప్పొద్దు.. టైంపాస్‌కి చేసే కామెంట్ల వల్ల ఒకరి జీవితం అర్ధాంతరంగా ఆగిపోవచ్చు..

రమణుల రంగవల్లి

25 చుక్కలు
5 వరసలు
5 వచ్చే వరకు

ఇజ్జగిరి శ్రీవైష్ణవి
చీమకుర్తి,
ప్రకాశం జిల్లా







ఇ. ఈశ్వరి
చీమకుర్తి
ప్రకాశంజిల్లా



24 చుక్కలు
8 వరుసలు
8వచ్చేవరకు

బహుమతి పొందిన ముగ్గు



20 చుక్కలు
2 వరసలు
2 వచ్చే వరకు

కె. దివ్య
లంక్కవరపు కోట
విజయనగరం
జిల్లా



మా చిరునామా :
జీవన,'రమణుల రంగవల్లి', జీవన,
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4,
ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevana pageps@ gmail.com
ఫోన్‌నెం.9490099006



ఉద్యోగాన్వేషణ వేదికగా
సోషల్ మీడియా

నేటి నెట్‌వర్కింగ్ యుగంలో నయా ట్రెండ్.. జాబ్ సెర్చ్ వయా సోషల్ నెట్‌వర్కింగ్. సోషల్ మీడియా ప్రవేశంతో ఉద్యోగాన్వేషణ కొత్త పుంతలు తొక్కుతోంది.. ఒకప్పుడు ఉద్యోగాన్వేషణలో జాబ్ పోర్టల్స్ పాత్ర ప్రముఖంగా ఉండేది.. కానీ ఈ సరికొత్త ట్రెండ్ జాబ్ మార్కెట్‌లోని విస్తృత అవకాశాలను అభ్యర్థుల ముంగిట నిలుపుతోంది. ప్రతి కంపెనీ సోషల్ నెట్‌వర్కింగ్‌లో ఖాతాను నిర్వహిస్తుండడం, యువతలో 85 శాతం మందికిపైగా సోషల్ వర్కింగ్ సైట్స్‌ను అనుసరిస్తుండడమూ కారణంగా పేర్కొనవచ్చు.

సోషల్ మీడియా పరిధి విస్తృతం. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్‌ను ఫాలో కావడంలో యువత వెచ్చిస్తున్న సమయమూ కంపెనీలు సోషల్ నెట్‌వర్కింగ్ మాధ్యమం ద్వారా నియామకాలు చేపట్టడానికి కారణమవుతుంది. దీనికి ఉన్న విస్తృత పరిధి, వేగంగా కమ్యూనికేట్ చేయడం, ప్రభావం దృష్ట్యా ప్రతి కంపెనీ సోషల్ రిక్రూటింగ్‌కు ప్రాధాన్యతనిస్తుంది. కావల్సిన ఉద్యోగుల కోసం ముందుగా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలోని అభ్యర్థుల ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తాయి. ఈ క్రమంలో తమ అవసరాలకు సరిపడా నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులను వెంటనే సంప్రదిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం దేశంలో.. 34 శాతం మంది ఎంప్లాయర్స్ సోషల్ మీడియాలోని ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తున్నారు. అధికశాతం మంది యువత కెరీర్ విషయంలో నిర్ణయం తీసుకోవడం, ఉద్యోగాన్వేషణ వంటి విషయాల్లో సోషల్ మీడియాను ఒక ప్రాథమిక అవసరంగా భావిస్తున్నారు. సోషల్ మీడియా కారణంగా యువత తమ ఆసక్తికి అనుగుణమైన ఉద్యోగాన్ని ఎంచుకోవడం సులువైంది. తద్వారా కెరీర్‌ను విజయవంతం చేసుకుంటున్నారు.

పర్సనల్ టు ప్రొఫెషనల్

గత కొంత కాలంగా వ్యక్తిగత ఆసక్తి నుంచి వృత్తి మాధ్యమానికి వేదికగా మారింది. అన్ని కంపెనీలు/ సంస్థలు తమ మార్కెటింగ్/ కమ్యూనికేషన్ వ్యూహంలో సోషల్ నెట్‌వర్కింగ్‌ను తప్పనిసరి అంశంగా భావిస్తున్నాయి. తమ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాయి. నియామక ప్రక్రియలనూ ఈ మాధ్యమం ద్వారానే నిర్వహించడానికి మొగ్గు చూపుతున్నాయి. అంతేకాకుండా స్వల్ప సమయంలో తక్కువ ఖర్చుతో ప్రతిభావంతులను ఆకర్షించే సులువైన మాధ్యమం సోషల్ మీడియా అని కంపెనీలు భావిస్తున్నాయి. దాంతో అన్ని రంగాలకు చెందిన కంపెనీల హెచ్‌ఆర్ విభాగంలో 'సోషల్ రిక్రూట్‌మెంట్' కొత్తగా చోటు సంపాదించుకుంది. కంపెనీలో ప్రస్తుత ఖాళీల వివరాలను తెలియజేస్తూ, అర్హతలు, కావల్సిన నైపుణ్యాలు, తదితర వివరాలను పోస్ట్ చేస్తున్నాయి. సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్ల ద్వారా ఉద్యోగాన్వేషణలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇందులో ఉండే దశలను జాగ్రత్తగా పూర్తిచేయాలి.



ప్రొఫైల్

ముందుగా ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లను గుర్తించాలి. తర్వాత వాటిల్లో ప్రొఫైల్‌ను క్రియేట్ చేసుకోవాలి. ఫొటో, అర్హతలు, నైపుణ్యాలు, కెరీర్, లక్ష్యాలు, గత అనుభవం తదితర వివరాలతో ప్రొఫైల్ రూపొందించాలి. మరో కీలకాంశం.. ప్రొఫైల్ హెడ్‌లైన్. ఒక రకంగా చెప్పాలంటే మీ నేపథ్యాన్ని ఒక వాక్యంలో స్పష్టం చేసేది హెడ్‌లైన్. ఉదాహరణకు -Fresh B.Tech (CSE) Graduate Looking for a Job లేదా 'Software Engineer with 2 Years Experience willing to relocate. ఎందుకంటే ఎంప్లాయర్స్ ఇటువంటి కీవర్డ్స్ ఆధారంగా కూడా సెర్చ్ చేయొచ్చు. చాలా మంది అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించడం లేదు. అదేవిధంగా ప్రొఫైల్ టెంప్లెట్ కార్టూన్లు లేదా ఇతర డిజైన్లతో గందరగోళంగా కాకుండా వైట్ బ్యాగ్రౌండ్ వంటి సాదాసీదాగా ఉండే టెంప్లెట్‌ను ఎంచుకోవాలి.




భిన్నంగా

మరో కీలకాంశం ప్రొఫైల్‌పైనే ఆధారపడకుండా కంపెనీలను ఆకర్షించే విధంగా వెబ్‌బేస్డ్ రెజ్యూమ్‌ను రూపకల్పన చేసుకోవాలి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ప్రొఫైల్ లేదా సీవీని రూపొందించి, దానికి సంబంధించిన లింక్‌ను ప్రొఫైల్‌లో పొందుపరచాలి. తద్వారా ఎంప్లాయర్స్ మీ ప్రొఫైల్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించే అవకాశం ఉంటుంది. ఆసక్తి ఉంటే.. సొంత బ్లాగ్/ వెబ్‌సైట్‌ను ప్రారంభించండి. సోషల్ మీడియాలో వాటి లింక్స్‌ను పోస్ట్ చేయాలి. సంప్రదాయ రెజ్యూమ్ స్థానంలో..సోషల్ మీడియాలో ప్రొఫైల్, ఆన్‌లైన్ రెజ్యూమ్, వీడియో రెజ్యూమ్, బ్లాగ్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి సృజనాత్మకతతో కూడిన వెబ్ బేస్డ్ రెజ్యూమ్‌లను పరిగణనలోకి తీసుకునే కంపెనీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అభ్యర్థిలో వృత్తి పట్ల నిబద్ధత, నిజాయితీ, సాంకేతికంగా వస్తున్న మార్పులను ఎంత ప్రభావవంతంగా సృజనాత్మకంగా వినియోగించుకుంటున్నారనే అంశాలను తెలుసుకునేందుకూ ఈ వెబ్ బేస్డ్ రెజ్యూమ్ ఉపయోగపడుతుందని సంబంధిత నిపుణుల అభిప్రాయం. వీలైతే మీ ప్రతిభను నిరూపించే అంశాలతో కూడిన ఒక ఆల్బమ్‌ను రూపొందించాలి. మీరు డిజైన్ చేసిన వెబ్ పేజీలు, స్క్రీన్ షాట్స్, నిర్వహించిన ఈవెంట్లు, సెమినార్లు, సాధించిన విజయాలకు సంబంధించి ఏవైనా ఉంటే వాటి ఫొటోలు ఇలా.. నైపుణ్యాన్ని నిరూపించే అన్ని అంశాలతో ఆల్బమ్ ఉండాలి. దీని లింక్స్‌నూ తప్పకుండా పోస్ట్ చేయాలి.

గ్రూప్స్

ప్రొఫైల్ రూపకల్పన ప్రక్రియ తర్వాత మీరు చేయాలనుకుంటున్న ఉద్యోగానికి సంబంధించిన అన్ని విషయాలపై పక్కాగా ప్రిపేరవ్వాలి. తదనుగుణంగా కెరీర్, అర్హతలతో సంబంధం ఉన్న గ్రూపులు, కమ్యూనిటీలలో సభ్యులుగా చేరాలి. ఆయా నెట్‌వర్కింగ్ సైట్లలోని సెర్చ్ ఆప్షన్ ఉపయోగించి, మీ కెరీర్ నేపథ్యానికి సరిపోయే కంపెనీల జాబితాను రూపొందించుకోవాలి. 'లైక్', 'ఫాలో' ఆప్షన్స్‌ను ఉపయోగించడం ద్వారా సదరు కంపెనీ గ్రూపులో సభ్యులుగా చేరాలి. అందులోని సభ్యులతో పరిచయం పెంచుకోవాలి. నైపుణ్యాలాధారంగా వారిని ప్రభావితం చేయాలి. తద్వార మీరు అవకాశం కోసం చూస్తున్న ప్రతిభావంతులు అనే భావనను కలిగించాలి. సదరు కంపెనీ పట్ల మీ నిబద్ధతను చూపాలి. ఉదాహరణకు ఒక ప్రొడక్ట్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఆ కంపెనీ అందించే సేవల పట్ల మీకు ఉన్న అవగాహన తెలియజేసే విధంగా పోస్టులు/ ట్వీట్స్ ఉండాలి.



సదా సిద్ధం

మరో కీలకాంశం.. నేర్చుకునేందుకు సదా సిద్ధంగా ఉన్నామనే భావనను కలిగించాలి. సంబంధిత నిపుణుల ద్వారా మీ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించాలి. తమ గ్రూపుల ద్వారా బృంద చర్చలు నిర్వహించాలి లేదా పాల్గొనాలి. కేవలం ఆన్‌లైన్ సమాచారానికే పరిమితం కాకుండా ఆయా గ్రూపులు/ కంపెనీలు నిర్వహించే వివిధ ఈవెంట్లలో పాల్గొనాలి. ఆయా గ్రూపుల్లో ఉండే నిపుణులు సంబంధిత రంగంలో రాణించడానికి అవసరమైన సూచనలను పోస్ట్ చేస్తుంటారు. వాటిని గమనిస్తూండాలి. ప్రస్తుతం పరిశ్రమల పనితీరును విశ్లేషించాలి. నిర్మాణాత్మక సూచనలు చేయడానికి ప్రయత్నించాలి. తద్వారా మీలోని ప్రతిభను సదరు సభ్యులు గుర్తించే అవకాశం కల్పించాలి.

ప్రభావవంతంగా

మిమ్మల్ని ప్రమోట్ చేసుకోవడానికి సోషల్ మీడియా టూల్స్‌ను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. ఒక రకంగా చెప్పాలంటే పనిచేయాలనుకుంటున్న రంగానికి సంబంధించిన కంపెనీ/సంస్థ.. తెలుసుకునే విధంగా మిమ్మల్ని మీరు ప్రచారం (Turn Yourself Into an Advertisement) చేసుకోవాలి. ప్రొఫైల్‌ను క్రియేట్ చేయడం, జాయినింగ్ ద గ్రూప్స్, ఫాలోయింగ్ కంపెనీ వంటి పనులను ఒకేరోజులో పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉండకూడదు. ఒక పద్ధతి ప్రకారం వీటిని చేస్తూండాలి. ఒకరోజు ప్రొఫైల్‌ను క్రియేట్ చేస్తే మరోరోజు జాయినింగ్ గ్రూప్.. తర్వాత ఫాలోయింగ్ కంపెనీ వంటి అంశాలను చేపట్టాలి.

వెంటనే కాదు

గ్రూప్స్, కంపెనీ ఫాలో అవుతున్న సమయంలో వెంటనే జాబ్ కావాలి అని పోస్ట్ చేయొద్దు. ఇది ఒక రకంగా నెగిటివ్ ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి 'హెల్ప్ మై కెరీర్' అనే అర్థం ధ్వనించే విధంగా మన పోస్టింగ్ ఉండాలి. ప్రొఫైల్ చూసిన వెంటనే నిజాయితీ, ప్రొఫెషనలిజం ప్రస్ఫుటమవ్వాలి. అంతేకాకుండా ఉద్యోగం వచ్చేవరకూ సమయాన్ని వృథా చేయకుండా నిత్యం ఏదో ఒక నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో నిమగ్నమై ఉన్నాం అనే భావాన్ని కలిగించాలి. తదనుగుణంగా ప్రొఫైల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూండాలి. తద్వార మీలోని ప్రతిభను గుర్తించే అవకాశం కల్పించాలి. అంతేకాకుండా సంబంధిత రంగంపై మీరు చదివిన లేదా మరే విధంగానైనా అవగాహనలోకి వచ్చిన సమాచారాన్ని షేర్ చేసుకోవాలి.

కొన్ని సోషల్ నెట్‌వర్క్స్

www.facebook.com
in.linkedin.com
plus.google.com
www.skillpages.com
myspace.com
twitter.com

★



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంస్కరణల అమలు - ప్రభావం



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

ఆర్థిక సంస్కరణల ప్రభావం అన్ని రంగాలలోకీ ప్రసరించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపకంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంప్రదాయక వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఉద్యానవన పంటలను అధికంగా ప్రోత్సహించడం, వ్యవసాయరంగానికి సంబంధించిన ముఖ్యమైన సంస్కరణగా పేర్కొనవచ్చు. స్ప్రింక్లర్, డ్రిప్ విధానంలో పంటల సాగు, పంట సంజీవని వంటి వృద్ధి ప్రోత్సాహక చర్యలు చేపట్టడంతోపాటు, స్టోరేజీ వసతుల కల్పన, మార్కెట్ వసతులు విస్తృతం చేయడం వంటి చర్యల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అందుబాటులో ఉన్న జలవనరులను గరిష్టంగా వినియోగించుకునేందుకు జలసంరక్షణ విధానాలు, నీరు-చెట్టు, సూక్ష్మ పోషకాల లోపాన్ని నివారించడానికి వీలుగా భూసార కార్డుల పంపిణీ, భూసార నమూనాల పరీక్షలు, ఎరువులను పంటలను బట్టి వినియోగించడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టింది.

ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ వ్యవసాయం లాభసాటిగాలేని ఆర్థిక కార్యకలాపంగా మారుతూ వస్తుంది. ప్రధానంగా యువత వ్యవసాయంవైపు దృష్టి సారించడంలేదు. ప్రధానంగా ఉత్పత్తి వ్యయం తగ్గించడం రైతులకు గిట్టుబాటుధర కల్పించడం, సేంద్రీయ వ్యవసాయంవైపు మళ్లడం వంటి కార్యక్రమాల ద్వారా సుస్థిర వ్యవసాయాభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పారిశ్రామికరంగంలో సమగ్ర వృద్ధిని పెంపొందించడానికి వివిధ రంగాలను అనుసంధానం చేసే రవాణా కాండార్లతో సమన్వయం చేయడం ద్వారా మాన్యుఫ్యాక్చరింగ్ వృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు, రవాణా వసతులు, సరళీకరణ విధానాల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా పోటీనిచ్చే మాన్యుఫాక్చరింగ్ రంగాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భారత ప్రభుత్వం చేపట్టిన 'మేకిన్ ఇండియా' అనే కార్యక్రమంలో భాగంగా ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి, పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. అంతేగాక ప్రభుత్వం 2015 ఏప్రిల్ 29న సింగిల్ డెస్క్ పాలసీని ప్రారంభించింది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులూ, క్లియరెన్సులు ఏర్పాటు చేయడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా తయారీ రంగాన్ని విస్తృతపరిచి వ్యవసాయ రంగంలోని మిగులు కార్మికులను ఇముడ్చుకునేలా ప్రభుత్వం వ్యూహాలు రచిస్తుంది.

రాష్ట్రవిభజన అనంతరం విద్యుత్ రంగం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటుంది. రాష్ట్ర ఆర్థికవ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే విద్యుత్ రంగం కీలకమైన మౌలిక వనరు. పరిశ్రమలకు నాణ్యమైన, సరిపడినంత విద్యుత్ లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

డిమాండ్, ఉత్పత్తి, విస్తరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రసరణ నెట్‌వర్క్‌కు ప్రణాళిక రూపొందించి, తక్కువ నిర్వహణ వ్యయంతో అధిక లభ్యతను అందుబాటులోకి తేవడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇటీవల వినియోగదారులకు బిల్లింగ్ సమాచారం, విద్యుత్ కోతల సమాచారాన్ని ప్రాంతాలవారీగా తెలియజేసేందుకు ఇ-వారధి అనే ఎలక్ట్రానిక్ విధానం ప్రవేశపెట్టారు.



సేవల రంగంలో ఆర్థిక సంస్కరణల ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. ముఖ్యంగా ఐటి రంగంలో ఆర్థిక సంస్కరణల అమలువల్ల రాష్ట్రానికి దేశవ్యాప్తంగా ప్రధానమైన గుర్తింపు లభించింది. సమాజంలోని అన్ని వర్గాల సమ్మిళిత అభివృద్ధి కోసం ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వృద్ధి ఫలాలను సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చేలా స్మార్ట్ విలేజ్/వార్డు కార్యక్రమం ప్రారంభించింది. ఐటి కార్యకలాపాలు ఏర్పాటు చేయడానికి నిర్వహించడానికి, విస్తృతపరచడానికి కావాల్సిన అనుమతులు, పర్మిట్లను మంజూరు చేయడానికి సింగిల్ విండో పథకం కింద నెలరోజుల వ్యవధిలో ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. నెలరోజుల తర్వాత డీమ్డ్ అప్రూవల్ ఇచ్చేలా ఏర్పాటు చేశారు. ఐటి పరిశ్రమను చట్టబద్ధమైన విద్యుత్ కోతల నుంచి మినహాయించారు. 24 గంటల పాటు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, మానవ వనరుల అభివృద్ధి సుపరిపాలన అనే నాలుగు అంశాల ఆధారంగా ఐటి పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇ-గవర్నెన్సు పరిణామక్రమాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లి పౌరులకు, వ్యాపారులకు అత్యుత్తమ సేవలు అందించడం కోసం ఎపి స్టేట్ ఎంటర్‌ప్రైజెస్ ఆర్కిటెక్చర్ ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది. ఈ కార్యక్రమానికి ఇ-ప్రగతి అనే పేరు పెట్టారు. ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు ఇ-సేవ, మీ-సేవ, ఇ-ప్రొక్యూర్ వంటి ప్రాజెక్టులు అమలు చేస్తున్నారు. ★

ఉద్యోగాలు

టీఎస్ ట్రాన్స్‌కోలో 1604 ఉద్యోగాలు

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ట్రాన్స్‌కో).. 1,604 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ మూడు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

పోస్టు-ఖాళీలు : జూనియర్ లైన్‌మ్యాన్ (జేఎల్ఎం)-1,100, సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-174, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)-330 (ఎలక్ట్రికల్-250 + సివిల్-49+టెలికాం-31).

వేతనశ్రేణి : జేఎల్ఎం-రూ.15,585-రూ.25,200, సబ్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్-రూ.20,535-రూ.41,155, ఏఈ-రూ.41,155-రూ.63,600.

అర్హతలు : జేఎల్ఎంకు పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మ్యాన్ ట్రేడ్‌లో ఐటీఐ. లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్స్, సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)కు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ/ డిప్లొమా/ తత్సమాన విద్య, ఏఈకి సంబంధిత విభాగాలను అనుసరించి ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ సివిల్/ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ/ ఏఎంఐఈ ఎగ్జామినేషన్‌లో సెక్షన్ 'ఎ', సెక్షన్ 'బి' ఉత్తీర్ణత/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.

వయసు : జేఎల్ఎంకు 18-35 ఏళ్ల లోపు, సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), ఏఈ పోస్టులకు 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనల మేర గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక : రాతపరీక్ష.

రాతపరీక్ష విధానం : జేఎల్ఎం, సబ్ ఇంజనీర్ పోస్టులకు 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లు ఎ, బి ఉంటాయి. సెక్షన్ 'ఎ'లో 65 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో జేఎల్ఎంకు ఐటీఐ, సబ్ ఇంజనీర్‌కు డిప్లొమా ట్రేడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్ 'బి'లో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ రెండు పోస్టులకూ ఉమ్మడిగా ఉంటుంది.

ముఖ్య తేదీలు :

పోస్టు	ఫీజు చెల్లింపు ప్రారంభం	ఫీజు చెల్లింపు ముగింపు	దరఖాస్తు స్వీకరణ ప్రారంభం	దరఖాస్తు ముగింపు
జేఎల్ఎం	4-01-2018	20-01-2018	5-01-2018	20-01-2018
సబ్ ఇంజనీర్	19-01-2018	5-02-2018	20-01-2018	5-02-2018
ఏఈ	30-01-2018	16-02-2018	01-02-2018	16-02-2018

ఇందులో 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.

ఏఈ పోస్టులకు రాతపరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఇందులోనూ రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ 'ఎ'లో సంబంధిత విభాగం నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్ 'బి'లో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు.

గమనిక : జేఎల్ఎం పోస్టుల అభ్యర్థులకు పోల్/ టవర్ క్లైంబింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులైతేనే ఉద్యోగానికి ఎంపికచేస్తారు.

దరఖాస్తు ఫీజు : రూ.220 (అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీ-రూ.100 + ఎగ్జామినేషన్ ఫీ-రూ.120), ఎస్సీ/ ఎస్టీ/ బీసీ/ వికలాంగులకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : tstransco.cgg.gov.in

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో 26 ఖాళీలు

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. స్కేల్-1 పరిధిలోని 26 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది ప్రభుత్వరంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ.

పోస్టు : అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్).

వేతనం : రూ.32,795+ఇతర అలవెన్సులు.

మొత్తం ఖాళీలు : 26 (అన్‌రిజర్వ్‌డ్ : 14 + ఓబీసీ: 7 + ఎస్సీ: 3 + ఎస్టీ: 2).

అర్హతలు : కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ/ వికలాంగుల కేటగిరీలకు 55 శాతం) మార్కులతో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/ పీజీ-మెడికల్ డిగ్రీ/తత్సమాన విదేశీ మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణత. అలాగే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు ఉండాలి. హోమియోపతి, ఆయుర్వేద, యునానీ సంబంధ కోర్సుల్లో ఉత్తీర్ణతను పరిగణించరు.

వయసు : 2018, జనవరి 1 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు : రూ.200, ఎస్సీ/ ఎస్టీ/వికలాంగులకు ఫీజు లేదు.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 17, 2018.

వెబ్‌సైట్ : www.newindia.co.in

నగదు కొరత పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం (విజయనగరం జిల్లా)

బ్యాంకులు, ఎటిఎంల్లో నగదు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విజయనగరం జిల్లా పార్వతీపురంలోని బెలగాంలోగల ఎటిఎం కేంద్రాల వద్ద ఆదివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రజలు తమ బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న నగదు తీసుకునే పరిస్థితి లేదని, ఎక్కడికెళ్లినా నగదు లేదని చెబుతున్నారని, ఎంటిఎంల్లోనూ నగదు కొరత తీవ్రంగా ఉందని అన్నారు. సంక్రాంతి పండగకు రైతులు, కూలీలు డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సందర్శన

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసలోని దళితవాడను ఆంధ్ర మాల్యాద్రి ఆదివారం సందర్శించి, వారితో మాట్లాడారు.

ఎమ్మెల్యే కుమారుడిని అరెస్టు చేయాలి

మోదవలస దళితులకు ఆంధ్ర మాల్యాద్రి పరామర్శ

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)

దళితులపై దాడికి ఉసిగొల్పిన విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడు పతివాడ రామునాయుడును, ఎఎంసి (వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉపాధ్యక్షులు కాగితాల సత్యనారాయణను అరెస్టు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. డెంకాడ మండలం మోదవలసలోని దళితవాడను ఆయన ఆదివారం సందర్శించారు. జన్మభూమి సభకు వెళ్లొద్దంటూ టిడిపి కార్యకర్తలు ఈ నెల ఐదున చేసిన దాడిలో దళితులు గాయాలపాలై విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ.. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దళితులపై దాడి జరిగి మూడు రోజులు కావస్తున్నా ఇంతవరకు కలెక్టర్‌గాని, ఎస్‌సిగాని, ఆర్‌డిఒగాని, కనీసం విఆర్‌ఒ స్థాయి అధికారిగాని గ్రామాన్ని సందర్శించకపోవడం దారుణమన్నారు. దీనికి నిరసనగా సోమవారం కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ (దళిత హక్కుల పోరాట సమితి), ఇతర దళిత సంఘాలను కలుపుకొని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి గోక రమేష్‌బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వై.పకీర్రాజు, ఎం.చింతయ్య పాల్గొన్నారు.

ఉత్తేజభరితంగా సిపిఎం మహాసభలు

నెల్లూరు, విశాఖ; గుంటూరు జిల్లాల సమగ్రాభివృద్ధి కోరుతూ తీర్మానాల ఆమోదం

ప్రజాశక్తి - నెల్లూరు/ విశాఖపట్నం / గుంటూరు ప్రతినిధులు

సిపిఎం నెల్లూరు, విశాఖపట్నం, గుంటూరు జిల్లా మహాసభలు ఉత్తేజభరితంగా జరిగాయి. ఆదివారం ఆయా జిల్లాల సమగ్రాభివృద్ధిని కోరుతూ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించాయి. అంతకుముందు నెల్లూరు జిల్లా 23వ మహాసభను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రారంభించారు. విశాఖ జిల్లా 22వ మహాసభను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమలత ప్రారంభించారు. గుంటూరు జిల్లా 23వ మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య ముగింపు ప్రసంగం చేశారు.

కరువు నివారణా చర్యలు చేపట్టాలి
సిపిఎం నెల్లూరు జిల్లా 23వ జిల్లా మహాసభ తీర్మానం

నెల్లూరు జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, చేతివృత్తులను కాపాడాలని, సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని నెల్లూరు జిల్లా 23వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మద్య నిషేధం అమలు చేయాలని, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పారిశ్రామిక వాడల్లో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, కార్మిక చట్టాల్లో సవరణలు చేయొద్దని సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ తీర్మానాలను ఆమోదించింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళలకు పార్లమెంటులో 33శాతం రిజర్వేషన్ కల్పించాలని మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పాల్గొన్నారు.

పోరాటాలే ఊపిరి కావాలి : పి.మధు, వి.శ్రీనివాసరావు

ప్రజా పోరాటాలే ఊపిరిగా ప్రతి కార్యకర్తర, నాయకులు పనిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రెండ్రోజులపాటు విడవలూరులో జరిగిన సిపిఎం నెల్లూరు జిల్లా 23 మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ఉద్యమానికి ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడ ఉద్యమాలే రాష్ట్రానికి పేరణగా నిలిచాయన్నారు. రాబోయే కాలంలో ప్రజా పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రజలతో మమేకమై ముందుకు సాగాలన్నారు. దళితులు, బలహీన వర్గాలు, యువకులు, విద్యార్థులు, కార్మికుల సమస్యలను తీసుకొని



నెల్లూరు జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

పోరాటం సాగించాలన్నారు. వ్యవసాయ కార్మికులు సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కొత్త ప్రాంతాలకు విస్తరించడంతో పాటు స్థానిక సమస్యలపై పనిచేయాలన్నారు.

ఎస్ఇజెడ్‌లో కార్మిక చట్టాలు అమలే సమ్మతం
సిపిఎం విశాఖ 22వ జిల్లా మహాసభ తీర్మానం

విశాఖ జిల్లాలో వివిధ తరగతుల ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం జిల్లా 22వ మహాసభ తొలిరోజైన ఆదివారం ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎస్ఇజెడ్‌లో కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని మహాసభ తీర్మానించింది. గిరిజనుల అస్తిత్వానికి ప్రమాదం తెచ్చిపెట్టే బాక్సైట్ జిఓ 97ను రద్దు చేయాలనీ, దళిత, గిరిజనులపై దాడులు అరికట్టి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని మహాసభ కోరింది. మద్యం అమ్మకాలను నిషేధించాలని, మహిళలపై దాడులు అరికట్టాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలనీ, ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు-కార్పొరేట్ సంస్థలకు అప్పగించవద్దని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ప్రతిపాదించిన ఏడు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలపై పోరాటం :హేమలత

తొలుత మహాసభను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమలత ప్రారంభించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని మహాసభ వేదిక నుంచి పిలుపునిచ్చారు. ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు కార్పొరేట్ శక్తులు చేస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. పార్లమెంట్‌ను పక్కనబెట్టి బిల్లులు తెచ్చి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, డాక్టర్ మిడియం బాబూరావు, ఎం.కృష్ణమూర్తి. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

రాజధాని వాసులకు పరిహారంలో వివక్ష తగదు
సిపిఎం గుంటూరు జిల్లా మహాసభలో తీర్మానం

రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా 23వ మహాసభల్లో పలు సమస్యలపై ఆదివారం మహాసభ చర్చించి ఆమోదించింది. మొత్తంగా 25 అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. దళితులపై దాడులను నివారించాలని, రాజధాని ప్రాంతంలో లంక భూముల్లో ఎక్కువగా దళితులున్న నేపథ్యంలో వారు నష్టపరిహారంలో వివక్ష ఎదుర్కొంటున్నారని పేర్కొంది. రాజధాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. జిల్లాలో 516 గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు, 20 వేల దళిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, అధికార పార్టీ నిర్బంధం, జన్మభూమి కమిటీల రద్దుపై తీర్మానాలు ఆమోదించింది. నీరు-చెట్టు పేరుతో చట్టానికి విరుద్ధంగా తవ్వకాలు చేపట్టారని, చిలకలూరిపేట నియోజకవర్గంలో గొరిజవోలు, తూబాడు, పెదకూరపాడు నియోజకవర్గంలో కొండూరు, నందిరాజుపాలెం ఇంకా అనేక చోట్ల ప్రజలు ప్రతిఘటించారని పేర్కొన్నారు. సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబురావు, డి.రమాదేవి పాల్గొన్నారు.

31 మందితో సిపిఎం నెల్లూరు జిల్లా నూతన కమిటీ

కార్యదర్శిగా తిరిగి చంద్ర రాజగోపాల్ ఎన్నిక



సిపిఎం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కార్యదర్శిగా మరోమారు చంద్ర రాజగోపాల్ ఎన్నికయ్యారు. విడవలూరులో 23వ పార్టీ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 31మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికయ్యింది. అందులో తొమ్మిదిమంది కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వారిలో పులిగండ్ల శ్రీరాములు, పొట్టేపాళెం చంద్రమౌళి, ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, జొన్నలగడ్డ వెంకమరాజు, నెల్లూరు యాదగిరి, గోగుల శ్రీనివాసులు ఉన్నారు. మిగతా 21 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

9న జన్మభూమిని బహిష్కరిస్తాం

29న విద్యారంగ సమస్యలపై ఆందోళనలు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సాబ్జి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న అన్ని తాలుకా కేంద్రాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని బహిష్కరించి నిరసన తెలియజేయనున్నట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జి పేర్కొన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళనలను చేపడతామన్నారు. ఆదివారం కర్నూలు మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు ఎలాంటి భద్రత ఉండదని చెప్పారు. ఇటీవల విజయవాడలో పెన్షన్ సాధన సమితి ఏర్పాటు అయ్యిందని, సిపిఎస్ రద్దుకు దశల వారీగా పోరాటాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో ప్రజాప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించి వారి నుంచి హామీ తీసుకుంటామన్నారు. ఏ పార్టీ మద్దతునిస్తే వారిని వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా గెలిపిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని దీనిపై అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టంలో నుంచి బయటికి రావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చిలో లక్ష మందితో ఛలో అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఒకే అజెండాతో పోరాడాలి

ఎఐటియుసి భవనం ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెండాలెన్ని ఉన్నా ఒకే అజెండాతో ఐక్యతగా పోరాడాలని పలువురు వక్తలు అకాంక్షించారు. గొల్లపూడిలో ఎఐటియుసి నూతన రాష్ట్ర కార్యాలయాన్ని(జోశ్వభట్ల సత్యనారాయణ భవనం) పలువురు నేతలు ఆదివారం ప్రారంభించారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు నిర్వహించే ఐక్య ఉద్యమాలకు జోశ్వభట్ల భవనం నుంచే నిర్దేశించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయన్నారు. బ్రిటీష్ పాలకుల బాటనే ప్రస్తుత పాలకులు కూడా అనుసరిస్తున్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పెనుప్రమాదంలో చిక్కుకున్నాయన్నారు. మైనారిటీలు, దళితులు, వామపక్ష మేధావులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు,కర్షకులు, ఉద్యోగుల్ని మోడీ ప్రభుత్వం కట్టుబానిసలుగా మార్చే విధంగా ఆయా చట్టాల్లో మార్పులకు శ్రీకారం చుడుతోందని విమర్శించారు. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో మరింత పెద్దఎత్తున ఐక్య ఉద్యమాలు చేసేందుకు కార్మికశ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటాలు, ఉద్యమాల వల్లే కొంతవరకైనా న్యాయం జరుగుతోందన్నారు. ఎఐటియుసి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హరిహర మహాదేవన్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఉద్యమాల్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల శ్రమను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు మోడీప్రభుత్వం యత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. భవనంలోని పలు కార్యాలయాల్ని పలువురు నేతలు ప్రారంభించారు.

కార్మిక హక్కుల కోసం పోరాడిన చంద్రుడు

సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కార్మికుల హక్కుల కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి టి.చంద్రుడు అని సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ఇటీవల మృతి చెందిన జిల్లా కార్యదర్శి టి.చంద్రుడు సంస్మరణ సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎ.నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. చంద్రుడు విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ నాయకుడుగా పని చేశాడని తెలిపారు. అంచెలంచెలుగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడిగా ఆయన ఎదిగారని చెప్పారు. నందికొట్కూరులో భూస్వాములకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల్లో పేదబడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పని చేశారని అన్నారు. ఆయన విద్యార్థి సమస్యలే కాకుండా ఇళ్ల స్థలాలు, భూపోరాటాలు, కార్మికుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టి సాధించారని చెప్పారు. సమాజంలోని రుగ్మతలు పోలాలని, అందుకు పోరాడాలని నిరంతరం తపించేవారని వివరించారు.

సిపిఎస్ రద్దు కోరిన ఉపాధ్యాయులపై చర్యలు

జన్మభూమి సభలో ఎమ్మెల్యే ఆదేశం

అమలుకు అధికారుల చర్యలు

ప్రజాశక్తి- జలుమూరు (శ్రీకాకుళం జిల్లా)

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ జన్మభూమి సభలో వినతిపత్రం ఇచ్చిన ఉపాధ్యాయులపై ఎమ్మెల్యేల ఆదేశాల మేరకు అధికారులు చర్యలకు సిద్ధం కావడం వివాదాస్పదమైంది. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం బొడ్డపాడు గ్రామంలో ఈ నెల నాలుగో తేదీన జన్మభూమి-మా ఊరు సభ జరిగింది. ఈ సభలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఆ గ్రామంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు పి.సుజాత, జి.స్వప్నకుమారి సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే ఆ ఇద్దరు ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపిడిఒ వాసుదేవరావును ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంఇఒకు ఎంపిడిఒ ఈ మేరకు లేఖ రాశారు.

నేడు ఎంఇఒ కార్యాలయాల వద్ద ధర్నాలు : యుటిఎఫ్

వినతిపత్రం అందజేసిన ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించడాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, యుటిఎఫ్ సిపిఎస్ కమిటీ జిల్లా కన్వీనర్ బండ ఉమాశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని జెఎసి ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నడుస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే, అధికారుల ఆదేశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. సిపిఎస్‌పై అధికార పార్టీ విధానమేంటో తెలపాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ఎంఇఒ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ ఫలాలు అందుకోవడంలో వెనుకబాటు

ఎండిజెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు విష్ణువు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ఎస్‌సి కేటగిరిలో ఉన్న మాదిగదాసు కులస్తులకు ఎంఆర్ఒ కాకుండా ఆర్‌డిఒ నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి రావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందిపుచ్చుకోవటంలో వెనకబడిపోతున్నారని మాదిగదాసు జాతీయ సంక్షేమ సంఘం (ఎండిజెఎస్ఎస్) జాతీయ అధ్యక్షులు తాళ్లూరి విష్ణువు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మాదిగదాసు సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన జిల్లాల కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగదాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

శ్రీకాకుళం జిల్లాలోని పలాస ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ జన్ని రామారావు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతు శిరీషా, డాక్టర్ అప్పలరాజు, కోట పూర్ణచంద్రరావు, విఠల్, శ్రీకాంత్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఐస్‌లాండ్
2. జకర్తా
3. రూ. 10
4. నితీష్ కుమార్ (బీహార్)
5. గిల్లీ సైమోన్స్ (ఫ్రాన్స్)

విద్యార్థులు విజ్ఞాన పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి పుస్తకాల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విద్యార్థులతో పాఠ్య పుస్తకాలతోపాటు విజ్ఞాన పుస్తకాలూ చదివించి, వారికి విజ్ఞానం అందించే దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని శాసన మండలి మాజీ సభ్యులు, ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సవ్‌లో ఆదివారం 'పిల్లల కోసం కమ్యూనిజం, స్టూడెంట్స్ క్యాపిటల్, 70 సంవత్సరాల స్వాతంత్ర్యం' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముందుగా పిల్లల కోసం కమ్యూనిజం పుస్తకాన్ని శర్మ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విద్యార్థులకు పుస్తకాలు చదవడం అలవాటు తక్కువగా ఉందన్నారు. కేవలం సబ్జెక్టు పుస్తకాలకే పరిమితమవుతున్నారని, విద్యా సంస్థల్లో మార్కులు, ర్యాంకుల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై



విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌లో పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎంవిఎస్ శర్మ, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఒత్తిడి తీసుకువస్తున్న కారణంగా విద్యార్థులు ఎటూ తేల్చుకోలేక అనేక ఆందోళనలకు గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిపై పుస్తక మహోత్సవ్‌లో సదస్సు జరిగిందని పేర్కొన్నారు. నేటి విద్యార్థులు కమ్యూనిజం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నేటి విద్యార్థులకు కమ్యూనిజం అర్థం చేసుకునేందుకు ప్రజాశక్తి బుక్‌హౌస్ పిల్లల కోసం కమ్యూనిజం పుస్తకం తీసురావడం అభినందనీయమని తెలిపారు. '70 సంవత్సరాల స్వాతంత్ర్యం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పత్రికలైన పీపుల్స్ డెమొక్రసీ, ఫ్రంట్ లైన్‌లో వచ్చిన ప్రముఖమైన 12 వ్యాసాలను తెలుగులోకి ప్రజాశక్తి అనువదించిందని తెలిపారు. మరో పుస్తకం స్వేచ్ఛకు సంకెళ్లు పుస్తకాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వొరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఉషారాణి అధ్యక్షత వహించగా వేదికపైక ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్, పుస్తక మహోత్సవ్ కార్యదర్శి లక్ష్మయ్య అతిథులను ఆహ్వానించారు.

ప్రజాబ్యాలెట్

ప్రశ్నించేవారి నోరు నొక్కేసే ప్రయత్నం

జన్మభూమి సభల్లో రసాభాస

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం కొనసాగిన జన్మభూమి సభల్లో ప్రశ్నించేవారి నోరు నొక్కేసే ప్రయత్నం జరిగింది. పలు చోట్ల రసాభాస చోటు చేసుకుంది. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో "జన్మభూమి-మా ఊరు" కార్యక్రమంలో సమస్యలపై ప్రశ్నించిన సిపిఎం నాయకులపై ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు అనుచరులతో పాటు పోలీసులు దౌర్జన్యానికి దిగారు. సిపిఎం నాయకులపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు కనీస సమాధానం ఇవ్వకుండా నిరాకరించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో అంగన్వాడీ భవన నిర్మాణంపై స్థానికులు ప్రస్తావించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కొండ్రెడ్డికండ్రిగ గ్రామ సభకు వస్తున్న అధికారులను గ్రామస్తులు గ్రామ పొలిమేరల్లో అడ్డుకున్నారు. రహదారి సమస్య పరిష్కరించిన తర్వాతే గ్రామంలోకి అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతమంది అధికారులు గ్రామంలోకి వెళ్లి అంగన్‌వాడీ పిల్లల్ని కూర్చోబెట్టి గ్రామసభ నిర్వహించి మమా అనిపించారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలో నడిపించాలని అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో ఆదివారం



గ్రామ పొలిమేరల్లో అధికారులను అడ్డుకుంటున్న చిత్తూరు జిల్లా కొండ్రెడ్డికండ్రిగ గ్రామస్తులు

జరిగిన జన్మభూమిలో రైతులు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం ఉత్తరాపల్లి పంచాయతీలో జన్మభూమి గ్రామసభలో ఉపాధి హామీ బిల్లులు, ఇళ్ల స్థలాల మంజూరు, ఇతర సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సర్పంచ్ వెంకటలక్ష్మి, గణేష్, వైసిపి నాయకులు లగుడు ఓమాలు, ఎస్.సత్యనారాయణ అధికారులను నిలదీశారు. ఈ సభలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం సుభలాయ్‌లో అధికారులను వంశధార నిర్వాసితులు నిలదీశారు. సమస్యలు పరిష్కరించకుండా గ్రామాల్లో ఇళ్లను కూలదోశారని, పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎలా జీవించాలని పాడలి, పెద్దసంకిలి, కోరాడ కాలనీ, బ్యారేజీ సెంటర్ నిర్వాసితులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా గడివేముల మండలం గని గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని సిపిఎం పాణ్యం డివిజన్ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలు అడ్డుకున్నారు. అనంతపురం జిల్లాలోని జన్మభూమి సభల్లో స్థానిక సమస్యలపై ప్రజలు నిలదీశారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పుగంగవరం జన్మభూమి సభలో వైసిపికి చెందిన తాళ్లూరు జెడ్‌పిటిసి సభ్యులు మారం వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం జరిగి సభలో రసాభాస చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలంలోని కుక్కునూరు, పెదరావిగూడెం పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావును, కుక్కునూరు సబ్‌కలెక్టరు హరేంద్రీయప్రసాద్‌ను సిపిఎం మండల కార్యదర్శి ఎర్రంశెట్టి నాగేంద్రరావు ఆధ్వర్యాన నిర్వాసితులు అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేటలో సిసి రోడ్ల నిర్మాణంలో అవినీతి, దళిత కాలనీలో తాగునీటి సమస్యపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

యాదవ్ కార్పొరేషన్ కోసం ఒక రోజు దీక్ష

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

సిఎం చంద్రబాబు చిత్తశుద్ధితో యాదవ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజయవాడ ధర్నాచౌక్ వద్ద అఖిల భారత యాదవ్ మహాసభ విజయవాడ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష జరిగింది. దీక్షకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వైసిపి జిల్లా ఇన్‌ఛార్జ్ కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ముద్రబోయిన వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర బిసి జనాభాలో 10 శాతానికి పైగా ఉన్న యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని తెలిపారు. కుల వృత్తిని నమ్ముకుని, గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్న వారు అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నారన్నారు. జనాభా నిష్పత్తిలో సీట్లు కేటాయించి రాజకీయ అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. టిడిపి నగర అధ్యక్షుడు బుద్దా వెంకన్న మద్దతు తెలిపి మాట్లాడుతూ.. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

బలవంతంగా సీమంతాలు చేయించొద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి కార్యక్రమంలో సీమంతాలు, అన్నప్రాసనలు చేయాలంటూ అంగన్‌వాడీల చేత అప్పులు చేయించి ఖర్చుపెట్టించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వర్కర్లపై ఒత్తిడి తెచ్చి వేధించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు నెలలుగా వేతనాల్లేవని, సెంటర్ అద్దెలు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. అన్న అమృతహస్తం బిల్లులు, గ్యాస్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోయినా వడ్డీలకు అప్పులు తెచ్చి కేంద్రాల్ని నడుపుతున్నారని వివరించారు. ప్రభుత్వం వీరిపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని, సీమంతాలకు, అన్నప్రాసనలకు ప్రభుత్వమే అదనంగా నిధుల్ని కేటాయించాలని కోరారు.

ప్రతిపాదనలకు ఆహ్వానం : జైట్లీ

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీల విరాళాల వ్యవస్థలో పారదర్శకత పెంచడానికి ఎన్నికల బాండ్ల విధానాన్ని తీసుకుని వచ్చామని, ఇందులో మరింతగా పారదర్శకత పెంపొందించేందుకు వీలుగా సూచించే ప్రతిపాదనలను ప్రభుత్వం ఆహ్వానిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఈ విరాళాల వ్యవస్థను మరింతగా ప్రక్షాళన చేయడానికి ఎవ్వరైనా సలహాలు, సూచనలు చేయవచ్చని సామాజిక మాధ్యమాల్లో జైట్లీ కోరారు. సంప్రదాయ పద్ధతిలో నగదు రూపంలోనూ రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వున్న వ్యవస్థతో నల్లధనాన్ని గుర్తించలేకపోతున్నామని, రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన కోసమే ఎన్నికల బాండ్లను తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.

గాలిపటమా పదపద !

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవం ఆదివారం ప్రారంభమైంది. విభిన్నమైన ఆకృతులు, వైవిధ్యమైన రంగుల్లో నింగికెసిన గాలపటాలు వీక్షకులను విశేషంగా అలరించాయి.



ఎయిరిండియాను ప్రైవేటీకరించొద్దు

కోలుకునేందుకు ఐదేళ్ల గడువివ్వండి

కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ నివేదన?

న్యూఢిల్లీ : ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహారణకు ఇది తగిన సమయం కాదని రవాణ, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది. రుణాలు తీర్చేసుకొని ఎయిరిండియా తిరిగి కోలుకునేందుకు ఐదేళ్ళ గడువివ్వాలని సూచించనుంది. టర్న్ ఎరౌండ్ ప్లాన్ (టిఎపి)లో భాగంగా ఎయిరిండియాకు కొద్ది మొత్తాలలో అప్పుడప్పుడు పెట్టుబడులు సమకూర్చడం దాని ఆర్థిక స్థితిపైన, నిర్వహణ తీరుపైన దుష్ప్రభావాన్ని చూపిందని పార్లమెంటరీ పానెల్ అభిప్రాయానికి వచ్చింది. కొరతను ఎదుర్కొనేందుకు అత్యధిక వడ్డీ రేటుతో ఎయిరిండియా రుణాలు చేయాల్సి వచ్చిందని ఎయిరిండియాలో పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, ప్రైవేటీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం సమీక్షించుకోవాలన్న అభిప్రాయానికి కమిటీ వచ్చినట్లు సమాచారం. దేశానికి గర్వకారణంగా ఉన్న ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహారణకు బదులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కూడా కమిటీ సూచించనున్నట్లు తెలిసింది.

పాక్ సరిహద్దులో 14 వేల బంకర్ల నిర్మాణం : కేంద్రం

జమ్మూ: జమ్మూ కాశ్మీర్‌లోని భారత్-పాక్ సరిహద్దు ప్రాంతంలో కొత్తగా 14 వేల బంకర్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సరిహద్దు ప్రాంతాలలో అనునిత్యం పాక్ వైపు నుండి తుపాకీ కాల్పులను ఎదుర్కొంటున్న స్థానికులకు రక్షణ కల్పించేందుకు రు.415.73 కోట్ల అంచనా వ్యయంతో ఈ బంకర్లను నిర్మించనున్నట్లు అధికారులు చెప్పారు. ఇందులో 7,298 బంకర్లను పూంఛ్, రాజౌరీ జిల్లాల్లోని అంతర్జాతీయసరిహద్దు వెంట, మరో 7,162 బంకర్లను జమ్మూ, కథువా, సాంబ జిల్లాలోని సరిహద్దుల వెంట నిర్మించనున్నట్లు వారు వివరించారు. సరిహద్దు ప్రాంతాలలో నివశించే వారికోసం ప్రభుత్వం ఇటీవల 14,460 బంకర్లను మంజూరు చేసింది. ఇందులో వ్యక్తిగత కుటుంబాలతో పాటు సామాజిక (కమ్యూనిటీ) బంకర్లు కూడా వున్నాయి. మొత్తం 13,029 వ్యక్తిగత కుటుంబ బంకర్లను, 1,431 సామాజిక బంకర్లను నిర్మిస్తామని చెప్పారు. కుటుంబ బంకర్లను 160 చ.అడుగుల విస్తీర్ణంలో ఎనిమిది మందికి సరిపడే విధంగానూ, కమ్యూనిటీ బంకర్లను 800 చ.అడుగుల విస్తీర్ణంలో 40 మందికి సరిపడే విధంగానూ నిర్మిస్తారు. భారత్-పాకిస్తాన్ సరిహద్దు 3,323 కి.మీ దూరం వుండగా అందులో 221 కి.మీ అంతర్జాతీయ సరిహద్దుతో పాటు 740 కి.మీ వాస్తవాధీన రేఖ ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్‌లో వున్న విషయం తెలిసిందే. గతేడాది కాలంలో పాక్ కాల్పులకు 19 మంది సైనికులు, 12 మంది పౌరులు, నలుగురు బిఎస్ఎఫ్ జవాన్లతో మొత్తం 35 మంది మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నాలుగో రోజూ... తమిళనాట ఆర్టీసి సమ్మె

చెన్నై : తమిళనాడులో ఆర్టీసి, ఇతర రవాణా సంస్థల ఉద్యోగులు, కార్మికుల సమ్మె ఆదివారం కూడా జరిగింది. ఆర్టీసి ఉద్యోగుల సమ్మె ప్రారంభించి ఆదివారానికి నాలుగు రోజులైంది. ఆర్టీసి ఉద్యోగుల సమ్మె కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేతన సంబంధిత సమస్యలపై ఆర్టీసి ఉద్యోగుల సంఘాలు నిరవధిక సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. పలు ప్రైవేటు బస్సులు నడుస్తున్నప్పటికి అవి ఏ ప్రాంతానికి వెళ్తాయో తెలియచేసేందుకు తగిన బోర్డులు లేని కారణంగా ఇబ్బందులు ఉద్యోగులు పేర్కొన్నారు. పలు జిల్లాలలో అత్యధిక సంఖ్యలో బస్సులు నడవ లేదు. దీంతో అధికారులు తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో బస్సులు నడిపారు. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన దాదాపు 66 శాతం బస్సులు శనివారం రాత్రి నుంచి నడుస్తున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులందరూ తిరిగి విధుల్లో చేరారని రవాణా శాఖ మంత్రి ఎం.ఆర్. విజయభాస్కర్ శనివారం చెప్పిన సంగతి తెలిసిందే. ఆర్టీసి ఉద్యోగుల సమ్మె కారణంగా బస్సులు రద్దు కావడంతో దక్షిణ రైల్వే వారాంతాన కూడా రైళ్ళను నడిపింది. చెన్నై బీచ్-తంబరమ్ మార్గంలో ప్రతి 10 నిముషాలకు ఒక స్థానిక రైలును నడిపారు. ఎంఆర్‌టిఎస్ సెక్షన్‌లో ప్రతి 15 నిముషాలకు ఒక రైలును నడిపారు. ఆర్టీసి ఉద్యోగులకు చెందిన దాదాపు 17 కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి.

'పద్మావత్' విడుదల 26న ?

న్యూఢిల్లీ: సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన పద్మావత్ చిత్రం గణతంత్ర దినోత్సవం సందర్భంగా(ఈనెల 26) ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి సంబంధించి చిత్ర నిర్వాహకులు త్వరలోనే ఓ ప్రకటన చేసే అవకాశమున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీపికా పదుకొనే ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని వివాదాలు చుట్టుముట్టిన సంగతి తెలిసిందే. సినిమాలో చరిత్రను వక్రీకరించారని రాజ్‌పుత్ వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో అనుకున్న సమయానికి సినిమా విడుదల కాలేదు. ఈ చిత్రానికి ఇటీవలే సెన్సార్ సర్టిఫికెట్ లభించింది. కానీ, సెన్సార్ బోర్డు.. సినిమాలో భారీ కోతలు పెట్టింది.

ఎకె గోపాలన్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

నిరసన వెల్లువతో వారించిన కాంగ్రెస్

తిరువనంతపురం : కమ్యూనిస్టు దిగ్గజ నేత, కీర్తిశేషులు ఎకె గోపాలన్‌పై కేరళకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే విటి బలరామ్ సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యక్తిత్వాన్ని శంకిస్తూ బలరామ్ చేసిన వ్యాఖ్యలపై కేరళలో నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఎకె గోపాలన్ అంటే కేరళ ప్రజలందరికీ గౌవరప్రదమైన నాయకుడని, అలాంటి నేతను విమర్శించడం తప్పేనని విటి బలరామ్‌ను ఆ పార్టీ నాయకత్వం తీవ్రంగా వారించింది. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షులు ఎంఎం హస్సన్ కూడా బలరామ్ వ్యాఖ్యలను ఖండించారు. ఇలాంటి తప్పు మళ్లీ ఎప్పుడూ చేయవద్దని బలరామ్‌ను హెచ్చరించారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మణిశంకర్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లే బలరామ్ చేసిన వ్యాఖ్యలపైనా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు రాహుల్ గాంధీ స్పందించాలని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ డిమాండ్ చేశారు.

షెరిన్ మాథ్యూ మృతి కేసులో అమెరికా సంస్థపై చర్యలు

న్యూఢిల్లీ: ఒక అమెరికన్ జంట దత్తత తీసుకున్న మూడేళ్ల భారత సంతతి బాలిక షెరిన్ మాథ్యూస్ మృతి కేసులో ఈ దత్తతకు సహకరించిన అమెరికన్ సంస్థపై భారత్ కొరడా ఝుళిపించింది. అమెరికాకు చెందిన భారతీయ ఆఫ్రికన్ జంట 2016లో దత్తత తీసుకున్న షెరిన్ మాథ్యూస్ గత అక్టోబర్‌లో మరణించిన విషయం తెలిసిందే. పాలు తాగేందుకు నిరాకరించిందన్న ఆగ్రహంతో ఆమె దత్తతతండ్రి చెట్టుకు కట్టేసి వాతలు పెట్టినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కేసులో అరెస్టయిన ఈ దంపతులు ఇప్పుడు జైలులో వున్నారు. షెరిన్ మాథ్యూస్ గృహసంబంధమైన హింసతోనే మరణించినట్లు ఆమె శవపరీక్ష నివేదిక వెల్లడించింది. దీనిపై స్పందించిన కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి మనేకా గాంధీ అమెరికాకు చెందిన విదేశీ దత్తత వ్యవహారాల సంస్థ హోల్ట్ ఇంటర్నేషనల్‌కు ఇచ్చిన గుర్తింపును సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ చిన్నారిని దత్తత తీసుకున్న జంట వ్యవహారశైలిని అంచనా వేయటంలో విఫలమైనందున హోల్ట్ ఇంటర్నేషనల్ కార్యకలాపాలను సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు చైల్డ్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) సిఇఒ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్ చెప్పారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయం నుండి నివేదిక అందిన తరువాత చిన్నారుల దత్తతకు సంబంధించి ఈ సంస్థకిచ్చిన అనుమతిని కూడా రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. షెరిన్ మాథ్యూస్ మృతి అక్టోబర్‌లోనే వెలుగులోకి వచ్చినప్పటికీ నవంబర్‌లో ట్రంప్ కుమార్తె ఇవాంక భారత పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థపై తీసుకోవాలిసన చర్యలను జాప్యం చేసినట్లు తెలుస్తోంది.

ఆసియన్ దేశాలతో భారత్ భాగస్వామ్యం

సుష్మా స్వరాజ్

సింగపూర్ : ఆసియన్ దేశాలతో భారత్ చర్చల భాగస్వామ్యం ఒక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవతరించిందని, ఆసియన్ గ్రూపుతో పటిష్టమైన భాగస్వామ్యం కోసం ప్రవాస భారతీయులు వేదికగా నిలిచారని ఆదివారం విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. ఇక్కడ జరిగిన ఆసియన్-ఇండియా ప్రవాసీ భారతీయ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆసియన్ దేశాల పట్ల భారత్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ప్రపంచంలో భారత్-ఆసియాల భవిష్యత్ కోసం తాము జరుపుతున్న ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మనమందరం ఇక్కడ ఉన్నామంటూ సుష్మా పేర్కొన్నారు. దాదాపు 3 వేల మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత్‌కు, ఆసియన్ దేశాలకు మధ్య పటిష్టమైన సంబంధాలు నెలకొనేలా ప్రవాస భారతీయులు ఒక వేదికను



కల్పించారన్నారు. ఆసియన్ దేశాలకు, భారత్‌కు మధ్య భాగస్వామ్యం నెలకొని 25 ఏళ్ళ మైలురాయి దాటిన సందర్భంగా ఆసియన్ దేశాలతో పటిష్టమైన ఆర్థిక సంబంధాల కోసం సుష్మా పిలుపునిచ్చారు. "మనం పంచుకునే నిబంధనల స్పష్టతపైనే ఆసియన్ ప్రాంతంతో భారత్ అనుసరించే తీరు ఆధారపడి ఉంది. అన్ని దేశాలు కూడా అంతర్జాతీయ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటాయని మేము విశ్వసిస్తున్నాం. సార్వభౌమ సమానత్వం, పరస్పర గౌరవం ప్రాతిపదికగా మనం ఉన్నప్పుడు మన దేశం భద్రత కలిగి ఉండటమే కాకుండా, ఆర్థిక సమున్నతి కూడా పొందగలుగుతాం." అని సుష్మా చెప్పారు.

భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్న కొద్దీ దాని సంబంధాలు బలపడుతున్నాయని, వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహం కూడా పెరుగుతున్నదని ఆమె చెప్పారు. భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ పాలసీలో భాగంగానే ఆసియన్‌తో సంబంధాలుఉన్నాయని ఆమె చెప్పారు. ప్రపంచ దేశాలతో ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్ళడంలోనూ, దేశ పురోగమనంలోనూ రాష్ట్రాలది కీలక పాత్ర అని ఆమె పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలు వృద్ధి చెంది, ఆగ్నేయాసియాకు వారధిగా నిలుస్తాయని ఆమె చెప్పారు.

నైపుణ్యాలు, ఉపాధి అవాకాశాలు సృష్టించుకోవడం, వేగవంతమైన పట్టణీకరణ, జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవడం, ఇంధన వనరులను పరిశుభ్రంగా తయారు చేసుకోవడం వంటి ఉమ్మడి సవాళ్ళను పరిష్కరించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పారిశ్రామిక యుగం నుంచి సమాచార యుగంలోకి చేరకున్నామన్నారు. అంతర్జాతీయంగా అధికార సమతుల్యత బదిలీ అయ్యిందని, దేశాల మధ్య సంబంధాలలో పలు మార్పులు చోటు చేసుకున్నాయని ఆమె తెలిపారు. ఆసియన్ భారత దేశపు 4వ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. మొత్తం వాణిజ్యంలో 10.2 శాతం దీని వల్ల జరుగుతున్నది. అలాగే ఆసియన్ దేశాలకు భారత్ 7వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత్-ఆసియన్ దేశాల మధ్య చర్చల భాగస్వామ్యానికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 25న జరగనున్న సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనున్నది. బ్రూనె, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పిన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం లు కలిసి ఆసియన్ దేశాలుగా ఏర్పడ్డాయి.

'అమ్మకానికి ఆధార్' కథనం రాసిన జర్నలిస్టుపై కేసు

- తీవ్రంగా ఖండించిన ఎడిటర్స్ గిల్డ్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డుల జారీ కోసం ప్రజల నుండి సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారంటూ కథనం రాసిన ఆంగ్ల పత్రిక విలేకరి రచనా ఖైరాపైనా, పత్రికా యాజమాన్యంపైనా దేశ విశిష్ట గుర్తింపు సాధికారిక సంస్థ (యుఐడిఎఐ) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆధార్‌పై వాస్తవ విరుద్ధమైన వార్తలు రాసిన వారిపైన, ప్రచురించిన యాజమాన్యాలపైన చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టం చేసింది. పౌరుల నుంచి ఆధార్ పేరుతో యుఐడిఎఐ సేకరించిన సమాచారం నుండి తాను పలు ఫోన్ నెంబర్లను, ఇ-మెయిల్ చిరునామాలను రూ.500కే కొనుగోలు చేసినట్లు ఖైరా రాసిన కథనం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఆధార్ సమాచార భద్రతపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న సమయంలో లీకేజ్ కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన యుఐడిఎఐ ఆ పని చేయకపోగా..సదరు ఆందోళనతో కథనం రాసిన విలేకరిపైనే కొరడా ఝుళిపించటం విమర్శలకు తావిస్తోంది.

పత్రికా స్వేచ్ఛపై ప్రభుత్వ ప్రత్యక్ష దాడి : ఎడిటర్స్ గిల్డ్

ఖైరాపై యుఐడిఎఐ పోలీసు ఫిర్యాదు చేయటాన్ని భారత పత్రికా సంపాదకుల సమాఖ్య (ఎడిటర్స్ గిల్డ్) తీవ్రంగా ఖండించింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని పరిశోధనాత్మక వార్తా కథనాన్ని రాసే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం పత్రికారంగం పీకలపై కత్తి పెట్టటమేనని



ఎడిటర్స్ గిల్డ్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పత్రికా స్వేచ్ఛపై ప్రభుత్వం నేరుగా చేస్తున్న ఈ దాడి అన్యాయమని, ఆమోదయోగ్యం కాదని గిల్డ్ తన ప్రకటనలో పేర్కొంది. వార్త రాసిన విలేకరిపై కక్ష సాధించటానికి బదులు సమాచార భద్రతకు తగిన చర్యలు చేపట్టటం సముచితమని గిల్డ్ సూచించింది. పత్రికా విలేకరి, యాజమాన్యాలపై చేసిన ఫిర్యాదులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

సచిన్ కుమార్తెకు ఫోన్‌లో వేధింపులు

బెంగాల్‌లో ఒకరి అరెస్టు

ముంబయి : క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తెపైనే వేధింపులకు పాల్పడ్డాడు ఒక ప్రబుద్ధుడు.



పశ్చిమ బెంగాల్‌కు చెందిన దేవ్‌కుమార్ మిట్టి అనే 32 సంవత్సరాల వ్యక్తి సుబర్బన్ బంద్రాలోని సచిన్ నివాసంలోని ల్యాండ్ లైన్‌కు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడ్డాడు. డిసెంబరు నెలలో ఫోన్ చేసి సచిన్ కుమార్తెను కిడ్నాప్ చేస్తానని, పెళ్లి చేసుకుంటానని అసభ్యంగా మాట్లాడేవాడు. ఇందుకోసం సహాయం చేయాలని సచిన్ ఇంట్లోని పనివాళ్లను కోరేవాడు. సచిన్ మేనేజర్ ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో పశ్చిమ బెంగాల్ నుంచి ఫోన్లు వస్తున్నట్లు గుర్తించారు. మిద్నాపూర్ జిల్లాలో దేవ్‌కుమార్ మిట్టిని అరెస్టు చేసి ముంబయికి తరలించారు. సచిన్ కుమార్తెను టీవీలో చూసినట్లు నిందితుడు తెలిపాడు. మిట్టి చదవు మధ్యలో ఆపేసి, ఖాళీగా వుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది.

కర్నాటకలో యోగి ఆదిత్యనాథ్ ప్రచారం

సిద్ధరామయ్యపై విమర్శల వర్షం

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శల వర్షం కురిపించారు. బెంగళూరులో బిజెపి నిర్వహించిన తొలి ఎన్నికల ప్రచారసభలో ఆయన పాల్గొన్నారు. సిద్ధరామయ్యకు హిందువుగా చెప్పుకునే అర్హత లేదని, ఆయన రాష్ట్రంలో బీఫ్ వినియోగాన్ని ప్రోత్సహించారని ఆదిత్యనాథ్ వాపోయారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు గోవధను నిషేధిస్తూ చట్టం తీసుకు వచ్చిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దానిని రద్దు చేసిందన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సిద్ధరామయ్యకు ఆయన హిందువునన్న విషయం గుర్తుకు వచ్చిందని ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా నశించాయని, దాదాపు 20 మంది హిందూ కార్యకర్తలు



హత్యకు గురయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలాక్ బిల్లును కూడా వ్యతిరేకించిందన్నారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేయలేదని అన్నారు. రాష్ట్రంలో కుల, మతాల పేరుతో కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించారు.

కర్నాటకలో రెచ్చిపోయిన సంఘ్ పరివార్

- మంగళూరులో మైనార్టీ యువకునిపై దాడి
- తీవ్రగాయాలతో ఆసుపత్రిలో బాధితుడు మృతి

మంగళూరు : కర్నాటకలో సంఘ్ పరివార్ మూకలు రెచ్చిపోయాయి. మంగళూరులో హిందూత్వ మితవాద గూండాలు చేసిన దాడిలో అహ్మద్ బషీర్ (47) అనే మైనార్టీ యువకుడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చనిపోయారు. ఆరెస్సెస్ కార్యకర్తలు కొందరు ఈ నెల 3న బషీర్‌పై ఈ దాడి చేశారు. నగరంలోని కొట్టార చౌకిలోని తినుబండారాల దుకాణాన్ని నిర్వహిస్తున్న బషీర్ కొట్టును మూసేసి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో దుండగులు కాపుకాసి ఈ దాడికి



పాల్పడినట్లు తెలుస్తోంది. రక్తపు మడుగులో పడివున్న బషీర్‌ను స్థానికులు అంబులెన్స్‌లో ఎజె ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బషీర్ ఆదివారం మృతి చెందారు. ఇటీవల హత్యకు గురైన బిజెపి కార్యకర్త దీపక్ రావు మృతికి ప్రతికారంగానే ఈ దాడికి తెగబడినట్లు ఈ కేసులో అరెస్టయిన నిందితులో విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆదివారం ఇదే జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు.

బ్రిటన్ కన్నా మెరుగు

చైనాకు చలో అంటున్న భారత విద్యార్థులు

- గతంలో కంటే బాగా పెరిగిన వైద్య ప్రవేశాలు
- తక్కువ ఫీజులు, నాణ్యమైన విద్యాబోధనే కారణం
- నీట్‌తో మరింత పెరిగిన విద్యా వలసలు
- మెడికల్ స్టూడెంట్స్ బాటలో ఇంజనీరింగ్ విద్యార్థులు



ముంబయి : భారత్ నుండి ఇతర దేశాలలో విద్యనభ్యసించేందుకు ఉత్సాహం చూపుతున్నవారిలో అధిక శాతం మందిని చైనా ఎక్కువగా ఆకర్షిస్తోందని తాజా అధ్యయనంలో వెల్లడయింది. గతంలో విదేశీ విద్య అంటే బ్రిటన్‌పై ఎక్కువ మోజు చూపిన విద్యార్థులు ఇప్పుడు చైనాపై ఆసక్తి చూపుతున్నారని నిపుణులు చెబుతున్నారు. 2010-11 నుండే భారత విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు చైనా వెళ్తున్నప్పటికీ తాజాగా భారత్‌లో వైద్య విద్యా ప్రవేశాలను 'నీట్' ఆధారిత విధానంలోకి మార్చినప్పటి నుండి ఈ సంఖ్య మరింత పెరిగిందని చెబుతున్నారు. ఇప్పటి వరకూ వైద్య విద్యకు మాత్రమే పరిమితమైన ఈ ధోరణి ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యకు కూడా విస్తరించింది. 'తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యకు చైనా గమ్యస్థానంగా వుందని, అక్కడి వైద్య విద్యార్థుల డిగ్రీలను భారత వైద్య మండలి కూడా గుర్తిస్తోందని, ముఖ్యంగా చైనాలో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన వుండటం కూడా విద్యార్థులకు ఆకర్షణీయంగా వుందని విదేశీ విద్యా నిపుణురాలు ప్రతిభా జైన్ చెబుతున్నారు.

2016 సంవత్సరం గణాంకాల ప్రకారం చైనాలో ప్రస్తుతం 18,171 మంది భారతీయ విద్యార్థులుండగా బ్రిటన్‌లో 18,015 మంది మాత్రమే వున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో నీట్ ప్రవేశ పరీక్షను క్లియర్ చేయలేని విద్యార్థులకు సహజంగానే చైనా విద్యాగమ్యస్థానంగా కన్పిస్తోందని నిపుణులు వివరిస్తున్నారు. దీనితో పాటు రష్యా భాషకు సంబంధించిన సమస్య కూడా భారతీయ విద్యార్థుల దృష్టిని చైనా వైపు మళ్లింపోతందంటున్నారు. గతంలో రష్యాలో వైద్యవిద్యనభ్యసించి భారత్‌లో వైద్య వృత్తి కొనసాగించేందుకు భారతీయ వైద్యమండలి అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి వుండేది. ఈ ప్రక్రియ అత్యంత క్లిష్టమైనది కావటంతో దీని కన్నా చైనాలో విద్యాభ్యాసమే మేలన్న అభిప్రాయం అధికశాతం మంది విద్యార్థుల్లో వున్నట్లు తెలుస్తోంది. దీనితో పాటు చైనా యూనివర్శిటీలలో సగటున వైద్య బోధనా వార్షిక రుసుము 2 వేల నుండి 3 వేల డాలర్ల మధ్య వుంటుండటం, దీనికి అదనంగా మరో వెయ్యి డాలర్లు దైనందిన ఖర్చుకోసం దగ్గర వుంచుకుంటే సరిపోవటం కూడా ఇందుకు మరో కారణంగా చెబుతున్నారు. 2015లో చైనాలోని వివిధ యూనివర్శిటీలలో మొత్తం 13,500 మంది భారతీయ విద్యార్థులున్నారు. చైనా వర్శిటీలలో విద్యనభ్యసించే విదేశీ విద్యార్థుల టాప్‌టెన్ జాబితాలో భారత్ తన స్థానాన్ని పదిలపర్చుకుంటోంది. వాస్తవానికి అమెరికా, బ్రిటన్ తరువాత అంతర్జాతీయ విద్యార్థులకు చైనా అత్యంత ఆకర్షణీయమైన విద్యా గమ్యస్థానంగా మారింది. విదేశాలలో విద్యాభ్యాసానికి వెళ్లే భారతీయులను ఆకర్షించటంలో చైనా ఐదో స్థానంలో నిలవటం విశేషం.

సంక్షిప్తం

మణిపూర్‌లో 6.0 తీవ్రతతో భూకంపం

న్యూఢిల్లీ : మణిపూర్‌లోని మయన్మార్-భారత్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. కంపన తీవ్రత రెక్టర్ స్కేల్‌పై 6.0గా నమోదైంది. జాతీయ భూకంపనాల అధ్యయన కేంద్రం అందించిన వివరాల మేరకు మధ్యాహ్నం 12.17 గంటల సమయంలో 35 కిలోమీటర్ల విస్తృతిలో భూకంపం సంభవించింది. మయన్మార్-భారత సరిహద్దు ప్రాంతం వద్ద 24.7 ఉత్తర అక్షాంశం, 94.7 తూర్పు రేఖాంశం వద్ద భూకంపం సంభవించిందని ఆ కేంద్రం తెలిపింది.

అమెరికన్ కాంగ్రెస్‌కు అరుణా మిల్లర్ నామినేషన్

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికన్ రాజకీయ వేత్త అరుణా మిల్లర్ అమెరికన్ కాంగ్రెస్ ఉప ఎన్నికకు ఆదివారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మేరీ లాండ్ స్థానం నుండి జరిగే ఈ ఉప ఎన్నిక ప్రస్తుత సభ్యుడు డెలానీ పదవీకాలం ముగియటంతో ఈ ఉప ఎన్నిక జరుగుతోంది. తాను ఇతర దేశాల నుండి ఇక్కడికి వలస వచ్చినప్పటికీ తనకు అనేక అవకాశాలు లభించాయని అరుణా మిల్లర్ చెప్పారు.

147 మంది భారత జాలర్లను విడుదల చేసిన పాక్

ఇస్లామాబాద్ : కరాచీ జైలులో శిక్ష అనుభవిస్తున్న 147 మంది భారత జాలర్లను పాకిస్తాన్ ప్రభుత్వం విడుదల చేసింది. తమ సముద్ర భాగంలో అక్రమంగా చేపలు పడుతున్నారనే కారణంగా ఎనిమిది నెలల క్రితం పాకిస్తాన్ అదుపులోకి తీసుకుంది. కరాచీ జైలు నుంచి వీరిని విడుదల చేసినట్లు ఇస్లామాబాద్‌లోని పోలీసులు ధృవీకరించారు. లహోర్‌లోని భారతీయ అధికారులకు జాలర్లను అప్పగిస్తామని పోలీసుధికారి ఒకరు తెలిపారు. జనవరి 8 లోగా 300 మంది భారత జాలర్లను విడుదల చేయాలని డిసెంబరులో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ 147 మందిని విడుదల చేశారు. డిసెంబరు 28న తొలిదశలో 145 మంది భారత జాలర్లను పాక్ విడుదల చేసింది. కాగా, ఇంకా 262 మంది భారతీయ జాలర్లు మాలిర్ జైల్‌లో శిక్షను అనుభవిస్తున్నట్లు ఆ జైలు అధికారి హుస్సాన్ సెహ్తో తెలిపారు.

మార్చిలో క్యూబా పార్లమెంట్ ఎన్నికలు

హవానా: క్యూబా పార్లమెంట్‌కు మార్చి 11న ఎన్నికలు జరగనున్నాయి. ప్రావిన్షియల్ ప్రతినిధులు, నేషనల్ అసెంబ్లీ ప్రతినిధులను ఎన్నుకునేందుకు సంబంధించిన ఎన్నికల కార్యక్రమానికి క్యూబా మంత్రి మండలి ఆమోదముద్ర వేయటంతో ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిందని గ్రాన్మా పత్రిక వెల్లడించింది. రాజ్యాంగ నిబంధనలు, 1992 నాటి ఎన్నికల చట్టం, డిసెంబర్ 22న ఆమోదించిన సవరణలతో లభించిన అధికారాలతో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ తన ప్రకటనలో వివరించింది. పార్లమెంట్, ప్రావిన్షియల్ చట్టసభలకు తమ అభ్యర్థులను ప్రకటించేందుకు ఈ నెల 21న మున్సిపల్ అసెంబ్లీలు ప్రత్యేకంగా సమావేశమవుతాయని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘోర ప్రమాదం

చైనా తూర్పుతీరంలో నౌకల ఢీకొన్న ఘటనలో మంటల్లో చిక్కుకున్న పనామాకు చెందిన చమురు రవాణా నౌక. చమురు తెట్టు భారీగా విస్తరించి జలచరాలకు తీవ్ర ప్రమాదం పొంచివుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చైనా తూర్పు తీరంలో రెండు నౌకల ఢీ

32 మంది గల్లంతు

బీజింగ్: చైనా తూర్పు తీర ప్రాంతంలో శనివారం రాత్రి రెండు నౌకలు ఢీకొన్న ఘటనలో 30 మంది ఇరానియన్లు, ఇద్దరు బంగ్లాదేశీయులతో సహా మొత్తం 32 మంది జాడ తెలియటం లేదని చైనా రవాణా మంత్రిత్వశాఖ ఆదివారం వెల్లడించింది. యాంగ్జీ నదీ సంగమ ప్రాంతానికి దాదాపు 160 మైళ్ల దూరంలో పనామాకు చెందిన ఒక చమురు నౌక, హాంకాంగ్‌కుచెందిన మరో సరుకు రవాణా నౌక ఢీకొన్నాయని ఈ ప్రకటనలో వివరించారు. గల్లంతయిన 32 మంది పనామా చమురు నౌకకు సంబంధించిన వారేనని, రెండు నౌకలు ఢీకొన్న అనంతరం ఇది మునిగిపోయిందని ఈ ప్రకటనలో తెలిపారు. సరుకు రవాణా నౌకలోని 21 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చామని, వీరంతా చైనీయులేనని ఈ ప్రకటనలో వివరించారు. 274 మీటర్ల పొడవున్న చమురు రవాణా నౌక సాంచి ఇరాన్ నుండి ద.కొరియాకు చమురు తీసుకెళ్తుండగా హాంకాంగ్ నౌకను ఢీకొన్నదని, ఢీకొన్న వెంటనే నౌకలో మంటలు చెలరేగాయని వెల్లడించింది. ఈ నౌక నుండి చిందిన చమురు సముద్రం అంతా తెట్టులా విస్తరించిందని, అయితే ఈ మేరకు ఈ చమురు తెట్టు విస్తరించిందనేది ఇప్పుడే చెప్పలేమని చైనా పేర్కొంది. ఈ ఘటనలో సరుకు రవాణా నౌక సిఎఫ్ క్రిస్టల్ పాక్షికంగా దెబ్బతిన్నదని, ఇందులో 64 వేల టన్నుల ఆహార ధాన్యాలున్నాయని తెలిపింది. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే చైనా సముద్ర రక్షక దళాధికారులు ఎనిమిది నౌకలను సహాయ కార్యక్రమాలకోసం పంపారు. ద.కొరియా సైతం ఈ కార్యక్రమాలలో సహకరించేందుకు తమ కోస్ట్‌గార్డ్ నౌకను, విమానాన్ని రంగంలోకి దించింది.

నాసా వ్యోమగామి జాన్ యంగ్ మృతి



వాషింగ్టన్ : ప్రముఖ వ్యోమగామి జాన్ యంగ్ (87) నిమోనియా వ్యాధితో బాధపడుతూ మృతి చెందారని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ఆదివారం ప్రకటించింది. జాన్ యంగ్ చంద్రునిపై నడిచిన 9వ వ్యక్తి. ఆయన తొలి మానవ సహిత జెమిని మిషన్‌కు నేతృత్వం వహించారు. నాసా నిర్వహించిన జెమిని, అపోలో, స్పేస్ షటిల్ కార్యక్రమలలో భాగంగా నాసా తరుపున అంతరిక్షంలోకి వెళ్ళిన ఒకే ఒక వ్యోమగామి యంగ్ అని, ఆరు సార్లు అంతరిక్షంలోకి వెళ్ళివచ్చిన తొలి వ్యోమగామి అని నాసా యాక్టింగ్ అడ్మినిస్ట్రేటర్ రాబర్ట్ లైట్‌ఫుట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాసాతో పాటు, ప్రపంచం కూడా ఒక ప్రముఖ వ్యక్తిని కోల్పోయిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'ఉగ్ర' సాయానికి పదేళ్ల జైలు : పాక్

ఇస్లామాబాద్: ముంబయి దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ సారథ్యంలోని నిషిద్ధ ఉగ్రవాద, ఛారిటీ సంస్థలకు ఆర్థిక సాయం అందచేసే వారికి పదేళ్ల జైలు శిక్షతో పాటు భారీ జరిమానాను విధించనున్నట్లు పాక్ ప్రభుత్వం హెచ్చరించింది. ప్రభుత్వం ఉర్దూ భాషలో విడుదల చేసిన ఈ పత్రికా ప్రకటనను దేశంలోని ప్రముఖ పత్రికలన్నీ ఆదివారం ప్రచురించాయి. ఈ ప్రకటనలో నిషిద్ధ జాబితాలోని 72 గ్రూపుల పేర్లను ప్రచురించారు. ఇందులో హఫీజ్ సయీద్ సారథ్యంలోని జమాత్ ఉద్ దవా, ఫలా-ఎ-ఇన్సానియత్ ఫౌండేషన్, లష్కరే తోయిబా, మహ్మద్ మసూద్ అజర్‌కు చెందిన జైషేమహ్మద్ వంటి సంస్థలు ఉన్నాయి.

గ్రామీణ పేదలకు నగరాల్లో ఇంటి భాగ్యం

- **2020 నాటికి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చైనా ప్రణాళిక**

బీజింగ్ : 2020 నాటికి దేశంలో నిరుపేదరికాన్ని సైతం తరిమికొట్టాలన్న లక్ష్యంతో కార్యక్రమాలను రూపొందించుకుంటున్న చైనా ప్రభుత్వం దేశంలోని నిరుపేదలందరికీ సొంత ఇళ్లను సమకూర్చాలని నిర్ణయించింది. 2020 నాటికి పేదరిక నిర్మూలనను లక్ష్యంగా నిర్ణయించుకున్న అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే చైనా మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో వున్న ఒక కుగ్రామంలో నివశిస్తున్న పేదలను బీజింగ్, షాంఘయి తదితర నగరాలలో నిర్మించిన ఆకాశహర్మ్యాలలో వారికి కేటాయించిన ఫ్లాట్‌లకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దేశంలో పేదరికంపై యుద్ధం ప్రకటించి గత మూడేళ్లుగా వడివడిగా అడుగులు వేస్తున్న సీ జిన్‌పింగ్ సర్కారు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న లక్షలాది మందిని ప్రభుత్వ సబ్సిడీతో నిర్మించే గృహాలకు తరలించేందుకు సిద్ధమయింది. కొంతమందిని దూరంగా వున్న పట్టణ ప్రాంత హౌసింగ్ ఎస్టేట్స్‌కు తరలిస్తుండగా మరి కొందరిని వారు నివశిస్తున్న గ్రామీణ ప్రాంతాలకు సమీపంలోని నగరాలలోనే నివాసాలను ఏర్పాటు చేస్తోంది. దీనితో పాటు వారికి రుణ సదుపాయం కల్పించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవటంతో పాటు, వారికి ఉపాధి కల్పించటం ద్వారా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు సైతం చర్యలు చేపట్టింది. 2020 నాటికి దాదాపు 3 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయటపడేసి వారికి కనీస జీవనాదాయాన్ని కల్పించాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం కార్యక్రమాలను చేపడుతోంది.





చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లోని పడంగషాంగ్ గ్రామంలో 143 పేద కుటుంబాలున్నాయి. వీరంతా తేయాకు, నట్స్, కాఫీ పండించే రైతులు. వీరందరికి ప్రభుత్వం కొత్త గృహాలను నిర్మించింది. కొత్త గృహం మంజూరైన లబ్ధిదారుల్లో జియావో జిలావో (50) కుటుంబం కూడా ఉంది.

గత రెండు దశాబ్దాల కాలంలో గణనీయమైన ఆర్థిక ప్రగతిని సాధించిన చైనా 1980ల నాటి నుండి 2016 వరకూ లక్షలాది మంది నిరుపేదలను పేదరికం నుండి బయటపడేసింది. చైనా జనాభాలో ఇప్పుడు కనీసం 5.7 శాతం మంది మాత్రమే నిరుపేదలున్నట్లు ఐరాస తాజాగా వెల్లడించిన లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తయితే 2016-20 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 22 ప్రావిన్స్‌ల్లో వున్న దాదాపు 98.1 లక్షల మంది ప్రజలకు సొంత ఇంటి స్వప్నం సాకారం కానుంది. గత ఏడాది చైనాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన గిర్జౌలో దాదాపు 7.5 లక్షల మంది ప్రజలకు 3,600కు పైగా ప్రాంతాలలో నిర్మించిన ఇళ్లను కేటాయించి వారిని అందులోకి తరలించారు. గాన్సు, సిచువాన్, గాంగ్జి, యునాన్ తదితర ప్రావిన్స్‌ల్లో కూడా దాదాపు 2,800 గ్రామాలలో నిర్మించిన కొత్త ఇళ్లకు 6.77 లక్షల మంది ప్రజలను తరలించారు. సకల సౌకర్యాలతో నిర్మించిన ఈ కొత్త ఇళ్లు తమ సొంతం కావటం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిరియాలో వైమానిక దాడులు

17 మంది మృతి

డెమాస్కస్: సిరియా తూర్పు ప్రాంతంలోని ఘౌటా నగరంపై సిరియా వైమానిక దళం నిర్వహించిన దాడుల్లో కనీసం 17 మంది పౌరులు మరణించారని లండన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. సిరియా యుద్ధ విమానాలు హమ్మురియా ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 12 మంది, అర్బిన్ నగరంలో ముగ్గురు, మెడియారా ప్రాంతంలో జరిపిన దాడుల్లో ఇద్దరు మరణించారని ఈ సంస్థ ఒక ప్రకటనలో వివరించింది. కాగా ఈ దాడుల్లో మరణించిన వారిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు వున్నారని సిరియా సివిల్ డిఫెన్స్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. శనివారం నాటి ఈ దాడుల్లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుందని, క్షతగాత్రుల్లో కనీసం 25 మంది పరిస్థితి విషమంగా వుందని సిరియన్ అబ్జర్వేటరీ తన ప్రకటనలో పేర్కొంది. కేవలం హమ్మురియా ప్రాంతంలో జరిగిన దాడుల్లోనే దాదాపు 40 మందికి పైగా గాయపడ్డారని సిరియా సివిల్ డిఫెన్స్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. గత నెల 29 నుండి వరుసగా ప్రతిరోజూ జరుగుతున్న ఈ దాడుల్లో ఇప్పటివరకూ కనీసం 23 మంది పౌరులు మరణించారని, దాదాపు 96 మందికి పైగా క్షతగాత్రులయ్యారని అబ్జర్వేటరీ వివరించింది.

చెక్క ప్లేట్లలో ఆహారం వడ్డన

బ్రిటన్ రెస్టారెంట్‌కు రూ.43 లక్షల జరిమానా



బర్మింగ్‌హామ్ : కలపతో చేసిన పళ్లాల్లో వినియోగదారులకు ఆహారం వడ్డించిన ఆరోపణలతో బర్మింగ్‌హామ్ నగరంలోని అకాక్స్ గ్రీన్ ప్రాంతంలో వున్న ఇబ్రహీమ్ గ్రిల్ అండ్ స్టీక్ హౌస్‌కు అధికారులు 50 వేల పౌండ్ల (దాదాపు రూ.43 లక్షలు) జరిమానా విధించారు. 2016 అక్టోబర్‌లో ఈ రెస్టారెంట్‌ను పరిశీలించిన అధికారులు అక్కడి పారిశుధ్య పరిస్థితులు, ఇతర సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో యాజమాన్యం రెస్టారెంట్‌లో పరిస్థితులను మెరుగుపర్చినప్పటికీ రెండు నెలల తరువాత మరోసారి సందర్శించిన అధికారులు అక్కడ చెక్కప్లేట్లలో ఆహారం వడ్డిస్తున్న విషయాన్ని గమనించారు. చెక్క ప్లేట్లలో ఆహారం వడ్డిస్తే అది విషతుల్యమై అతిథుల ఆరోగ్యానికి చేటు చేస్తుందని అధికారులు తమ కేసులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన బర్మింగ్‌హామ్ మేజిస్ట్రేట్ కోర్టు తాము చెక్కప్లేట్లను వినియోగిస్తున్న విషయాన్ని, అధికారులు జారీ చేసిన నోటీసు మేరకు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చటంలో విఫలమయ్యామని యాజమాన్యం అంగీకరించినట్లు తన తీర్పులో పేర్కొంది. ఈ రెస్టారెంట్‌లో ఆహారం తిని అనేక మంది అస్వస్థత పాలయ్యారని అధికారులు కోర్టు దృష్టికి తీసుకు రావటంతో యాజమాన్యానికి 50 వేల పౌండ్లు జరిమానా విధించిన కోర్టు దీనితో పాటు బాధితులకు ఆస్పత్రి ఖర్చులు కూడా చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

మొదటి పేజీ తరువాయి

గ్రామస్థాయిలో నీటి ఆడిట్

తెలిపారు. ఈఏడాది 144 టిఎంసిలను మళ్లించామని చెప్పారు. కడపలో 73 టిఎంసిలు, అనంతపురంలో 25 టిఎంసిలు, కర్నూలులో 43 టిఎంసిలు నిల్వ ఉంచగలిగామని తెలిపారు. తుంగభద్ర ద్వారా నీరందే కెసి కెనాల్, ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సికి ఏటేటా నీటి లభ్యత తగ్గిపోతుందని, పోలవరం కట్టడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాలుంటే 1.03 కోట్ల ఎకరాలకు నీరందుతున్నాయని, రాష్ట్రంలో మరమ్మతులకు గురయిన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేశామని తెలిపారు. నీరు వృథా కాకుండా గ్రామస్థాయిలో ఎంత వర్షం కురుస్తుంది, ఎంత నిల్వ ఉంటుంది, ఎంత దిగువకు వెళ్తుంది అనే అంశాలతో వాటర్ ఆడిట్ ఉండాలని చెప్పారు. కర్నూలు జిల్లాకు సంబంధించి వేదవతి ఎత్తిపోతల పథకాన్ని, హంద్రీనీవా వెంట చెరువులను నింపే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. సహజ వనరులకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెద్దఎత్తున చేపడుతున్నామని తెలిపారు. అలాగే ప్రకృతిని కాపాడుకునేందుకు మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ, శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండి.ఫరూక్, ఎంపీలు ఎస్పీవై.రెడ్డి, బుట్టా రేణుక, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిమ్‌తో చర్చలకు సిద్ధం : ట్రంప్

సిద్ధంగానే వున్నానని, తనకు అందులో ఎటువంటి సమస్యా కన్పించటం లేదని అన్నారు. అయితే ఏ చర్చలకైనా కొన్ని షరతులనేవి వుంటాయని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రెండేళ్ల విరామం అనంతరం ఉభయ కొరియాల మధ్య మంగళవారం నాడు సరిహద్దు గ్రామంలో చర్చలు ప్రారంభం కానున్నాయి. శీతాకాలపు ఒలింపిక్స్‌లో పరస్పర సహకారంపై ఉభయదేశాలూ చర్చించను న్నాయి. 'ఇప్పుడు వారు ఒలింపిక్స్ గురించి మాత్రమే మాట్లాడుతుండవచ్చు. ఇది ప్రారంభం, ఇదో గొప్ప ప్రారంభం' అని ట్రంప్ అభివర్ణించారు. చర్చలంటూ ప్రారంభమైతే, ఏదో ఒక ఫలితం వెలువడుతుంది. అది మానవాళికి ప్రయోజనకరమవుతుందని, ప్రపంచానికి శుభపరిణామం అవుతుందని ఆశిస్తున్నానన్నారు. ఉభయ కొరియాలపై తాను ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు వారి మధ్య చర్చలకు దారితీసాయని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

బోఫోర్స్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ప్రకారం బోఫోర్స్ తుపాకుల విక్రయానికి ప్రతిగా స్వీడన్ భారత్ నుండి కాఫీ, ఆముదం, తదితర ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సి వుంటుంది. ఈ ఎగుమతుల ప్రక్రియను పర్యవేక్షించేందుకు భారత ప్రభుత్వం స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. అదే విధంగా బోఫోర్స్ సంస్థ తన ప్రతినిధిగా లండన్‌కు చెందిన అలెగ్జాండర్ క్రిచ్టన్ అసోసియేట్స్‌ను నియమించుకుంది. జయంత్ ఆయిల్‌మిల్స్‌సంస్థ తన ఉత్పత్తులను లండన్‌కు చెందిన కంపెనీ ద్వారా బోఫోర్స్‌కు విక్రయించాల్సి వుంది. దీనికి సర్వీస్ ఛార్జిగా ఎగుమతుల విలువలలో 0.5 శాతం సొమ్మును ఎస్‌టిసికి చెల్లించాల్సి వుంటుంది. 1989-90 కాలంలో ఈ సంస్థ డైరెక్టర్లుగా వ్యవహరించిన అభయ్ వి ఉదేషి, విఠల్‌దాస్ జి ఉదేషి, సంస్థ ఉద్యోగి హరిష్ పాండ్యాతో కలిసి ఎస్‌టిసిని మోసం చేసేందుకు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని సిబిఐ ఆరోపించింది. దీనిని గుర్తించిన ఎస్‌టిసి అధికారులు సిబిఐకి ఫిర్యాదు చేయటంతో 1992లో ఆ సంస్థ దీనిపై దర్యాప్తు ప్రారంభించింది. 2004లో వీరి ముగ్గురిపై అభియోగపత్రాన్ని నమోదు చేసినప్పటికీ మధ్యలో విఠల్‌దాస్ జి ఉదేషి మరణించటంతో ఆయనపై కేసును నిలిపివేసింది. మిగిలిన అభయ్ ఉదేషి, పాండ్యాలు కేసులో దోషులుగా తేలటంతో వారికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తన తీర్పులో ప్రకటించారు.

అఖిల భారత రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య

ఉపాధ్యక్షులుగా లీలా మాధవరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అఖిల భారత రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య ఉపాధ్యక్షులుగా దివి లీలా మాధవరావును, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి చిట్టిబాబును నియమించినట్లు రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు మాధవ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాల్ని అఖిలభారత రేషన్ డీలర్ల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బిస్వంబర్ బసు వెల్లడించారన్నారు. రాష్ట్రంలోని డీలర్ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు.

బిజెపి, టిడిపి విడాకులకు పునాదులు పడ్డాయి

- మోడీ, బాబు రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు
- పుదుచ్చేరి సిఎం నారాయణసామి
- ధవళేశ్వరం నుంచి కాంగ్రెస్ మహా పాదయాత్ర ప్రారంభం



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న నారాయణసామి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

బిజెపి, టిడిపి 2014లో పెళ్లి చేసుకున్నాయని, ప్రస్తుతం ఆ పార్టీల మధ్య విడాకులకు పునాదులు పడ్డాయని పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణసామి వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ విగ్రహం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహా పాదయాత్రను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రసంగాలు చేయడం తప్ప డబ్బులు మాత్రం ఇవ్వరన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా విషయాల్లో మోడీ, చంద్రబాబు రాష్ట్రాన్ని అవమానిస్తున్నారని, డ్రామాలాడుతున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం తన నిధులతో పూర్తి చేయాల్సి ఉండగా, నాబార్డు నుంచి అప్పుతెస్తానని సిఎం చెప్పడం వింతగా ఉందన్నారు. చంద్రబాబుకు పబ్లిసిటీ తప్ప వేరే పనిలేదన్నారు. కాంగ్రెస్ తప్ప మరేపార్టీ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయలేదని చెప్పారు. పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకడం లేదని అన్నారు. టిడిపి ఎంపీలంతా మోడీని బతిమాలుకుంటే ఈనెల 15న అపాయింట్‌మెంట్ ఇచ్చారన్నారు. రహస్య మీటింగ్ కాకుండా సమావేశాన్ని లైవ్‌లో చూపించాలని సిఎంను కోరారు. కేంద్ర నిధులతో 2018 చివరి నాటికి పోలవరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ కెవిపి రామచంద్రరావు, మాజీ కేంద్రమంత్రి జెడి శీలం తదితరులు ప్రసంగించారు.

12 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర...

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి 2018 చివరి నాటికి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మహా పాదయాత్రను నారాయణసామి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఉన్న కాటన్, వైఎస్ఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈనెల 9వ తేదీ వరకూ 47 కిలోమీటర్లు సాగనున్న ఈ పాదయాత్ర 10 తేదీన పోలవరం చేరుకోనుంది. ఆల్‌కట్‌తోట, కోటిపల్లి బస్టాండ్ వద్ద ప్రజలనుద్దేశించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. అనంతరం పాదయాత్ర రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా కొవ్వూరు చేరుకుంది. తొలిరోజు 12 కిలోమీటర్ల పాదయాత్ర సాగింది. పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు ఎంఎం.పళ్లంరాజు, పనబాక లక్ష్మి, కె. కృపారాణి, శైలజానాథ్, వట్టి వసంతకుమార్, పసుపులేటి బాలరాజు, టి.తులసిరెడ్డి, గిడుగు రుద్రరాజు, సి.రామచంద్రయ్య, బుచ్చిమహేశ్వర రావు, కనుమూరి బాపిరాజు, పంతం నానాజీ, ఉండవల్లి అరుణ్‌కుమార్, జివి హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవుని ఉనికికి చరిత్రే మూలం

ముగిసిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ముగింపు సమావేశాలు

ప్రజాశక్తి-నరసాపురం/పాలకొల్లు

మానవుని ఉనికికి చరిత్రే మూలమని నరసాపురం ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 42వ వార్షికోత్సవ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ మాధవనాయుడు మాట్లాడుతూ చరిత్రను ఆకలింపు చేసుకోవ డం ద్వారా బాధ్యత కలిగిన పౌరులుగా రూ పొందడానికి అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందని, చరిత్రలో నిలిచిపోయే విధంగా మన రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్మించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇదేవిధంగా నదుల అనుసంధానం చేసుకోవడం ద్వారా మన రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యయనమన్నారు. సమాజాభివృద్ధికి చరిత్ర ఎంతగానో దోహదపడతుందని, ఏ ప్రాంతానికైనా చరిత్ర యొక్క ఆవశ్యకత ఉందన్నారు. సమాజానికి దిక్సూచి చరిత్ర అని చెప్పారు. విద్యార్థి దశ నుండే చరిత్ర పట్ల ఆసక్తి ఉంటుందని, చారిత్రాత్మక ప్రదేశాలకు వెళ్లినప్పుడు వాటి గురించి తెలుసుకోవడం, చరిత్ర మూలమని మన దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో త్యాగమూర్తులు గురించి స్వాతంత్ర్య యోధుల గురించి ఉద్యమంలో పాల్గొన్న ఎందరో మహానుభావుల గురించి భావితరాలకు తెలియజెప్పే వారిలో స్ఫూర్తి నింపేది చరిత్ర అని ఆయన అన్నారు. నరసాపురం పట్టణంలో ఎన్నో ళ్ల చరిత్ర కలిగిన లూథరన్ చర్చి, టేలర్ హైస్కూళ్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సమావేశాలకు ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు సుమారు 250 మందికి పైగా హాజరయ్యారు. అనంతరం సమగ్రాంధ్ర చరిత్ర, సంస్కృతి ఆధారాల గ్రంథాన్ని ఆవిష్కరించారు. పలు తీర్మానాలు ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వి.వెంకటరామయ్య, ప్రిన్సిపల్ ఎఆర్ఎస్.కుమార్, వైస్‌ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వర్లు, హిస్టరీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఎస్.సోమశేఖర్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.చింతారావు పాల్గొన్నారు.

పెల్లెట్ ప్లాంట్ నిర్మాణానికి ఆర్ఐఎన్ఎల్, కెఐఒసిఎల్ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్), కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ (కెఐఒసిఎల్) మధ్య పెల్లెట్ ప్లాంట్ నిర్మాణానికి ఎంఒయు కుదిరింది. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన ఒప్పంద పత్రాలను మంగళూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేందర్ సింగ్, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణాశర్మ సమక్షంలో ఆర్ఐఎన్ఎల్ సిఎమ్‌డి పి.మధుసూదన్, కెఐఒసిఎల్ సిఎమ్‌డి ఎంవి.సుబ్బారావు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. ఒప్పంద పత్రాలపై విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) విల్సన్ డేవిడ్, కెఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) వి.బోబార్గ్ జయహరన్ సంతకాలు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతంలో సంవత్సరానికి 1.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెల్లెట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నారు.

రాష్ట్రాల స్వేచ్ఛను హరించేందుకే ఎంవి చట్ట సవరణ బిల్లు : ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటారు వాహన చట్ట సవరణ బిల్లుతో రవాణాపై రాష్ట్రాలకున్న స్వేచ్ఛను హరించేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందితే రూట్లను నోటిఫై చేయడం, పన్నులు విధించడం, లైసెన్సులు జారీ చేయడం వంటి అధికారాలు కేంద్రం చేతుల్లోకి పోతాయని తెలిపారు. కేంద్రం చేతుల్లోకి అధికారాలు వెళ్తే మన రూట్లన్నీ ఉబర్, అదానీ, అంబానీలకు అప్పగించినా రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సంస్థల్ని ప్రయివేటీకరణ చేసిన కేంద్ర ప్రభుత్వం ఆర్టీసిని సక్రమంగా ఎలా నడుపుతుందని ప్రశ్నించారు.

అభివృద్ధికి కుల, మతాలు అడ్డుకాదు

కేంద్ర మాజీమంత్రి శరద్ యాదవ్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

అభివృద్ధికి కుల, మతాలు అడ్డుకాదని, ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు పి.శివశంకర్ నిరూపించారని మాజీ కేంద్ర మంత్రి శరద్ యాదవ్ అన్నారు. విశాఖపట్నంలోని వుడా చిల్డ్రన్ థియేటర్‌లో ఆదివారం పి.శివశంకర్ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 'రాజ్యాంగ రక్షణ-ప్రజాస్వామ్య పరిరక్షణ' అనే అంశంపై చర్చ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శరద యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులం, మతంతో సంబంధం లేకుండా ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. పేద కుటుంబానికి చెందిన శివశంకర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో న్యాయశాఖ మంత్రిగా పనిచేసి దేశ న్యాయ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. సాధారణ వ్యక్తి స్థాయి నుంచి కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగారని, ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో కేవలం ఐదు కులాలకు చెందిన వారే పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు శివశంకర్ పాటుపడ్డారని కొనియాడారు.

కాపులు, దళితులతో రాజకీయ ప్రత్యామ్నాయం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో రెండు సామాజిక తరగతులకే పరిమితమైన అధికారాన్ని ఇతరులకూ దక్కేలా చేసేందుకు త్వరలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఏర్పాటు కానుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులు, కాపులు, ఇతర వెనుకబడిన తరగతులతో కలిసి ఒక కూటమి ఏర్పడనుందని చెప్పారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో సామాజిక న్యాయం అమలైనా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అమలు కాలేదని చెప్పారు. 40 ఏళ్లు రెడ్లు, 20 ఏళ్ల కమ్మ సామాజిక తరగతులే అధికారం అనుభవించి జీవితాంతం తామే అధికారంలో ఉండాలని కలలు కంటున్నారని విమర్శించారు. తాను 30 ఏళ్ల అధికారంలో ఉంటానని జగన్ చెప్పుకుంటున్నారని, అవినీతి కేసుల్లో ఆయన జైలుకు వెళితే చేసేదేమిటని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంటుందని, రైతుల భూములను బడా వ్యాపారులకు కట్టబెట్టి చంద్రబాబు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును, జగన్‌ను తిరస్కరించడం ఖాయమన్నారు.

నటనకు కొత్తా?. సినిమా బ్యాక్ గ్రౌండ్ ఉందా? లేదా?... వెళ్లమ్మా...వెళ్లు...మమ్మల్ని ఎందుకు తింటారు. ఎక్కడైనా కాస్తా ట్రైనింగ్ అయి... రా.. అప్పుడు చూద్దాం. నటనంటే అనుభవం ఉండాలి. అదేమైనా ఆషామాషీయా? ఎవరు పడితే వాళ్లు సినిమాల్లోకి వచ్చేద్దామని అనుకుంటారు...ఈ మాటలు గతంలో తరచూ వినిపించేవి. ఇప్పుడు వీటికి బదులు కొత్తవాళ్ల కోసం ప్రత్యేకంగా ఆడిషన్స్ పెడుతున్నారు. కొత్తగా ఎలా చేస్తావో చెప్పు అనడం..నటనలో విభిన్నత కనిపిస్తే ఎంపిక చేసేసి వాళ్లతో సినిమా తీసేయడమే. ఇది ఇప్పుడున్న ట్రెండ్. ఇలా కొత్తగా చిత్రసీమలోకి ప్రవేశించాక మొదటి సినిమా హిట్ అయినా ఫట్ అయినా మెప్పించగలిగితే చాలు అవకాశాలకు కొదవుండడం లేదు. అందుకే ఇప్పుడు విడుదలవుతున్న సినిమాల్లో ఎక్కువగా కొత్తగా ఎంట్రీ ఇస్తున్న వారివే ఎక్కువగా ఉంటున్నాయి. అలా ఎంట్రీ ఇచ్చి భాషతో సంబంధం లేకుండా అవకాశం దొరికిన ప్రతి చోటా సినిమాలు చేసేస్తూ ...భలే మెప్పిస్తున్నారనిపించుకుంటున్నారు.


సాయి పల్లవి

కొత్తవాళ్లూ మెప్పిస్తున్నారు


శాలినీ పాండే

మెడిసిన్ చేయాలన్నది తన జీవిత లక్ష్యం. డాన్స్ తన ప్రత్యేక అభిరుచి. సరదాగా చేసే ఆ డాన్సే తనను సెలబ్రిటీని చేసింది. ఇప్పుడు నటిని కూడా చేసింది. ఆమె ఎవరో కాదు సాయి పల్లవి. మలయాళంలో 'ప్రేమమ్'లో చేసింది. సినిమా హిట్టే కాదు అవార్డులొచ్చాయి. అందులో చేసిన హీరోయిన్లకు మంచి పేరొచ్చింది. ఏదో ఆఫరొచ్చింది కదా అని సాయి పల్లవి అందులో చేసింది. ఇంకేముంది అవకాశాలు వరుస కట్టాయి. తమిళ్, తెలుగు భాషా చిత్రాలతో ఇప్పుడు బిజీ అయిపోయింది. తమిళ్‌లో సూర్య వంటి పెద్ద హీరోతో చిత్రం చేసే ఛాన్స్ వచ్చింది. ఇక తెలుగులో అయితే ఆమె నటనకు 'ఫిదా' అయిపోయే అభిమానులే ఎక్కువ. అందుకే వరుస పెట్టి తెలుగులో చేసేస్తుంది. నిన్ననే నానితో 'ఎంసీఎ' చేసింది. ఇప్పుడు శర్వానంద్‌తో కొత్త చిత్రం చేస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే ఈమె డేట్స్ అడ్జస్ట్ కావడం లేదంటే ఏకంగా శర్వానంద్ తన షూటింగ్ షెడ్యూల్‌నే మార్చేశాడు. ఫిబ్రవరిలో చేయాల్సిన సినిమాను ఈనెలలోప్రారంభించేస్తున్నాడు. అంటే ఈమెకు ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈమె వెండితెరకు కొత్త కానీ మెప్పించడంలో మాత్రం పాతదనం కాదు.

'ప్రీతి'పాత్రం

జబల్‌పూర్ అమ్మాయి తెలుగు వారికి పిచ్చ పిచ్చగా నచ్చేసింది. అచ్చం మన పక్కింటి అమ్మాయిలా భలే చేసింది. మొదటి చిత్రంతోనే ఫ్యాన్స్‌ను సంపాదించుకుంది. ఆమె శాలినీ పాండే...యువతకు పరిచయం చేయక్కర్లేని పేరు. ఎందుకంటే చాలా మందికి 'అర్జున్ రెడ్డి' లవర్ ప్రీతిగా గుర్తిండిపోతుంది. తన ప్రీతిపాత్రమైన నటనకు తెలుగు ప్రేక్షకులు వేసిన మార్కులు వందకు వంద. అర్జున్ రెడ్డి సినిమా కథ తీరు తీరుతెన్నులు గురించి పక్కనపెడితే నాలుగు కోట్లతో నిర్మించిన చిత్రం 40 కోట్లు తెచ్చిపెట్టింది. ఇప్పుడు శాలినీ పాండే తెలుగు, తమిళ్ రెండు భాషల్లో సినిమాలు చేస్తుంది. తెలుగులో 'మహానటి' బయోపిక్‌లో చేస్తుంది. అర్జున్ విడుదలైన వెంటనే ఈ ఛాన్స్ కనిపించబోతుంది. తమిళ్‌లో '100శాతం లవ్' చిత్రం రీమేక్‌లో కథానాయికగా నటిస్తుంది. దీంతో తెలుగులో మరో సినిమా చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిసింది.


నివేతా పెతురాజ్

రీతూ వర్మ

చిత్రసీమలోకి వచ్చి చాలా రోజులు అయిపోయినా తన నటనను గుర్తించే వారు లేక చిన్న పాత్రలు చేసుకుంటూ వచ్చింది రీతూ వర్మ. వచ్చిన పాత్రలు కూడా చిన్నవి కావడం నటనకు ఆస్కారం లేక తనను తాను నిరూపించుకోలేకపోయింది. 'పెళ్లి చూపులు' చిత్రం తన జీవితాన్ని మార్చేసింది. తర్వాత వరుస పెట్టి సినిమాలు చేస్తూనే ఉంది. కేశవ, వీఐపీ వంటి చిత్రాలు గత ఏడాది చేసింది. ఈ సంవత్సరం కూడా భలే ఆఫర్లు తన చేతిలో ఉన్నాయి. మూడు భాషల్లో రూపొందుతోన్న 'ధృవ నక్షత్రం' చిత్రంలో కథానాయికగా చేస్తోంది. దీనికి గౌతమ్ మీనన్ దర్శకత్వంలో వహిస్తున్నాడు. హీరో విక్రమ్. ఇంత పెద్ద హీరో సినిమాలో చేసే అవకాశం వచ్చిందంటే నటనే కారణం. ఈ సినిమాలో పాటు 'కన్నుమ్ కన్నుమ్ కొలియాడితాల్' అనే తమిళ్ సినిమాలో నటిస్తుంది.

నివేతా పెతురాజ్

సినిమాల్లో నటించాలన్నది కల అయితే... దాని కోసం ఎంతైనా శ్రమిస్తారు. అటువంటి ఎంతోమంది ఉన్నారు. ఇప్పుడు కొత్తగా తెలుగు చిత్రసీమకు పరిచమైన హీరోయిన్ నివేతా పెతురాజ్ కూడా అంతే. అందుకే మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. ఇటీవలే ఆమె చేసిన 'మెంటల్ మదిలో' వచ్చింది. అందులో ఆమె నటనలో ప్రదర్శించిన పరిణితి సీనియర్‌ను తలపించింది. విశేషం ఏమిటంటే ఈ ఏడాది తెలుగు, తమిళ్ రెండు భాషల్లోనూ ఆమె చేసిన చిత్రాలు మంచి సక్సెస్‌ను అందుకున్నాయి. ఆ రెండు భాషల్లో ఈమెది డెబ్యూనే. అందుకే ఇప్పుడు రెండు సినిమాలో చేసే ఛాన్స్ వచ్చింది. తమిళ్‌లో స్టార్ హీరో జయం రవితో 'టిక్ టిక్ టిక్'లో నటిస్తుంది. అంతేకాదు జైతో కూడా 'పార్టీ' అనే చిత్రం చేస్తుంది. తెలుగులో ఓ సినిమా చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని ఇటీవలే ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పింది.


రష్మిక మండన్నా

రష్మికా మండన్నా

ఇటీవల నాగ శౌర్య చేసిన 'ఛలో' టీజర్, రెండు గీతాలను విడుదల చేశారు. అందులో హీరోయిన్ ముఖ భావాలను చూసి తెలుగు ఇండస్ట్రీకి మరో కొత్త టాలెంట్ వచ్చిందని చాలా మంది సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెడుతున్నారు. అమె ఎవరో కాదు రష్మిక మండన్నా. రెండేళ్ల క్రితమే సినిమా రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. 'కిరాక్ పార్టీ'తో శాండిల్ వుడ్ ప్రేక్షకులను గుక్క తిప్పుకోనివ్వకుండా తెరవైపే చూసే తన నటనతో మెప్పించింది. తనకు జీవితాన్నిచ్చింది కాబట్టి కన్నడలోనే ముందు సినిమా చేస్తానని ఆఫర్స్ వచ్చినా వాటిని తిరస్కరించింది. టాలెంట్ ఉంటే ఊరుకుంటారా? దర్శకులు క్యూ కడుతూనే ఉంటారు. అందుకే గత ఏడాది కన్నడలో రెండు సినిమాలు చేసింది. ఇప్పుడు తెలుగులోనూ చేస్తుంది. పాత్ర కొత్తగా ఉంటేనే చేస్తానని కండీషన్ కూడా పెట్టింది. అందుకే అవకాశాలు కుప్పలు తెప్పలుగా వస్తున్నా ఆచి తూచి నిర్ణయాలు తీసుకుంటుంది.

– కొప్పుశెట్టి దేవరాజు


రీతూ వర్మ

మూలాలను మరచిపోలేదు

సూర్య



"వైజాగ్, హైదరాబాద్, కారైకూడి, చెన్నై సహా సినిమాను డిఫరెంట్ లొకేషన్స్‌లో షూట్ చేశాం. మేమేదో గొప్ప సినిమా చేశామని చెప్పను కానీ..20 ఏళ్ల తర్వాత నా మూలాల్లోకి వెళ్లి చేసిన భావన కలిగింది. అందువల్ల నాకు కొత్తగా అనిపించింది..రేపు సినిమా చూసే ఆడియెన్స్‌కు సూర్య కొత్తగా కనపడ్డాడే అనిపిస్తుంది. మూలాలకు వెళ్లి చేశానని చెప్పడానికి కారణం నేను నా మూలాలను మరచిపోలేదు. సినిమాల్లోకి రాక మునుపు ఒక ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేశాను. నా తొలి సంపాదన ఏడు వందల ఇరవై ఆరు రూపాయలు. బస్సులోనే ప్రయాణించేవాడిని. అలా నా తల్లిదండ్రులు నన్ను సాధారణంగానే పెంచారు. కాబట్టి నా మూలాలను నేను మరచిపోలేదు" అని సూర్య అన్నారు. ఆయన హీరోగా చేసిన చిత్రం 'గ్యాంగ్'. కీర్తిసురేష్ కథానాయిక. ఈనెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సూర్య విలేకరులతో మాట్లాడారు.

టైటిల్‌ను బట్టి కథ ఎలా ఉంటుందని ఊహించొచ్చు?

ఏ ప్రొఫెషన్‌లో అయినా ఎంతో కొంత నేర్చుకుంటూనే ఉంటాం. దాని వల్ల కొంత పరిణితి సంపాదిస్తాం. మనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటాం. మరొకరి దారిని మనం ఫాలో కాకూడదని మనం అనుకుంటాం. అలా నాకు ఓ పరిణితితో కూడిన ప్రయాణం కొనసాగింది. ఈ సినిమా విషయానికి వస్తే..20 ఏళ్ల సినీ జర్నీ తర్వాత..డైరెక్టర్ కథను రాసుకున్న విధానం, నెరేట్ చేసిన పద్ధతి నచ్చి 'గ్యాంగ్' చేశాను. ఈ సినిమాలో నటించడం వల్ల నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఈ మధ్యలో ఇలాంటి పాత్రను నేనెప్పుడూ చేయలేదు. అయితే కెరీర్ ప్రారంభంలో ఇలాంటి పాత్రలు చేశాను. ఈ సినిమా చేయడం వల్ల పదేళ్ల వయసు తగ్గినట్టు అనిపించింది. విఘ్నేశ్ కథను చెప్పినప్పుడు ఓ ఫ్రెష్‌నెస్‌ను ఫీలయ్యాను. చాలా మంది యువ దర్శకులు విఘ్నేశ్ సన్నివేశాల రచన, స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుందని చెప్పారు. విఘ్నేశ్ దర్శకుడే కాదు...డ్రమ్స్ వాయిస్తాడు, పాటలు రాస్తుంటాడు.

ఇది బాలీవుడ్ సినిమాకు రీమేకా?

బాలీవుడ్ సినిమా 'స్పెషల్ 26' కు రీమేక్ సినిమా ఇది. రెండు, మూడు సన్నివేశాలు మాతృకలో ఉన్నట్లే ఉన్నాయి. మిగిలిన సినిమా విఘ్నేశ్ తనదైన శైలిలో కొత్త కథను చెప్పడానికి ప్రయత్నించాడు. చాలా క్యారెక్టర్స్, ఎమోషన్స్, బ్యాక్‌గ్రౌండ్, కారణాలు ఈ సినిమాలో మనకు కనపడతాయి. 1987 బ్యాక్‌డ్రాప్ అనగానే బాలచందర్ సినిమాలు, కమల్ హాసన్ నటించిన సత్య సినిమాలతో నేను కనెక్ట్ అయ్యాను.

సినిమా కథ ఏమిటి?

1980 దశకంలో నిరుద్యోగం అనేది పెద్ద సమస్యగా ఉండేది. దాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నాం. నేను నా కెరీర్‌ను 1987లో ప్రారంభించడం వల్ల ఈ బ్యాక్‌డ్రాప్‌కు కనెక్ట్ అయ్యాను. నా పాత రోజులకు వెళ్లినట్లుగా నాకు అనిపించింది. ఈ మధ్య లార్జర్ దేన్ లైఫ్ సినిమాలే ఎక్కువగా చేస్తూ వచ్చాను. కానీ ఈ సినిమా రియాలిటీకి దగ్గరగా ఉందనిపించింది. 1980 దశకంలో జరిగిన నిజమైన ఘటన ఓపెరా రొబరి ఆధారంగానే కథను తయారు చేశాడు దర్శకుడు విఘ్నేశ్.

ఈ చిత్రానికి కలిసొచ్చే అంశాలేమిటి?

సినిమాకు అద్భుతమైన టీమ్ కుదిరింది. సీనియర్ నటులు కార్తీక్, రమ్యకృష్ణ, సెంథిల్ తదితరుల నటనతో పాటు అనిరుధ్ మ్యూజిక్, దినేశ్ సినిమాటోగ్రఫీ సినిమాకు ఎసెట్ అయ్యాయి.

మీరే తెలుగులో డబ్బింగ్ చెప్పడానికి కారణం?

ఈ సినిమా కోసం నేను తెలుగులో డబ్బింగ్ చెప్పాను. ఇండియాలోని భాషలన్నింటిలో తెలుగు చాలా మధురమైన భాష అని నేను చిన్నప్పుడు చదువుకున్నాను. నేను డబ్బింగ్ చెబుతున్నప్పుడు నాకు ఆ విషయం అవగతమైంది. తమిళ డబ్బింగ్‌ను ఎనిమిది రోజుల్లో చెబితే..తెలుగు డబ్బింగ్‌ను ఆరు రోజుల్లో చెప్పేశాను. శశాంక్ వెన్నెలకంటి డబ్బింగ్ విషయంలో ఎంతో సహకారం అందించారు. ఈ సినిమాలో నా ఉచ్చారణలో తమిళ స్లాంగ్ ఎక్కడైనా వినపడొచ్చు. కానీ భవిష్యత్తులో కచ్చితమైన తెలుగులోనే డబ్బింగ్ చెబుతాను. సాధారణంగా శ్రీనివాసమూర్తిగారు గతంలో నా చిత్రాలకు డబ్బింగ్ చెప్పేవారు. ఇది వరకు సినిమాల్లోని నా పాత్రలు చాలా ఎగ్రెసివ్‌గా ఉండటం వల్ల ఆయనే ఎక్కువగా డబ్బింగ్ చెప్పారు. 'గ్యాంగ్' విషయానికి వస్తే..పాత్ర చాలా జోవియల్‌గా సాగుతుంది..వాయిస్ అగ్రెసివ్‌గా ఉండాల్సిన అవసరం లేదు. కాబట్టి నేనే డబ్బింగ్ చెప్పాను. 'సూర్య సన్నాఫ్ కృష్ణ'లో నేను యంగర్ వాయిస్ కావాల్సి రావడంతో అప్పుడు కూడా శ్రీనివాస్ మూర్తిగారికి బదులుగా శశాంక్ డబ్బింగ్ చెప్పారు. 'గ్యాంగ్' టీజర్‌లో నేను చెప్పిన వాయిస్ బావుందని ఫీడ్ బ్యాక్ కూడా రావడంతో నాకు నమ్మకం ఏర్పడి డబ్బింగ్ చెప్పాను.

రజనీ, కమల్ రాజకీయ ప్రవేశంపై మీ అభిప్రాయం?

రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఇప్పుడు తమిళ రాజకీయాల్లోకి వచ్చారు. వీరి చుట్టూ చాలా రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయి. ఇద్దరికీ వేర్వేరు అభిప్రాయాలున్నప్పటికీ రీసెంట్‌గా మలేషియాలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్నప్పటికీ రాజకీయాల్లోకి రావడం, రాణించడం అంత సులభం కాదు. ఎలక్షన్స్‌కు ఇంకా రెండేళ్ల సమయం ఉంది.

మీరు త్వరలో చేయనున్న సినిమాలు?

సెల్వరాఘవన్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాను. కె.వి.ఆనంద్‌గారి దర్శకత్వంలో సినిమా చిత్రీకరణ జరగాల్సి ఉంది. హరి డైరెక్షన్‌లో రెండేళ్లకు ఒక సినిమా చేస్తాను. కానీ ప్రస్తుతానికైతే చేయడం లేదు. తదుపరి ఆయనతో చేయబోయే సినిమా సింగం సీక్వెల్ మాత్రం చేయడం లేదు.

'ఒక్క క్షణం' ఓ మెమరబుల్ మూవీ


శీరత్ కపూర్, వి.ఐ. ఆనంద్, అల్లు శిరీష్

అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, శీరత్ కపూర్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. చక్రి చిగురుపాటి నిర్మాత. సినిమా డిసెంబర్ 28న విడుదలైంది. శనివారం సినిమా సక్సెస్‌లో భాగంగా చిత్రయూనిట్ థాంక్స్ టు మీట్‌ను నిర్వహించారు.

అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాను ప్రేక్షకులు చాలా పెద్ద హిట్ చేసినందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నా తొలి సినిమా 'గౌరవం' బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ సాధించలేదు. దాంతో ఏదైనా కొత్తగా చేద్దామనే ఆలోచన తగ్గిపోయింది. తర్వాత చేసిన 'కొత్తజంట', 'శ్రీరస్తు శుభమస్తు' వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను చేశాను. మళ్లీ ధైర్యం తెచ్చుకుని ఏదైనా కొత్తగా చేస్తే ఆడియెన్స్ ఆదరిస్తారనిపించింది. ఆ ప్రయత్నంలో భాగంగా 'ఒక్కక్షణం' సినిమా చేశాను. నమ్మకంతో ఈ సినిమా చేశాను. ఈ రోజు నా నమ్మకం నిజమైంది. 2017లో ఈ సినిమాకు నాకు ఓ మెమరబుల్ మూవీగా నిలిచింది. నా కెరీర్‌లో 2017కి చాలా ప్రత్యేకత ఉంది. 1971 బియాండ్ బోర్డర్ సినిమాలో మోహన్‌లాల్ పక్కన మంచి సపోర్టింగ్ పాత్రలో నటించాను. ఆ సినిమాలో నా క్యారెక్టర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే డిసెంబర్ 28న 'ఒక్కక్షణం' విడుదలైంది. మొత్తంగా చూస్తే ఇది నా ఐదో సినిమా. ఈ సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఏ సినిమాకూ రాలేదు. సినిమా చూసిన వారందరూ అప్రిసియేట్ చేశారు. ఇంత మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. అలాగే నాతో వర్క్ చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. భవిష్యత్‌లో కూడా మంచి సినిమాలు చేయాలనే కాన్ఫిడెన్స్‌ను ఇచ్చిన అందరికీ థాంక్స్' అని అన్నారు.

'సినిమా విడుదల చేస్తామనుకోలేదు'



ఫిల్మీడియా ప్రొడక్షన్స్ ప్రవేట్ లిమిటెడ్ పతాకంపై అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిలుకూరి బాలాజీ సినిమా ఈ నెల 5 వతేదీన విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత కార్యాలయంలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దర్శకుడు అల్లాణి శ్రీధర్ నటుడు అశోక్ కుమార్, ఎగ్జిబిటర్ డాక్టర్ రామచంద్ర వారణాసి పాల్గొన్నారు. అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ 'విడుదల అవుతుందో లేదో అనే అయోమయ స్థితిలో ప్రముఖ పంపిణీదారుడు ఈ సినిమా ట్రైలర్‌లు చూసి మేము విడుదల చేస్తాం అని ముందుకొచ్చారు. తుమ్మల సత్యనారాయణ కూడా ఆంధ్రలో విడుదల చేశారు.. సినిమా విడుదలైన ప్రతి చోటా చాలా మంచి స్పందన వచ్చింది. యువతరం ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారు. పండగకు పెద్ద సినిమాలు విడుదల కారణంగా కొన్ని థియేటర్లలో మా చిత్రాన్ని తీసేసినా మళ్లీ వేస్తామని పంపిణీదారులు చెప్పారు" అని అన్నారు.

రూపాయి



విద్యారుణం నిబంధనలు

రెండు మూడునెలల్లో విద్యార్థులకు పరీక్షా కాలం మొదలవుతుంది. పదవ తరగతి తర్వాత ఇంటర్మీడియట్, డిగ్రీ వంటి చదువుల విషయంలో ఆర్థిక విషయాలను లెక్కలేసుకునే సమయమూ ఇదే. అయితే.. ప్రస్తుత పరిస్థితుల్లో మేలైన విద్యాకోర్సులు అభ్యసించాలంటే అందుకు తగ్గ ఆర్థికపరమైన మద్దతు ఉండాలి. ముఖ్యంగా స్వదేశంలో గుర్తింపు పొందిన కళాశాలలు, విదేశాల్లో చదువుకోవడం అనేది అందరికీ సాధ్యమయ్యేది కాదు. కానీ విద్యార్థుల్లో ప్రతిభ ఉంటే.. దేశంలోని ముఖ్యమైన విద్యాసంస్థలతోపాటు విదేశాల్లోనూ విద్యనభ్యసించే అవకాశాలు ఉన్నాయి. విద్యారుణాల ఆసరాగా ఆ కోరికను నెరవేర్చుకునే వీలూ ఉంది. అయితే విద్యారుణాలు పొందే విషయంలో అందుకుతగ్గ ప్రణాళిక ఉండాలి. విద్యారుణాలను పొందాలనుకునేవారు ఎలాంటి ప్రయత్నం చేయాలి? బ్యాంకుల నియమ, నిబంధనలు ఎలా ఉంటాయి? ఇదే ఇవాల్టి 'రూపాయి' ప్రత్యేక కథనం

ఒకప్పుడు విదేశాల్లో చదవడం అనేది కేవలం ధనవంతుల కుటుంబాలకు చెందిన పిల్లలకే సాధ్యమయ్యేది. విదేశాల్లో చదువుకోవాలనే పేద విద్యార్థుల కల.. కలగానే మిగిలిపోయేది. కానీ, ప్రస్తుతకాలంలో విదేశీ విద్య అనేది అన్నివర్గాల వారికి సాధ్యమవుతోంది. ఒకపక్క చదువు అనేది ఎంతో ఖరీదైన అంశంగా మారుతున్న క్రమంలో విదేశీ చదువు మరింత భారమైన వ్యవహారమైనా.. ప్రతిభగల విద్యార్థులకు దాదాపు అన్ని బ్యాంకులు సులభంగానే విద్యారుణాలు అందిస్తున్నాయి.

విద్యా రుణం

విద్యా రుణం మంజూరుకు సంబంధించి ప్రతి బ్యాంకూ కొన్ని ప్రత్యేక ప్రమాణాలను పాటిస్తుంటాయి. కొన్ని బ్యాంకులు టెక్నికల్ కోర్సులకు మాత్రమే రుణాలనిస్తాయి. ముఖ్యంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివే వారికి, దీర్ఘకాలిక కోర్సులు చదివే వారికి ప్రాధాన్యత ఇస్తాయి. వొకేషనల్ కోర్సులు చదవాలనుకునే వారికి విద్యారుణాలు అందడం ఒకింత కష్టమే. రూ.4 లక్షలకు మించి విద్యారుణం తీసుకోవాలని అనుకున్నప్పుడు కొంత మొత్తాన్ని మార్జిన్ మనీగా చూపించాల్సి ఉంటుంది. సాధారణంగా ఇది 15 శాతం వరకూ ఉంటుంది. రుణాన్ని నేరుగా విద్యాసంస్థల పేరు మీదే చెల్లిస్తారు.



ఎవరికి ఇస్తారు?

భారత పౌరులందరికీ విద్యా రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అర్హత ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు నిర్ణీత పత్రాలతో సిద్ధమైతే చాలు. ఆ వివరాలు:

(1) మీరు చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విశ్వవిద్యాలయం నుంచి ప్రవేశపత్రం (ఇందులో ఎలాంటి షరతులూ ఉండకూడదు). మొత్తం ఎంత ఖర్చవుతుందనే అంచనా పత్రం (విశ్వవిద్యాలయం నుంచి)

(2) దరఖాస్తుదారుడు, సహ దరఖాస్తుదారుడివి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, వ్యక్తిగత, చిరునామా ధ్రువీకరణ కోసం ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు (ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సులాంటివి) విద్యార్థి, సహ దరఖాస్తుదారులకు సంబంధించిన ఆరునెలల బ్యాంకు ఖాతా లావాదేవీల వివరాలు.

(3) సహ దరఖాస్తుదారుడి ఆదాయ ధ్రువీకరణ కోసం అతని వేతన స్లిప్పు, గత రెండేళ్ల ఫారం-16, ఆదాయపు పన్ను రిటర్నులు.

(4) సహ దరఖాస్తుదారుడి ఆస్తులు-అప్పులకు సంబంధించిన వివరాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు (అసలు), ఆస్తి పన్ను చెల్లింపు రశీదు.

(5) విద్యార్థి విద్యార్హతలకు సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు.

ఎలాంటి అవసరాలకోసం?

విదేశాల్లో విద్యాభ్యాసం అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అయితే, విద్యారుణం తీసుకున్నప్పుడు ఇందులో వేటిని పరిగణనలోనికి తీసుకొని, రుణాన్ని అందిస్తారన్నది ముందుగానే విద్యార్థులకు తెలియాలి. ఆ వివరాలు..

ట్యూషన్ ఫీజు ; లేబరేటరీ ఫీజు ; పరీక్షల ఫీజు ; లైబ్రరీ ఫీజు, విద్యాభ్యాసానికి అవసరమైన పరికరాలు, పుస్తకాల కొనుగోలు కోసం ల్యాప్‌టాప్ కొనుగోలుకు ప్రయాణ ఖర్చులు ; విదేశాల్లో నివసించేందుకు అయ్యే ఖర్చులు, ప్రాజెక్టు, స్టడీ టూర్లకు అయ్యే ఖర్చులు.. ముఖ్యమైనవి.

గ్యారంటీ ఉండాలా?

విద్యారుణాల విషయంలో రూ.4 లక్షల వరకూ ఎలాంటి హామీలు, తనఖాలు అక్కర్లేదనే నిబంధనలు ఉన్నాయి. అయితే, అంతకన్నా ఎక్కువ మొత్తంలో కావాలనుకున్నప్పుడు మాత్రం బ్యాంకులు కొన్ని హామీలు, తనఖాలు అడిగే ఆస్కారం ఉంది. రుణానికి దరఖాస్తు చేసే విద్యార్థి తల్లిదండ్రులు / సంరక్షకులు తప్పనిసరిగా రుణ సహ దరఖాస్తుదారుడిగా ఉండాలని చాలా బ్యాంకులు నిబంధన విధిస్తున్నాయి. వివాహం అయిన వ్యక్తికి జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు లేదా అత్తామామలు కూడా సహ దరఖాస్తుదారులుగా ఉండే అవకాశం ఉంది. కొన్నిసార్లు మూడో వ్యక్తి హామీ కూడా అడుగుతున్నాయి. లేదా ఆస్తులను చూపించాల్సి రావచ్చు. తల్లిదండ్రులు / సంరక్షకుల ఆదాయం రుణ మొత్తానికి కనీసం మూడురెట్ల వరకూ ఉంటే.. వారే పూర్తిస్థాయి హామీని ఇచ్చేందుకు అవకాశం ఉంది. అంటే, రూ.25 లక్షల కోసం రుణం కావాలనుకున్నప్పుడు సహ దరఖాస్తుదారుడి ఆదాయం ఏడాదికి కనీసం రూ.75 లక్షలు ఉండాలి.


ఒకవేళ రుణం రూ.7.5 లక్షలకు మించి కావాలనుకున్నప్పుడు రుణ మొత్తానికి సరిపడా విలువైన ఆస్తులను తనఖాగా చూపించాలి. దీంతోపాటు భవిష్యత్తు ఆదాయాన్ని బ్యాంకులకు అసైన్ చేయాలి.





కొన్ని బ్యాంకులు-విద్యారుణాలు

ఎస్‌బీఐ.. గ్లోబల్ ఎడ్-అడ్వాంటేజ్ అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్, సింగపూర్, జపాన్, హాంగ్‌కాంగ్‌లలో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లాలనుకునే వారికి ఈ పథకం కింద ఎస్‌బీఐ రుణం మంజూరు చేస్తోంది. దీనికింద కనీసం రూ.20 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.1.5 కోట్ల వరకూ రుణం పొందే వీలుంది.



రుణ మొత్తానికి సమానమైన ఆస్తిని బ్యాంకుకు తనఖాగా పెట్టాల్సి ఉంటుంది. విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం మార్జిన్ మొత్తంగా విద్యార్థి భరించాలి. మిగతా 80 శాతాన్ని రుణంగా ఇస్తుంది. స్కాలర్‌షిప్పులను మార్జిన్‌లో చూపించుకునే వీలుంది. కోర్సు కాలం, మారటోరియం సమయంలో సాధారణ వడ్డీని విధిస్తారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి బీమా పాలసీ (ఎస్‌బీఐ లైఫ్ రిన్ రక్షా) తీసుకున్న వారికి వడ్డీ రేటులో 0.50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే ఈ పాలసీ ఉంటే.. దీనిని బ్యాంకు పేరుమీద అసైన్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థినులకు 0.50 శాతం వడ్డీలో రాయితీ లభిస్తుంది.

కోర్సు పూర్తయిన ఆరు నెలల తర్వాత నుంచీ రుణాన్ని నెలసరి వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కోర్సు పూర్తయిన తర్వాతా అనివార్య కారణాలతో సరైన ఆదాయం పొందలేక, రుణం చెల్లింపు చేయలేకపోతే 15 ఏళ్లదాకా మారటోరియం వ్యవధిని పొందే అవకాశం ఉంది. ఈ సమయంలో సాధారణ వడ్డీని విధిస్తారు.

బరోడా స్కాలర్ స్కీం

ఈ పథకంలో కనీస రుణ మొత్తం రూ.20 లక్షలు. విద్యార్థి కోర్సు ఫీజు మొత్తంలో 15 శాతం భరించాలి. రుణ మొత్తంలో 1 శాతం (గరిష్ఠంగా రూ.10 వేలు) పరిశీలనా రుసుముగా వసూలు చేస్తారు. మొదటి విడత రుణం మంజూరు సమయంలో దీనిని తిరిగిచ్చేస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత ఏడాది లేదా ఉద్యోగం వచ్చిన తర్వాత ఆరునెలల పాటు (ఏది ముందయితే అది) మారటోరియం వ్యవధిగా వ్యవహరిస్తారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు-ఉడాన్

దేశ, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు పలు పథకాలను అందిస్తోంది. ఇందులో విదేశీ విద్యాభ్యాసానికి ప్రత్యేకంగా ఉడాన్‌ను అందిస్తోంది.



అవసరం, విద్యార్థి, తల్లిదండ్రుల తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి రుణ మొత్తాన్ని నిర్ణయిస్తుంది. గరిష్ఠంగా రూ.20 లక్షల వరకూ రుణం ఇస్తుంది. రూ.4 లక్షల వరకూ ఎలాంటి మార్జిన్ మొత్తమూ అక్కర్లేదు. రూ.4 లక్షలకు మించి రుణం కావాలనుకున్నప్పుడు 15 శాతం మార్జిన్‌మనీ అవసరం. రుణాన్ని 15 ఏళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ముందస్తు చెల్లింపు రుసుములు లేవు. మీ సమీపంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు శాఖలో ఈ పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ప్రభుత్వ బ్యాంకులు మాత్రమే విద్యారుణాలు అందించేవి. ప్రస్తుతం యాక్సిస్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రయివేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలూ విద్యారుణాలు అందిస్తున్నాయి. వడ్డీ రేటు ప్రాధాన్యతల్లో తేడా ఉంటుంది.

విద్యారుణం పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. కనీసం ఆరునెలలు ముందుగానే ఆయా బ్యాంకులను సంప్రదించి.. విద్యారుణానికి ఎలాంటి నియమ నిబంధనలు ఉంటాయి..? ఏయే పత్రాలు సమర్పించాలి..? వంటి విషయాలపై ముందస్తు అవగాహనకు రావడం మంచిది.

- వి.చైతన్య

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.


మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

చిన్నారి



కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని వాహనాలు, వాటి నీడలు ఉన్నాయి. వేటి నీడ ఏదో కనిపెట్టండి!

పొడుపు కథ

నీటితో నిండుగా
పూజలో వస్తువుగా
ఎల్లప్పుడూ కాయగా
నేనుంటా గుండ్రంగా..?

జవాబు: (upside down)

జోక్ :

టీచర్ : బంటీ! అరటిపండు గురించి నీకేం తెలుసో చెప్పు

బంటి : తింటే బలపడతాం.. తొక్కితే జారిపడతాం.. టీచర్

ప్రపంచంలో పొట్టి మహిళ!



పిల్లలూ..! పొట్టిగా ఉన్నవారంటే చాలామందికి చులకన భావం. వారేదో తప్పు చేసినట్లుగా వారిని నలుగురిలో ఎగతాళిగా మాట్లాడుతుంటారు. పొట్టిగా ఉన్నంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని, కష్టపడితే ఎత్తుతో సంబంధం లేకుండా ఏదైనా సాధించగలరని నిరూపిస్తోంది జ్యోతి ఆంగే. ఆమె ప్రపంచంలో జీవించి ఉన్నవారిలో అతి పొట్టి మహిళగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఆమె 1993లో నాగపూర్‌లో జన్మించింది. జ్యోతి ఎత్తు 2 అడుగుల 3 అంగుళాలు. బరువు 5 కిలోలు. ఇంతకు ముందు ఈ రికార్డ్ అమెరికాకు చెందిన బ్రిడ్జెట్టా జోర్డాన్ పేరిట ఉంది. ఆమె ఇంత పొట్టిగా ఉండటానికి జన్యుపరమైన వ్యాధి కారణం. ఎముకల ఎదుగదలలో లోపం వల్ల తోటి పిల్లల్లా ఆమె ఎత్తు ఎదగలేదు. పిల్లలూ మీకొక విషయం తెలుసా? ఇండియన్ టెలివిజన్ షో బిగ్‌బాస్ 6లో ఆమె పాల్గొంది. ముంబై లోనవాలాలోని 'సెలబ్రెటీ వాక్స్ మ్యూజియం'లో జ్యోతి మైనపు బొమ్మను ఉంచారు. హాలీవుడ్ సినిమాల్లో నటించాలనేది ఆమె కల. మనం రోజువారీ ఇళ్లల్లో వాడుకునే వస్తువులన్నీ ఆమెకంటే ఎత్తులో ఉంటాయి. అందుకని జ్యోతి ఎత్తుకు తగ్గట్టు బెడ్, దుస్తులు, నగలు, భోజనం ప్లేట్లను ప్రత్యేకంగా తయారు చేయించారు. చూశారా పిల్లలూ..! మన శరీరంలో లోపాలు ఉండవచ్చు. అంత మాత్రాన మనం కుంగిపోవాల్సిన అవసరం లేదు. ఆత్మస్థయిర్యంతో మనం ముందడుగు వేస్తే విజయం వరిస్తుంది. అందుకు జ్యోతినే మంచి ఉదాహరణ. ★





పిల్లల్లారా.. రారండి!!




హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

నేను గీసిన బొమ్మ





కె.వివేక్‌బాబు, ఏడవ తరగతి,
శ్రీ ఆదర్శ హైస్కూల్,ఎస్ రాయవరం(మండలం), విశాఖజిల్లా, తిమ్మాపురం.

మిథాలీ.. నువ్వు మెన్స్ జట్టుకు కోచ్ కావాలి!



టీవీ షోలో షారుఖ్ ఖాన్ వ్యాఖ్యలు

ముంబయి : మిథాలీరాజ్.. ప్రపంచ మహిళల క్రికెట్‌లో మకుటం లేని మహరాణి. భారత్‌ను రెండు సార్లు ప్రపంచకప్ ఫైనల్స్‌కు తీసుకెళ్లటంలో మిథాలీ రాజ్ పాత్ర కీలకం. ప్రపంచ వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు సొంతం చేసుకున్న మిథాలీ రాజ్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన పిమ్మట కోచ్ అవతారం ఎత్తాలని బాలీవుడ్ బాద్‌షా షారుఖ్‌ఖాన్ అభిలాష. అది కూడా, భారత పురుషుల జట్టుకు మిథాలీరాజ్ కోచ్‌గా ఉంటే చూడాలని ఉందని షారుఖ్ మనోగతం వెల్లడించాడు. ప్రస్తుతానికి ఇది ఆచరణ సాధ్యమా అనిపించినా, టెక్నికల్‌గా మిథాలీరాజ్ మంచి బ్యాట్స్ వుమెన్, మ్యాచ్ వ్యూహాల్లో దిట్ట. కాబట్టి భవిష్యత్‌లో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేం. ఇక ప్రపంచకప్ మ్యాచుల సందర్భంగా పుస్తకాలు చదువుతూ కనిపించిన మిథాలీరాజ్ అందరి దృష్టి తనవైపునకు తిప్పు కున్నది. మ్యాచ్ సమయంలో ఏకాగ్రత చెదరకుండా, ప్రశాంతచిత్తంతో ఉండి, మెరుగైన ప్రదర్శన చేసేందుకు పుస్తకాలు చదువుతానని మిథాలీ బుక్ రీడింగ్ రహస్యం చెప్పేసింది.

షారుఖ్ : ఏదో ఒక రోజు మిమ్మల్ని పురుషుల జట్టుకు కోచ్‌గా చూడాలని అనుకుంటున్నాను

మిథాలీ : ఎప్పుడూ నేను అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే కోరుకుంటాను (షారుఖ్ వ్యాఖ్యలను స్వాగతిస్తూ)

ఓటమి అంచుల్లో ఇంగ్లాండ్

యాషెస్ ఆఖరి టెస్టు

సిడ్నీ : మార్ష్ సోదరుల మెరుపు సెంచరీలు, నాథన్ లియాన్ మాయాజాలంతో సిడ్నీ టెస్టులో ఇంగ్లాండ్ ఓటమి అంచుల్లో నిలిచింది!. రెండో ఇన్నింగ్స్‌లో 93/4తో కొనసాగుతున్న ఇంగ్లాండ్ మరో 210 పరుగుల వెనుకంజలో ఉంది. కెప్టెన్ జో రూట్ (42 నాటౌట్), బెయిర్‌స్టో (17 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. అలెస్టర్ కుక్ (10), మలన్ (5)లను లియాన్ వెనక్కి పంపగా.. స్టోన్‌మన్ (0), విన్సె (18)లు పేసర్లకు పడిపోయారు. అంతకముందు సోదర ద్వయం షాన్ మార్ష్ (156), మిచెల్ మార్ష్ (101) శతక మోత మోగించగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ను 649/7 వద్ద డిక్లేర్ చేసింది. పైనీ (38), కమిన్స్ (24)లు ఆఖర్లో దుమ్మురేపారు. యాషెస్ సిరీస్‌లో నేడు ఆఖరు రోజు ఆట. ఇప్పటికే టాప్ ఆర్డర్‌ను అవుట్ చేసిన ఆసీస్.. నేడు విజయానికి మరో 6 వికెట్ల దూరంలో నిలిచింది. కెప్టెన్ జో రూట్ ఎన్ని సెషన్ల పాటు కంగారూలను నిలువరిస్తాడనేది ఆసక్తికరం. ఆస్ట్రేలియా ఇప్పటికే 3-0తో యాషెస్ సిరీస్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



రూట్ వేలికి గాయం కావడంతో చికిత్స చేస్తున్న వైద్యుడు

నేను రెఢీ

ఆస్ట్రేలియన్ ఓపెన్‌పై జకోవిచ్

మెల్‌బోర్న్ : 23 గ్రాండ్‌స్లామ్స్ విజేత సెరెనా విలియమ్స్ రానన్నది. ఐదుసార్లు రన్నరప్ ఆండీ ముర్రే కుదరదన్నాడు. ఆసియా సింహనాదం నిషికోరి సైతం నిష్క్రమణ బాట పట్టాడు. దీంతో ఏడాది తొలి టెన్నిస్ పండుగ, ఆస్ట్రేలియన్ ఓపెన్ కళ తప్పుతుందా అనిపించింది. దీనికి తోడు ఆరు సార్లు విజేత నొవాక్ జకోవిచ్ ఫిట్‌నెస్‌పై అనుమానాలు రేకెత్తగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ గాయం దెబ్బ తప్పదేమో అనిపించింది. కానీ టెన్నిస్ ప్రియులు, గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులకు మాజీ వరల్డ్ నెం.1, సెర్బియా చిన్నోడు నొవాక్ జకోవిచ్ తీపి కబురు చెప్పాడు. 'ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నేను రెడీ' అంటూ సోషల్ మీడియాలో ప్రకటించాడు. నిరుడు వింబుల్డన్ మధ్య నుంచే వైదొలిగిన జకోవిచ్ మళ్లీ పోటీ టెన్నిస్‌లో కనిపించలేదు. ముబడాల వరల్డ్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్, ఖతార్ ఓపెన్‌లలోనూ జకోవిచ్ పాల్గొనలేదు. కానీ ఆదివారం మెల్‌బోర్న్‌లో సాధన మొదలెట్టేసిన జకోవిచ్.. స్వేచ్ఛగా ఆడుతూ కనిపించాడు. 12 గ్రాండ్‌స్లామ్స్ నెగ్గినా ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో ఉన్న జకోవిచ్.. ఫిట్‌నెస్ సహకరిస్తే పురుషుల సింగిల్స్ టైటిల్‌కు ఇప్పటికీ ప్రధాన పోటీదారుడే. ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జనవరి 10 నుంచి అర్హత మ్యాచులు, జనవరి 15 నుంచి ప్రధాన టోర్నీ ఆరంభం కానున్నది.



స్టెయిన్ అవుట్

పునరాగమనంలో మళ్లీ గాయం



కేప్‌టౌన్ : ప్రపంచ క్రికెట్‌లో మేటీ పేసర్. సఫారీ క్రికెట్ విజయాల్లో కీలక పాత్రధారి. గాయంతో ఏడాదికి పైగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇప్పుడిప్పుడే కోలుకొని భారత్‌తో ఫ్రీడం సిరీస్‌లో అడుగుపెట్టాడు. తొలి టెస్టు తొలి రోజు శిఖర్ ధావన్, తర్వాతి రోజు వృద్ధిమాన్ సాహాలను అవుట్ చేసిన స్టెయిన్ పునరాగమనంలో తనలోని పేస్ సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. కానీ పునరాగమనంలో తొలి మ్యాచ్‌లోనే మళ్లీ గాయాల పాలవుతాడని ఎవరు మాత్రం ఊహిస్తారు. కానీ డెల్ స్టెయిన్ విషయంలో దురదృష్టశావత్తూ అదే జరిగింది. రెండో రోజు బౌలింగ్ వేసేందుకు రనప్ సమయంలో స్టెయిన్ గాయానికి గురయ్యాడు. ఎడమ కాలి మడమ పట్టేసింది. దీంతో బంతి వేయకుండానే స్టెయిన్ మైదానం వీడాడు. స్కాన్, ఎక్స్‌రే రిపోర్టులు పరిశీలించిన దక్షిణాఫ్రికా వైద్య బృందం స్టెయిన్‌కు 4-6 వారాల విశ్రాంతి అవసరమని తెలిపింది. దీంతో స్టెయిన్ అధికారికంగా తొలి టెస్టుకు మాత్రమే కాదు అనధికారికంగా సిరీస్ మొత్తానికీ దూరమయ్యాడు. చీలమండ వైద్య నిపుణులను సంప్రదించి అవసరమైతే వేగవంతమైన రికవరీ కోసం శస్త్రచికిత్సకూ వెళ్లేందుకు క్రికెట్ దక్షిణాఫ్రికా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. 'స్టెయిన్ ఇప్పుడే గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేశాడు. మళ్లీ ఇలా కావటం బాధగా ఉంది. ఇది మంచి పరిణామం కాదు. స్టెయిన్ లేకపోయినా మేం విజయం కోసమే పోరాడుతామని' అని మరో సీమర్ కగిసో రబాడ తెలిపాడు. ఇప్పటికే ఏడాదికిపైగా విరామం, మళ్లీ గాయంతో స్టెయిన్ కెరీర్ ముగిసినట్టేనని అభిప్రాయం వినిపిస్తోంది. కానీ మార్చిలో ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో లేదంటే భారత్‌తోనే పరిమిత ఓవర్ల పోటీకి స్టెయిన్ తిరిగి వస్తాడని సీఎస్ఏ దీమా వ్యక్తం చేస్తోంది.

ఇండియా-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆట కొనసాగలేదు. వర్షం కారణంగా స్టేడియంలో వర్షపు నీరు చేరడంతో ఆట కొనసాగటం కష్టంగా వుండటంతో మూడో రోజు ఆటకి అంతరాయం ఏర్పడింది. దీంతో స్టేడియంలో కవర్లు కప్పి వుంచారు.



ప్రణవ్ మళ్లీ మెరిశాడు

కాలేజ్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ



ముంబయి : సరిగ్గా రెండేండ్ల క్రితం స్కూల్ క్రికెట్‌లో 1009 పరుగుల ప్రపంచ రికార్డుతో క్రికెట్ వరల్డ్‌ను తనవైపుకు తిప్పుకున్నాడు ముంబై కుర్రాడు ప్రణవ్ ధన్‌వాడె. గుర్తింపు పొందిన క్రికెట్‌లో ఇప్పటివరకూ ప్రణవ్ పరుగులే అత్యధిక వ్యక్తిగత స్కోరు. సూపర్ ఇన్నింగ్స్‌తో తర్వాతి సచిన్‌గా కొనియాడబడి, ముంబయి క్రికెట్ అసోసియేషన్ నుంచి నెలకు రూ. పది వేల ప్రోత్సాహకం సైతం పొందాడు. కానీ తదనంతర కాలంలో ప్రణవ్ టాప్ క్లాస్ క్రికెట్ ఆడటంలో తీవ్రంగా విఫలమయ్యాడు. నిరుడు నవంబర్‌లో ఏకంగా ఎంసీఏ అందించే పది వేల రూపాయల ప్రోత్సాహకాన్ని సైతం స్వచ్ఛందంగా వదులుకున్నాడు. అప్పటి నుంచి మరింత కసితో సాధన చేస్తోన్న ప్రణవ్.. తాజాగా కళాశాల క్రికెట్‌లో మళ్లీ మెరిశాడు. జుంజున్‌వాలా కాలేజ్ తరపున ఆడిన ప్రణవ్ గురునానక్ కాలేజ్‌పై విరుచుకుపడ్డాడు. 35 ఫోర్లు, మూడు సిక్సర్లతో ఏకంగా 236 పరుగులు సాధించాడు. 'వికెట్ తొలుత తడిగా ఉన్నది. కానీ మ్యాచ్ సాగుతున్న కొద్ది బ్యాటింగ్‌కు సహకరించింది. దీంతో పరుగుల వరద పారించాను' అని ప్రణవ్ తెలిపాడు. యాదృచ్ఛికంగా 2016 జనవరిలో ప్రణవ్ 1009 పరుగులతో వెలుగులోకి రాగా, రెండేండ్ల తర్వాత అదే రోజు డబుల్ సెంచరీతో మళ్లీ మెరవటం విశేషం.

బాడీ బిల్డర్స్ జాతీయస్థాయి పతకాలను సాధించాలి

పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి

ప్రజాశక్తి-యానాం

బాడీ బిల్డింగ్ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులు జాతీయస్థాయిలో గెలిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాంలో ఆదివారం అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆల్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ ఎంపికలు ఎనిమిది విభాగాల్లో జరిగాయి. ఈ ఎంపికలో మాస్టర్స్ 40 నుంచి 50 ఏళ్లలోపు, ఆల్ ఇండియా జూనియర్స్ 21 ఏళ్లలోపు, వికలాంగులకు తదితర కేటగిరీల్లో ఎంపికలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డింగ్ అసోసియేషన్, యానాం బాడీబిల్డింగ్ ఆధ్వర్యాన మంత్రి మల్లాడి సహకారంతో ఈ పోటీలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 4 నుంచి 7 వరకూ పంజాబ్ రాష్ట్రం లుధియానాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారని ఎపి బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డూరి రమణమూర్తి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు మంత్రి మల్లాడి మెమోంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో యానాం బాడీబిల్డింగ్ అసోసియేషన్ నాయకులు అరదాని దినేష్, యానాం లయన్స్‌క్లబ్ నాయకులు కాపగంటి సుమన్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి మల్లాడి

ఓవరాల్ ఛాంపియన్ శ్రీకాకుళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు స్మారక 37వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌గా శ్రీకాకుళం జిల్లా నిలిచింది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర మాస్టర్ అసోసియేషన్, శాప్, వే ఫౌండేషన్, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ నెల ఐదు నుంచి నిర్వహించిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అతిథ్య శ్రీకాకుళం జట్టు క్రీడాకారులు అన్ని వయో విభాగాల్లో పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. రెండో స్థానంలో గుంటూరు జిల్లా నిలిచింది. ఛాంపియన్‌గా పురుషుల విభాగంలో శ్రీకాకుళం, గుంటూరు, మహిళల విభాగంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి కె.రామ్మోహన్‌నాయుడు హాజరై విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, డిఎస్‌డిఒ బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి ఖాశీం ఖాన్ పాల్గొన్నారు.



ఛాంపియన్ ట్రోఫీని అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కులాల మధ్య చంద్రబాబు చిచ్చు

మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలి

వైసిపి అధికార ప్రతినిధి మోపిదేవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమలుకాని హామీలిచ్చి అడ్డదారుల్లో అధికారంలోకొచ్చిన చంద్రబాబు తన అధికారాన్ని నిలుపుకోవడానికి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మోపిదేవి వెంకటరమణ విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. మత్స్యకారుల్ని అవమానించిన సిఎం చంద్రబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సముద్రంపై ఆధారపడి జీవించే వారంటే సిఎంకు అంత చులకనా అని ఆయన ప్రశ్నించారు. మత్స్యకారుల ఓట్లతో గెలిచింది మరిచిపోవడమే కాకుండా, వారిని ఎస్టీల్లో చేరుస్తానన్న హామీని తుంగలో తొక్కారన్నారు. కాపుల్ని బిసీల్లోకి, బోయల్ని ఎస్టీల్లోకి చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, మత్స్యకారులకు మాత్రం అన్యాయం చేశారన్నారు. సిఎం చేసిన తప్పు ఒప్పుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని మంత్రి గంటా, ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి కొందరు పెద్దలు సిఎం వద్దకు వెళ్తే కులాల గురించి ఆందోళనలు చేస్తే తాటతీస్తా...తమాషాగా ఉందా అంటూ అవమానించారని మోపిదేవి పేర్కొన్నారు. అలాంటి బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరన్నారు. 1970లోనే మత్స్యకారుల్ని ఎస్సీల్లో చేర్చడానికి ప్రయత్నాలు జరిగాయన్నారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి మత్స్యకారుల్ని ఎస్టీల్లో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపినా సాంకేతిక కారణాలతో ఆ బిల్లు ఆమోదం కాలేదన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉత్తుత్తి వాగ్దానాలిచ్చిన చంద్రబాబు ఆటల్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు సాగనివ్వరని మోపిదేవి తెలిపారు.

'సూరంపల్లి' ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు

సిఐటియు ప్రధాన కార్యదర్శి గఫూర్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా సూరంపల్లి జిఎస్ అల్లాయిస్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. గాయపడిన వారికి పూర్తి వైద్యాన్ని అందించి, కోలుకునే వరకు యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రమాదానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిని గఫూర్‌తో పాటు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, కె స్వరూపరాణి, ఎవి నాగేశ్వరరావు కార్మికుల్ని ఆస్పత్రిలో ఆదివారం పరామర్శించారు. ఈ ఘటనకు రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల్లో భాగంగా ఫ్యాక్టరీల అధికారులు తనిఖీలు చేయొద్దని, యాజమాన్యాలకు సహకరిస్తేనే పెట్టుబడులొస్తాయనేది ముఖ్యమంత్రి ఆలోచన అని గఫూర్ పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వ హత్యగానే భావించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ప్రమాదాలు జరగ కుండా ఫ్యాక్టరీల శాఖను పటిష్టం చేయాలని, తనిఖీలు జరిపి ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నా ప్రాణాలకు ముప్పు

సినీ విమర్శకుడు కత్తి మహేశ్

ప్రెస్‌క్లబ్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ప్రాణాలకు ముప్పు ఉందని సినీ విమర్శకుడు కత్తి మహేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. తన తల్లి,భార్యను బయటకు చెప్పలేని విధంగా బూతులు తిడుతుంటే చూస్తూ ఊరుకోలేనన్నారు. పవన్‌కళ్యాణ్, ఇతరులపై తాను చేసిన వ్యాఖ్యలపై బహిరంగంగా చర్చించేందుకు ఆహ్వానిస్తే ఎవరూ ముందుకు రాలేదన్నారు. పవన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయలేదని, రాజకీయ కోణంలోనే మాట్లాడానని చెప్పారు. ఆదివారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తాను పది ప్రశ్నలు వేస్తే, ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేని పవన్, ఆయన అభిమానులు తన తల్లిని, భార్యను నోటితో చెప్పలేని విధంగా బూతులు తిడుతున్నారన్నారు. తనను సామాజిక బహిష్కరణ చేయాలని కోన వెంకట్ చేసిన డిమాండ్‌పై స్పందిస్తూ, ఓ దళితుడిగా తాను ఎన్నోసార్లు సామాజిక బహిష్కరణను ఎదుర్కొన్నానన్నారు. సినీ పరిశ్రమ నుంచి కూడా బహిష్కరించారన్నారు. రేణుదేశాయ్ తన రెండో వివాహం గురించి ఒక్క మాట ప్రస్తావిస్తే, పవన్ ఫ్యాన్స్ రెచ్చిపోయారని, ఆమె పెళ్లి చేసుకున్న వ్యక్తిని చంపేస్తామని హెచ్చరించారని ఆయన గుర్తుచేశారు. అభిమానుల వ్యాఖ్యల్ని పవన్ ఖండించలేదని, ఇక ఆయన ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. ప్రశ్నిస్తానని, ప్రజలకు అండగా ఉంటానని చెప్పే పవన్, అభిమానుల్ని కంట్రోల్ చేయలేకపోతున్నారని విమర్శించారు.



తాను ఓ సాధారణ మనిషినని, తనపై అభిమానులు చేస్తున్న విమర్శలను, దాడిని పవన్ అడ్డుకోలేకపోతున్నారన్నారు. ప్రెస్‌క్లబ్‌లో కత్తి మహేశ్ మీడియా సమావేశం నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న పవన్ అభిమానులు అక్కడకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పరిస్థితిని ముందే ఊహించిన పోలీసులు ప్రెస్‌క్లబ్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పవన్ అభిమానుల్ని ప్రెస్‌క్లబ్ లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. కత్తికి వ్యతిరేకంగా అభిమానులు నివాదాలు చేశారు. మీడియా సమావేశం ముగిశాక, కత్తి మహేశ్ అక్కడ నుంచి వెళ్లిపోయేంత వరకూ పోలీసులు పరిస్థితిని సమీక్షించారు.

మెరిసిన మారిన్, సాయిప్రణీత్

అవాదె వారియర్స్‌పై హైదరాబాద్ విజయం

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్-3



చెన్నై : హైదరాబాద్ హంటర్స్ అదరగొట్టింది. స్టార్ షట్లర్ కరొలినా మారిన్, బి. సాయిప్రణీత్‌లు మెరిసిన వేళ బలమైన అవాధె వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. ఐదు మ్యాచుల్లో క్లీన్‌స్వీప్ చేసిన హంటర్స్ ప్లే ఆఫ్ ఆశల్ని సజీవంగా నిలుపుకున్నది. అవాధె స్టార్స్ సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు సింగిల్స్ మ్యాచుల్లో పరాజయం పాలయ్యారు. వీరిద్దరి ఓటమితో అవాధె ఓటమి ఖాయమైంది. తొలుత మెన్స్ డబుల్స్‌లో హంటర్స్ జోడీ కిడో, సియోంగ్‌లు 14-15, 15-6, 15-11తో చంగ్, మన్‌లను ఓడించింది. తొలి మెన్స్ సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్ హోరాహోరీ పోరులో ఓడిపోయాడు. 13-15, 15-9, 15-14తో కశ్యప్‌పై లీ హ్యూన్ (హైదరాబాద్) గెలుపొందాడు. అవాధె శ్రీకాంత్ సింగిల్స్‌ను ట్రంప్‌గా ఎంచుకున్నది. కానీ మిత్రడు సాయిప్రణీత్ చేతిలో 10-15, 10-15తో శ్రీకాంత్ వరుస సెట్లలో తలొగ్గాడు. దీంతో అవాధె రుణాత్మక పాయింట్‌కు దిగజారింది. హైదరాబాద్ ట్రంప్ మ్యాచ్‌లో కరొలినా మారిన్ 15-5, 15-7తో సైనాపై అలవోకగా నెగ్గింది. ఆఖర్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో బద్రీనాథ్, రాంకీరెడ్డి 15-9, 15-9తో అవాధె జంటను ఓడించారు. దీంతో హైదరాబాద్ ఐదు మ్యాచుల్లో నెగ్గి ఆరు పాయింట్లు సాధించగా, అవాధె ట్రంప్ మ్యాచ్‌లోనూ ఓటమితో రుణాత్మక పాయింట్‌తో మ్యాచ్‌ను ముగించింది.

టార్గెట్ ప్రపంచకప్

క్రైస్ట్‌చర్చ్ : కోచ్ రాహుల్ ద్రవిడ్ మార్గదర్శకత్వంలో టీమ్ ఇండియా ప్రపంచకప్ కోసం అన్ని విధాలా సిద్ధమైందని భారత అండర్-19 ప్రపంచకప్ కెప్టెన్ పృథ్వీ షా అన్నాడు. ఆదివారం జరిగిన అధికారిక విందులో పాల్గొన్న పృథ్వీ షా 'ఇక్కడికొచ్చి వారమైంది. కొన్ని మ్యాచులు ఆడాం. అంతా సవ్యంగా సాగుతోంది. జట్టు సన్నద్ధత బాగుంది. మా గోల్ ప్రపంచకప్ సాధించటమే. రాహుల్ ద్రవిడ్ కోచింగ్ మార్గదర్శకత్వంలో ఇక్కడి నుంచి ప్రపంచకప్‌తోనే వెళ్లాలని వచ్చాం' అని అన్నాడు. సోమవారం నుంచి అర్హత మ్యాచులు జరుగనుండగా, జనవరి 13 నుంచి ప్రధాన మ్యాచులు ఉంటాయి. అదే రోజున ఆస్ట్రేలియాతో భారత్ తొలి మ్యాచ్ ఆడనున్నది. న్యూజిలాండ్‌లో జరుగుతున్న అండర్-19 ప్రపంచకప్‌లో 16 జట్లు పాల్గొంటున్నాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68